www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 10-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 252 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి మ.1.47 తదుపరి సప్తమి, నక్షత్రం: మఖ రా.2.44 తదుపరి పుబ్బ, వర్జ్యం: మ.2.33-4.10, దుర్ముహూర్తం: ఉ.11.45-12.29, అమృతఘడియలు: రా.12.17-1.55, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.37 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




**3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం..**
## మూడంచెల వ్యూహం


భావితరాల కోసం తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్
ఆర్థిక, సమ్మిళిత, సుస్థిరవృద్ధి దిశగా ముందడుగు
రాష్ట్ర వారసత్వ సంపద, సంస్కృతికి పెద్దపీట
'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'లో దార్శనిక పత్రాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

## 1100కోట్లతో కాఫీ ప్లాంట్



తెలంగాణలో ఫ్రీజ్ కాఫీ ప్లాంటు త్వరలో ఏర్పాటు చేస్తాం
పెట్టుబడులకు రాష్ట్రం అనువైన ప్రదేశం
ఫోర్త్‌సిటీ ఏర్పాటు మంచి ఆలోచన
'ఆంధ్రజ్యోతి'తో వింటేజ్ కాఫీ మేనేజింగ్ డైరెక్టర్ బాలకృష్ణ

### కాదనలేక పోయా



యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి చైర్మన్‌గా ఉండాలని సీఎం రేవంత్ అడిగారు. తిరస్కరిద్దామనుకున్నా. అయితే అది తెలంగాణకే పరిమితం కాదని, ఇండియా భవిష్యత్తు అని చెప్పారు. ఆయనకు రాష్ట్ర అభివృద్ధిపై ఉన్న స్పష్టత, పేదల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్న తపన నా మనసును మార్చేశాయి. సీఎం మాటలు విన్న తర్వాత నో చెప్పలేకపోయా. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ప్రజలే కేంద్ర బిందువుగా ఉంది.

- ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూప్ చైర్మన్

### తెలంగాణ రోల్ మోడల్



తెలంగాణ రాష్ట్రం సాంకేతికత, వ్యవసాయం, సమగ్ర అభివృద్ధి రంగాల్లో తనకుతానుగా దూసుకెళ్తోంది. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు వివిధ రంగాల్లో తెలంగాణ ఒక రోల్ మోడల్‌గా మారింది. 2014లో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం... ప్రస్తుతం ఉన్నతస్థాయికి చేరుకుంది. భవిష్యత్తుపై ఒక శక్తిమంతమైన ఆశాభావంతో సాగులోంది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం ప్రారంభ సవాళ్లను అధిగమించి అభివృద్ధిలో ముందడుగు వేస్తోంది.

- టోనీ బ్లెయర్, బ్రిటన్ మాజీ ప్రధాన మంత్రి

## 5 వేల కోట్ల పెట్టుబడులు



సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రాజెక్టులు, డేటా సెంటర్ల ఏర్పాటు
విద్యుత్ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలి
'ఆంధ్రజ్యోతి'తో యూపీసీ సీఈవో అలోక్ కుమార్ నిగమ్



## పేదరికం, వివక్ష నిర్మూలనకే..

**రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ**
సీఎంగా అవకాశం ఇచ్చిన నిరుపేదలకు న్యాయం చేయాలన్నదే నా నిబద్ధత
వికసిత్ భారత్‌లో రాష్ట్ర వాటా 10శాతానికి
హాస్టళ్లు వేర్వేరుగా ఉంటే వివక్ష ఎలా పోతుంది?.. అందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
విద్యపై ఖర్చు.. భవిష్యత్తుకు పెట్టే పెట్టుబడి
ముగింపు కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

**ఫ్యూచర్ సిటీతో 13లక్షల ఉద్యోగాలు**
9 లక్షల మందికి ఆవాసాలు: మంత్రి శ్రీధర్‌బాబు

**జపాన్, కొరియా తరహాలో.. సినీ గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్**
పాన్ వరల్డ్ స్థాయికి తెలుగు సినిమా
రాష్ట్రంలో సినీ స్కిల్స్ వర్సిటీ అవసరం
'సినిమా రైజింగ్' సదస్సులో వక్తలు

**2036 ఒలింపిక్స్‌లో పతకాల సాధనే లక్ష్యం**
వెయ్యి ఎకరాల్లో శాటిలైట్ స్పోర్ట్స్ సిటీ
క్రీడాకారుల సంక్షేమానికి సంస్కరణలు: శ్రీహరి



# డబుల్ రైజింగ్

వివరాలు 10, 11, 12, 13లో

## అంచనాలకు మించి రెండింతల పెట్టుబడుల వెల్లువ

## రెండు రోజుల్లో రూ.5.75 లక్షల కోట్లకు ఎంవోయూలు

రెండోరోజు రూ.3.32 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు
పెట్టుబడుల్లో సగానికి సగం హరిత ఇంధనానిదే
1.60 లక్షలకుపైగా ఉద్యోగాలకు అవకాశం
మిగిలిన పెట్టుబడులతో మరో లక్ష కొలువులకు చాన్స్
ఫార్మా, డేటా పార్కులు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లోనూ పెట్టుబడులు
70 వేల కోట్లతో గిగావాట్ డేటా పార్క్‌కు ఇన్‌ఫ్రాకీ ఒప్పందం
కొత్త కార్ల తయారీకి భారత్ గరుడ రూ.2,100 కోట్లు
బయోలాజికల్-ఈ 3500 కోట్లు.. భారత్ బయోటెక్ వెయ్యి కోట్లు
యూనిట్ల విస్తరణకు అరబిందో, హెటిరో గ్రూపులు ముందుకు
పర్యాటక రంగంలో 7,045 కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు

రెండేళ్ల ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా డబుల్ బొనాంజా! తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సులో రెండింతల పెట్టుబడులు! తెలంగాణ ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తే.. దాదాపు రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు! ఒక్క హరిత ఇంధన రంగంలోనే మూడు లక్షల కోట్ల రూపాయలకు ఎంవోయూలు! ఈ ఒక్క రంగంలోనే 1.60 లక్షలకుపైగా ఉద్యోగాలకు అవకాశం! మిగిలిన పెట్టుబడులతో మరో లక్షకుపైగా ఉద్యోగావకాశాలు! అంతేనా.. సదస్సులో సీఎం రేవంత్ 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు! రాష్ట్ర భవిష్యత్తుకు 3 మూల స్తంభాలు (ఆర్థిక వృద్ధి, సమ్మిళిత వృద్ధి, సుస్థిర అభివృద్ధి); మూడు ఉత్ప్రేరకాలు (సాంకేతికత, ఆవిష్కరణ, సమర్థ ఆర్థిక నిర్వహణ, సుపరిపాలన); మూడంచెల వ్యూహం (క్యూర్, ప్యూర్, రేర్)తోపాటు పది కీలక వ్యూహాలతో రోడ్ మ్యాప్‌ను రూపొందించారు! రాష్ట్ర ప్రజలు కోరుకున్న స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలను అందించేందుకే ఈ డాక్యుమెంట్‌ను రూపొందించామని సీఎం వ్యాఖ్యానించారు! వెరసి, పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ధ్యేయంగా రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సదస్సు గ్రాండ్ సక్సెస్ అయింది! అంతేనా.. 2 రోజుల సదస్సులో గత పదేళ్ల పాలనకు సంబంధించి ఒక్క విమర్శ కూడా చేయకుండా రేవంత్ పరిణతిని ప్రదర్శించారని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు!!



## అన్ని రంగాలు ఒకేసారి అభివృద్ధి చెందేలా ప్రణాళిక

అనేక కొత్త సంస్కరణలు, పెద్ద ప్రాజెక్టులు ప్రారంభించాం
మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
తెలంగాణ రోడ్ సెక్టార్ పాలసీని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

## 1.58 లక్షల కోట్ల పెట్టుబడులు



భారత్‌లో ఏఐ రంగంలో మౌలిక వసతులు, నైపుణ్యాల పెంపునకు సహకరిస్తాం
ప్రధానితో భేటీ అనంతరం మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రకటన 2
ఆసియాలోనే ఇది తమ భారీ పెట్టుబడి అని వెల్లడి
ఇందులో ఎక్కువ భాగం హైదరాబాద్‌కు వచ్చే అవకాశం
నగరంలో ఇప్పటికే 'ఇండియా సౌత్ సెంట్రల్ క్లౌడ్ రీజియన్'



## ప్రజల్ని వేధించేలా ఉండొద్దు

**నిబంధనలు వ్యవస్థల్ని సరిచేసేలా ఉండాలి**

ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి
ఇండిగో సంక్షోభం నేపథ్యంలో ఎన్డీయే ఎంపీల భేటీలో మోదీ వ్యాఖ్య
ఇండిగో విమాన సర్వీసుల్లో 10% కోత.. అవి ఇతర సంస్థలకు
సంక్షోభం నేపథ్యంలో పౌర విమానయాన శాఖ చర్యలు
విమానయాన రంగంలో ఆధిపత్యాన్ని రూపుమాపుతాం
ఎంత పెద్ద సంస్థ అయినా సరే వదిలిపెట్టం: రామ్మోహన్‌నాయుడు

న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా విమాన ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులపాలు చేసిన ఇండిగో సంక్షోభంపై ప్రధాని మోదీ స్పందించారు. విమానాల నిర్వహణ లోపాలతో ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు తలెత్తవద్దని స్పష్టం చేశారు. చట్టాలు, నిబంధనలు ఏవైనా సరే వ్యవస్థలను సరిచేసేలా ఉండాలే తప్ప.. ప్రజలను వేధించవద్దని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో ఎన్డీయే ఎంపీలతో జరిగిన సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'విమాన విధుల సమయ నియంత్రణ (ఎఫ్‌డీటీఎల్)' రెండో దశలోని కఠిన నిబంధనల కారణంగా.. పైలట్లు,

మిగతా 2వ పేజీలో...



## ష్.. గప్‌చుప్!

ముగిసిన తొలివిడత పంచాయతీ ఎన్నికల ప్రచారం
రేపే పోలింగ్.. మధ్యాహ్నం తర్వాత కౌంటింగ్, ఫలితాలు
ముగిసిన మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పంచాయతీ పోరులో తొలివిడత సర్పంచ్, వార్డుసభ్యుల స్థానాల ఎన్నికలకు సంబంధించిన ప్రచార పర్వం మంగళవారం సాయంత్రానికి ముగిసింది. తొలివిడతలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 189 మండలాల్లోని గ్రామాల్లో గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఆ వెంటనే ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో సర్పంచ్ స్థానాలకు సగటున నలుగురు చొప్పున అభ్యర్థులు పోటీ పడుతుండగా.. వార్డులకు సగటున 2.3 చొప్పున అభ్యర్థులు తలపడనున్నారు. ఈసీ వివరాల

మిగతా 3వ పేజీలో...

## నువ్వు జైలుకు ఎందుకెళ్లావ్?

నీ కుక్క పేరు కూడా విస్కీ అని పెట్టుకున్నావు
నీ భర్తకు హైదరాబాద్‌లో ఆస్తులు ఎక్కడివి?
బతుకమ్మ పేరిట కోట్లాది రూపాయలు వసూలు
హరీశ్‌ను పంపేయాలని, కేటీఆర్‌ను అరెస్టు చేయించాలని కుట్రలు
నీలాంటి కుక్కలు చాలా మొరుగుతుంటాయి
కవితపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఫైర్



**అధికారం పోయాక విజయ్ దివసేలా?**
కవిత విమర్శలు

కూకట్‌పల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావును బయటికి పంపించేందుకు, రేవంత్‌రెడ్డితో కలిసి కేటీఆర్‌ను అరెస్టు చేయించేందుకు కవిత కుట్ర పన్నారని ఆరోపించారు. తద్వారా బీఆర్ఎస్‌లో అంతా తానే కావాలని ఆమె చూస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం తనతో సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలనుద్దేశించి కవిత చేసిన వ్యాఖ్యలపై మాధవరం కృష్ణారావు మంగళవారం విలేకరుల సమావేశంలో

మిగతా 14వ పేజీలో...




### భారత్ బియ్యంపై పన్నులేస్తా

భారతీయులు సుంకాలు చెల్లించాల్సిందే
దిగుమతిపై ఏమైనా మినహాయింపులున్నాయా?
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
భారత్ బియ్యాన్ని ఎందుకు రానిస్తున్నారు?
అమెరికా వ్యవసాయరంగ ప్రతినిధులతో భేటీలో ట్రంప్ రుసరుస 2

### పదో తరగతి పరీక్షలు మార్చి 14 నుంచి

6 పరీక్షలు.. నెల రోజులపాటు నిర్వహణ
సీబీఎస్‌ఈ తరహాలో పరీక్షల మధ్య విరామం
షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ
నెల రోజుల పాటు పరీక్షలతో విద్యార్థులపై మానసిక భారం: ఉపాధ్యాయ సంఘాలు 14

### మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిపై అభిశంసన

లోక్‌సభ స్పీకర్‌కు విపక్ష ఎంపీల నోటీసులు
'మదురై' ఆలయం వద్ద దీపం వెలిగించుకోవచ్చని జస్టిస్ స్వామినాథన్ తీర్పు 2
ఆ తీర్పు వివాదాస్పదం అవ్వడంతో న్యాయమూర్తిపై చర్యలకు డీఎంకే డిమాండ్

### 'సర్' అధికార్లకు బెదిరింపులా?



ఈ ధోరణి గందరగోళానికి దారితీస్తుంది: సుప్రీంకోర్టు
రాష్ట్రాలు సహకరించకపోతే మా దృష్టికి తీసుకురండి 2
అప్పుడు అధికారుల భద్రతకు తగిన ఆదేశాలు జారీచేస్తాం
ఎన్నికల సంఘానికి సూచన

## 'సర్' అధికారులకు బెదిరింపులా?

» ఈ ధోరణి తీవ్ర గందరగోళానికి దారితీస్తుంది: సుప్రీం



న్యూఢిల్లీ, డిసెంబరు 9: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పశ్చిమబెంగాల్ సహా ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2.0 (సర్) రూపకల్పనలో నిమగ్నమైన బూత్ స్థాయి, ఇతర అధికారులకు బెదిరింపులు రావడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇలాంటివాటిని తమ దృష్టికి తీసుకురావాలని ఎన్నికల సంఘానికి సూచించింది. లేదంటే ఈ ధోరణి తీవ్ర గందరగోళానికి దారిస్తుందని హెచ్చరించింది. 'సర్' నిర్వహణలో ఎదురవుతున్న పరిస్థితులపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. జాబితా తయారీలో ఉన్న అధికారులకు ఆయా రాష్ట్రాలు సహకరించకపోతే తీవ్రంగా పరిగణించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి సారథ్యంలోని ధర్మాసనం మంగళవారం ఈసీకి సూచించింది. రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించకపోవడం, ప్రక్రియలో ఆటంకాలు సృష్టించడం వంటి చర్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని.. అప్పుడు అధికారుల భద్రతకు సంబంధించి తగిన ఆదేశాలు జారీచేస్తామని ఈసీ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది రాకేశ్ ద్వివేదికి ధర్మాసనం సూచించింది. కాగా పరిస్థితి మరింత దిగజారితే రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో ఉన్న పోలీసులను డిప్యుటేషన్‌లో ఉంచడం మినహా మార్గం లేదని ద్వివేది పేర్కొన్నారు. అయితే.. ఈ దిశగా... ఎన్నికల ప్రక్రియ లాంఛనంగా మొదలయ్యేంతవరకు ఈసీ చర్యలు తీసుకోజాలదని ధర్మాసనం స్పష్టం చేసింది.

## మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిపై అభిశంసన

» లోక్‌సభ స్పీకర్‌కు నోటీసులిచ్చిన విపక్ష ఎంపీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 9: మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్‌పై ప్రతిపక్ష ఎంపీలు అభిశంసన నోటీసు ఇచ్చారు. జస్టిస్ స్వామినాథన్‌ను తొలగించాలని డీఎంకే నేతృత్వంలో విపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లాకు ఈ నోటీసులు అందజేశారు. మదురైలోని సుబ్రమణ్య స్వామి ఆలయం సమీపంలో దీపస్తంభంపై దీపం వెలిగించుకోవచ్చని జస్టిస్ స్వామినాథన్ తీర్పు ఇచ్చారు. ఈ దీపస్తంభం ఆనుకుని దర్గా ఉండడంతో ఈ తీర్పుపై వివాదం నెలకొంది. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాలు అమలు కాకపోవడంతో కొంతమంది మతపెద్దలు వెళ్లి దీపం వెలిగించుకోవచ్చని, వారికి సీఆర్‌పీఎఫ్ బలగాలు రక్షణ ఇవ్వాలని ఈ నెల 3న న్యాయస్థానం మరోసారి ఆదేశాలిచ్చింది. అయితే, మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను మదురై జిల్లా కలెక్టర్ హైకోర్టు మదురై బెంచ్‌లో సవాలు చేయడంతో ధర్మాసనం దానిని కొట్టివేసింది. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాలను డీఎంకే ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాలు చేసింది. ఈ వరుస పరిణామాలతో జస్టిస్ స్వామినాథన్‌ను తొలగించాలని కోరుతూ డీఎంకే పార్లమెంటరీ పార్టీ నేత కనిమొళి, లోక్‌సభా పక్ష నేత టీఆర్ బాలు, ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ తదితరుల నేతృత్వంలోని బృందం స్పీకర్ ఓం బిర్లాకు వందమంది ఎంపీల సంతకాలతో కూడిన లేఖను అందజేసింది.

### 2019 నుంచి 29 మంది నక్సల్స్ అగ్రనేతలు హతం

న్యూఢిల్లీ, డిసెంబరు 9: వామపక్ష తీవ్రవాదంపై ఉక్కుపాదం మోపామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2019 నుంచి భద్రతా బలగాల చేతిలో 29 మంది టాప్ నక్సల్స్ కమాండర్లు హతమవ్వగా, ఈ ఒక్క ఏడాదిలోనే 14 మంది సెంట్రల్ కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులను ఎన్‌కౌంటర్ అయ్యారని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ మంగళవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా వివరాలు వెల్లడించారు. 2014లో పదిగా ఉన్న మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల సంఖ్య 2025 అక్టోబరు నాటికి ఐదుకు తగ్గిందని తెలిపారు. అదేవిధంగా వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల సంఖ్య ఈ కాలంలో భారీగా 126 నుంచి 11కు తగ్గిపోయిందని పేర్కొన్నారు.

## ఓట్ చోరీ.. అతిపెద్ద దేశద్రోహ చర్య

» ఈసీతో కలిసి బీజేపీ చేస్తోంది అదే..: రాహుల్



న్యూఢిల్లీ, డిసెంబరు 9: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘంతో కలిసి ఓట్ చోరీ చేయడం ద్వారా అతిపెద్ద దేశద్రోహ చర్యకు పాల్పడిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడానికి బీజేపీ ఎన్నికల సంఘాన్ని వాడుకుంటోందని మండిపడ్డారు. ఎన్నికల సంస్కరణలపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో రాహుల్ గాంధీ మాట్లాడారు. సీఈసీని కాపాడేందుకు ఏకంగా చట్టాలనే మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల చోరీపై తమ వద్ద అనేక ఆధారాలు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల సంస్కరణలపై కేంద్రానికి మూడు ప్రశ్నలు వేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను నిర్ధారించే యంత్రాంగాలను ప్రభుత్వం పునరుద్ధరిస్తుందా? సర్ ప్రక్రియపై అనేక రాష్ట్రాల నుంచి ఫిర్యాదులు అందుతున్న సమయంలో.. ఓటర్ల జాబితాలను తారుమారు చేయకుండా నిరోధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఈసీ నియామకాలు, నిర్ణయాలు రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఎందుకు కనిపిస్తున్నాయి? ఈ విషయంలో పారదర్శక సంస్కరణలు చేపట్టడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందా? అని ప్రశ్నించారు.

## జనగణన సిబ్బందిని నియమించండి

» రాష్ట్రాలు, యూటీలకు భారత రిజిస్ట్రార్ జనరల్ ఆదేశం

న్యూఢిల్లీ, డిసెంబరు 9: జనగణన సిబ్బంది నియామకాన్ని జనవరి 15లోగా పూర్తి చేయాలని భారత రిజిస్ట్రార్ జనరల్ ఆదేశించారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు తాజాగా సర్క్యులర్ జారీ చేశారు. ఈ ప్రక్రియలో గణకులు, పర్యవేక్షకులు ప్రాథమికంగా సమాచార సేకరణ బాధ్యతలు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. ఈ సర్క్యులర్ ప్రకారం.. 700 నుంచి 800 మంది జనాభా వివరాలు సేకరించే బాధ్యతను ఒక ఎన్యూమరేటర్‌కు అప్పగించాలి. ప్రతి ఆరుగురు ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ ఉంటారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించడానికి వీలుగా ఈ రెండు విభాగాల్లోనూ అదనంగా 10% మంది సిబ్బందిని నియమించాలి. టీచర్లు, గుమస్తాలు, రాష్ట్ర ప్రభుత్వ, స్థానిక సంస్థల అధికారులను ఎన్యూమరేటర్లుగా నియమించవచ్చు.



విద్యార్థి భగవేందర్‌ను అభినందిస్తున్న డీజీపీ శివధర్‌రెడ్డి

## డీజీపీ శివధర్‌రెడ్డికి గ్రీన్ ఎనర్జీ సర్టిఫికెట్

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డికి గ్రీన్ ఎనర్జీ సర్టిఫికెట్ లభించింది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో ఎనర్జీపై నిర్వహించిన క్విజ్ పోటీలో ఆయన పాల్గొన్నారు. క్విజ్‌లో అడిగిన పది ప్రశ్నలకు ఆయన సరైన సమాధానాలు ఇచ్చారు. దీంతో డీజీపీకి నిర్వాహకులు గ్రీన్ ఎనర్జీ చాంపియన్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. అనంతరం ఘట్కేసర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫైన్ ఆర్ట్స్ స్టాల్‌ను శివధర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థి ఎ.భగవేందర్ ఆయన చిత్రపటాన్ని గీసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఈ బాలుడి కళా నైపుణ్యాన్ని డీజీపీ శివధర్‌రెడ్డి అభినందించారు.

# ప్రజల్ని వేధించేలా ఉండొద్దు

(మొదటిపేజీ తరువాయి)

సిబ్బందిని సర్దుబాటు చేయలేక ఇండిగో విమాన సంక్షోభం తలెత్తిన విషయం తెలిసిందే. ఇలాంటి సమయంలో.. నిబంధనలు, చట్టాలు ప్రజలను ఇబ్బంది పెట్టొందంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఎన్డీయే ఎంపీల భేటీ అనంతరం ప్రధాని వ్యాఖ్యల వివరాలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు వెల్లడించారు. "విమాన నిర్వహణ సమస్యల కారణంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగవద్దని ప్రధాని సూచించారు. ప్రజలెవరికైనా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకూడదన్నారు. నిబంధనలు, చట్టాలు ముఖ్యమే అయినా, అవి వ్యవస్థలను సరిచేసేలా ఉండాలేగానీ.. ప్రజలను వేధించేలా ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజల జీవితాలను మరింత మెరుగుపరిచేలా సంస్కరణలు అమలు చేయడంపై ఎంపీలు దృష్టిపెట్టాలని సూచించారు" అని రిజిజు చెప్పారు.

### ఇండిగో సర్వీసులలో 10 శాతం కోత

వందలాది విమానాల రద్దుతో సంక్షోభానికి తెరతీసిన ఇండిగో సంస్థపై కేంద్రం చర్యలకు దిగింది. శీతాకాలానికి సంబంధించి ఆ సంస్థకు కేటాయించిన సర్వీసులలో 10% కోత పెట్టింది. ఈ సర్వీసులను ఇతర విమానయాన సంస్థలకు కేటాయించనున్నట్టు తెలిపింది. ఇండిగో సర్వీసులలో 5% కోతపెడుతున్నట్టు మంగళవారం మధ్యాహ్నం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ప్రకటించగా.. దానిని రెండింతలు చేస్తూ, 10% కోతపెట్టాలని ఆదేశించినట్టు పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు సాయంత్రం 'ఎక్స్'లో వెల్లడించారు. ఇండిగో సర్వీసులను స్థిరీకరించడంకోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఇప్పటివరకు ఇండిగోకు రోజుకు 2,200కుపైగా సర్వీసుల నిర్వహణకు అనుమతి ఉంది. తాజా కోతతో అవి రోజు కు 1,950కంటే తగ్గిపోనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

### సంక్షోభంపై ఉన్నత స్థాయి సమీక్ష

పెద్ద సంఖ్యలో విమానాల రద్దు నేపథ్యంలో వివరణ ఇవ్వాలని ఇండిగోకు డీజీసీఏ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. మంగళవారం ఈ అంశంపై డీజీసీఏ, పౌర విమానయాన శాఖ అధికారులు సమీక్ష నిర్వహించారు. షోకాజ్



ఎన్డీయే ఎంపీల సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ, రాజ్‌నాథ్ సింగ్, నడ్డా, అమిత్ షా తదితరులు

నోటీసులపై ఇండిగో ఇచ్చిన వివరణను పరిశీలించి, సర్వీసులలో కోత విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. "శీతాకాలం విమానాల షెడ్యూల్‌కు సంబంధించి నవంబరులో 64,346 సర్వీసులకు అనుమతిస్తే.. 59,438 సర్వీసులు మాత్రమే నిర్వహించింది. 403 విమానాలకు అనుమతిస్తే.. అక్టోబరులో 339, నవంబరులో 344 విమానాలను మాత్రమే నడిపించగలిగింది. కేటాయించిన షెడ్యూల్‌ను పూర్తిస్థాయిలో నిర్వహించే సామర్థ్యం ఉందని ఇండిగో నిరూపించలేకపోయింది. ఈ నేపథ్యంలో సర్వీసులలో 5% కోత విధిస్తున్నాం. ముఖ్యంగా ఎక్కువ డిమాండ్ ఉన్న మార్గాల్లో ఈ కోత వర్తిస్తుంది" అని డీజీసీఏ మంగళవారం ప్రకటించింది. ఇక ప్రధాన విమానాశ్రయా ల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు పౌర విమానయాన శాఖ ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించారు. వారు విమానాశ్రయాల్లో ప్రయాణికులకు అవసరమైన సాయం అందిస్తున్నారు.

### 400కుపైగా విమానాలు రద్దు

ఇండిగో విమాన సర్వీసుల రద్దు మంగళవారం కూడా కొనసాగింది. దేశవ్యాప్తంగా 400కుపైగా సర్వీసులు రద్దయ్యాయి. అందులో ఒక్క శంషాబాద్ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే 78 సర్వీసులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ప్రయాణికులకు సంబంధించిన లగేజీ డెలివరీ కూడా ఇంకా చాలా వరకు పెండింగ్‌లోనే ఉంది. దీనితో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు చాలా వరకు సర్వీసులను పునరుద్ధరించామని, ప్రయాణికుల రీఫండ్ల చెల్లింపు కూడా వేగంగా జరుగుతోందని ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. విమానాల రద్దుతో ప్రయాణికులకు కలిగిన ఇబ్బందిపై క్షమాపణలు చెప్పారు. అనంతరం ఇండిగో ఒక ప్రకటన జారీ చేసింది. మంగళవారం 1,800 సర్వీసులు నిర్వహించామని, బుధవారం 1,900 సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపింది.

### ఆధిపత్యాన్ని రూపుమాపుతాం..: రామ్మోహన్‌నాయుడు



భారత పౌర విమానయాన రంగంలో నెలకొన్న రెండు సంస్థల ఆధిపత్యాన్ని(డ్యుయోపాలీని) రూపుమాపుతామని.. కొత్త విమానయాన సంస్థలను ప్రోత్సహిస్తామని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. మంగళవారం ఆయన లోక్‌సభలో ఈ అంశంపై మాట్లాడారు. పౌర విమానయాన రంగంలో పోటీని పెంచడానికి కేంద్రం కృషి చేస్తోందని తెలిపారు. భారత్ ఇప్పటికే మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా ఉందని, ఈ వృద్ధి దెబ్బతినకుండా కాపాడతామని చెప్పారు. ఇండిగో విమానాల రద్దు సంక్షోభం కుదురుకుంటోందని.. విమాన సర్వీసు లు యథాతథ స్థితికి చేరుకుంటున్నాయన్నారు. దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో రద్దీ తగ్గిందని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు. డీజీసీఏ దర్యాప్తు నివేదికల ఆధారంగా ఈ సంక్షోభానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రణాళికా లోపాలు, నిబంధనలు పాటించడంలో వైఫల్యం ద్వారా ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే సంస్థ ఎంత పెద్దదైనా సరే వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.




## నెహ్రూది ముమ్మాటికీ ద్రోహమే..

» బుజ్జగింపు రాజకీయాల కోసమే 'వందేమాతరం'లో విభజన: అమిత్ షా

న్యూఢిల్లీ, డిసెంబరు 9: వందేమాతర గేయం విషయంలో తొలి ప్రధాని నెహ్రూది ముమ్మాటికీ ద్రోహమేనని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. బుజ్జగింపు రాజకీయాల కోసం వందేమాతర గీతంలో తెచ్చిన విభజనే దేశ విభజనకు దారితీసిందని ఆయన మండిపడ్డారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్ల నిండిన సందర్భంగా మంగళవారం రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం తరఫున అమిత్‌షా చర్చను ప్రారంభించారు. వందేమాతరం చర్చను, పశ్చిమ బెంగాల్ ఎన్నికలతో ముడిపెట్టడం సరికాదన్నారు. బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. వందేమాతరం గేయాన్ని మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్ తాకట్టు పెట్టిందని విమర్శించారు. మజ్లిస్ ఒత్తిడికి తలొగ్గి చాలా ఏళ్లుగా కాంగ్రెస్ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించలేదని ఆరోపించారు. వందేమాతర గేయంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలనే నిర్ణయం ఒక్క నెహ్రూ మాత్రమే తీసుకున్నది కాదని రాజ్యసభలో కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో నెహ్రూతోపాటు మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్, మదన్ మోహన్ మాలవీయా, ఆచార్య జేబీ కృపలానీ కూడా ఉన్నారని, కాంగ్రెస్ నిర్ణయాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ సమర్థించారని గుర్తు చేశారు. కాగా, ముస్లింలు మరణాన్నైనా అంగీకరిస్తారు కానీ.. బహు దేవతారాధనను ఎప్పటికీ అంగీకరించబోరని జమైత్ ఉలేమా-ఐ-హింద్ చీఫ్ మౌలానా అర్షద్ మదనీ అన్నారు. వందేమాతర గీతంపై పార్లమెంటులో జరుగుతున్న చర్చపై మంగళవారం ఆయన 'ఎక్స్'లో స్పందించారు. వందేమాతరం గేయంలో మాతృభూమిని దుర్గామాత అనే దేవతతో పోల్చారని, 'అమ్మా నేను నిన్ను పూజిస్తాను..' అనే అర్థం ఇచ్చేలా గేయం ఉంటుందన్నారు. ఇది ముస్లిం మత విశ్వాసాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

## ఇండిగో సంక్షోభం నుంచి పాఠాలు నేర్చుకోండి

» రైలు డ్రైవర్లకు కూడా పరిమిత పని గంటలు ఉండాలి

» రైల్వే శాఖకు లోకోపైలట్ల డిమాండ్

న్యూఢిల్లీ, డిసెంబరు 9: ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో సంక్షోభం వేళ.. రైలు డ్రైవర్లు కూడా పనిగంటల విషయంలో పలు డిమాండ్లు వినిపించారు. అలసటను తగ్గించడానికి, ప్రమాదాలను నివారించడానికి తమకు కూడా పరిమిత పని గంటలు ఉండాలని స్పష్టం చేశారు. రైల్వేలో లోకో పైలట్ల ఖాళీలను భర్తీ చేయడంలో జరుగుతున్న జాప్యంపై ఇప్పటికే పోరుబాటలో ఉన్న వారు.. హేతుబద్ధమైన పని గంటలు, శాస్త్రీయ రోస్టర్ ప్రణాళికతో పాటు మెరుగైన కార్మిక సంస్కరణల కోసం డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ సంక్షోభం నుంచి పాఠాలు నేర్చుకోవాలని రైల్వే శాఖకు సూచించారు. ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎంతో సహనం ప్రదర్శిస్తోందని, ప్రభుత్వ లోకోపైలట్ల విషయంలో మాత్రం కఠినంగా ఉంటోందని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్‌ఆర్ఎస్ఏ) న్యూస్18 మీడియా కథనం వేదికగా విమర్శించింది. ఎంతో కాలం నుంచి లోకో పైలెట్లు ఎదుర్కొంటున్న సమస్యలే ఎయిర్‌లైన్స్‌లో ప్రస్ఫుటంగా కనిపించాయని ఆ యూనియన్ తెలిపింది. ఫేటిగ్ రిస్క్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎఫ్ఆర్ఎంఎస్) ఆధారిత పనిగంటల వ్యవస్థను రైల్వే అవలంభించాలని, రోజు వారీగా ఆరు గంటల పని, ప్రతి షిఫ్ట్ తర్వాత 16 గంటల విశ్రాంతి తదితర అంశాలను ఆ యూనియన్ ప్రస్తావించింది.

## భారత్ బియ్యంపై పన్నులేస్తా

» భారతీయులు సుంకాలు చెల్లించాల్సిందే

» అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



వాషింగ్టన్, డిసెంబరు 9: భారత్ నుంచి అమెరికాలోకి వచ్చే బియ్యంపై మరిన్ని పన్నులు విధిస్తానని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. భారతీయులు పన్నులు చెల్లించాల్సిందేనని హూంకరించారు. అమెరికా వ్యవసాయ, వ్యవసాయాధారిత పరిశ్రమల ప్రతినిధులతో ఆయన సోమవారం వైట్‌హౌస్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రంప్ క్యాబినెట్‌లోని పలువురు మంత్రులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమెరికా వ్యవసాయ రంగానికి ట్రంప్ 12 బిలియన్ డాలర్ల సహాయ ప్యాకేజీ ప్రకటించారు. ఈ సమావేశంలో బియ్యం ఉత్పత్తి, దిగుమతులపై చర్చ రాగా.. లూసియానాలో కెన్నడీ రైస్ మిల్ పేరుతో బియ్యం వ్యాపారం చేస్తున్న మెరిల్ కెన్నడీ అధ్యక్షుడి కి భారత్‌పై ఫిర్యాదు చేశారు. భారతీయ వ్యాపారులు అమెరికా మార్కెట్లలోకి వారి బియ్యాన్ని కుమ్మరిస్తున్నారని, పన్నులపై మినహాయింపులు కూడా పొందుతున్నారని తెలిపారు. ఇతర దేశాల బియ్యం రాకతో అమెరికా బియ్యానికి డిమాండ్ లేక స్థానిక ఉత్పత్తిదారులు, వ్యాపారులు నష్టపోతున్నారని తెలిపారు. దీంతో ఆ దేశాలేవి? అని ట్రంప్ ప్రశ్నించగా, ఆమె.. 'ఇండియా, థాయ్‌లాండ్.. చైనా కూడా ప్యూర్టోరికోకు కొన్నేళ్లుగా తన బియ్యాన్ని తరలిస్తోంది. మీరు విధించిన అధిక పన్నులు పనిచేస్తున్నాయి. కానీ, మాకు ఇంకా పెద్ద నిర్ణయాలు కావాలి' అని అన్నారు. వెంటనే ట్రంప్.. వాణిజ్య శాఖ మంత్రి బెసెంట్ వైపు తిరిగి.. 'ఇండియా గురించి చెప్పు? వారికి ఎందుకు అలా (బియ్యం దిగుమతికి) అనుమతిస్తున్నారు? వాళ్లు సుంకాలు చెల్లించాల్సిందే. బియ్యం దిగుమతిపై వారికి ఏమైనా మినహాయింపులు ఉన్నాయా?' అని ప్రశ్నించారు. అందుకు బెసెంట్ స్పందిస్తూ.. 'లేదు సర్.. వారితో వాణిజ్య ఒప్పందం కోసం మేము ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాం' అని సమాధానమిచ్చారు. దీంతో 'వాళ్ల (భారత్) బియ్యాన్ని మనదేశంలో కుమ్మరించటానికి వీల్లేదు' అని స్పష్టం చేశారు.

### పన్నులేసినా ప్రభావం తక్కువే..

భారత బియ్యం దిగుమతులపై ట్రంప్ పన్నులేసినా పెద్దగా ప్రభావం ఏమీ ఉండదని భారత బియ్యం ఎగుమతిదారుల సమాఖ్య (ఐఆర్ఈఎఫ్) జాతీయ అధ్యక్షుడు ప్రేమ్ గార్గ్ తెలిపారు. భారత మొత్తం బియ్యం ఎగుమతుల్లో అమెరికా వాటా 3% మాత్రమే నని చెప్పారు. 'మన బియ్యానికి ప్రధాన మార్కెట్ పశ్చిమాసియా మాత్రమే. అంతేకాదు బిర్యానీ వంటి కొన్ని వంటకాలకు భారతీయ బియ్యానికి ప్రత్యామ్నాయం లేదు. అమెరికాలో పండే బియ్యం నాణ్యతలో మన బియ్యంతో పోటీ పడలేవు. ఇప్పటికే భారత వస్తువులపై ట్రంప్ 50% టారిఫ్‌లు విధించా రు. బియ్యంపై మరిన్ని టారిఫ్‌లు వేసినా మన వ్యాపారులకు పెద్దగా నష్టం రాదు. అమెరికా ప్రజలు మాత్రం ఎక్కువ ధర చెల్లించి బియ్యం కొనాల్సి ఉంటుంది' అని ఐఆర్ఈఎఫ్ ఉపాధ్యక్షుడు దేవ్‌గార్గ్ పేర్కొన్నారు.

# చాంతాడంత దరఖాస్తు ఫారాలెందుకు!?

**పదే పదే 30-40 పేజీల దరఖాస్తులు చేసుకోవాలా!?.. పనికిరాని పేపర్ వర్క్‌కూ ఇక ముగింపు పలకాలి**

» ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, డిసెంబరు 9: "మా ప్రభుత్వ సంస్కరణలకు పూర్తిగా ప్రజలే కేంద్ర బిందువు. ఆదాయం కోసమో.. ఆర్థికాభివృద్ధి కోసమో వాటిని చేపట్టడం లేదు. ప్రజల రోజువారీ ఇబ్బందులను తొలగించడమే సంస్కరణల లక్ష్యం. తద్వారా, వారు తమ శక్తి మేరకు ఎదగాలన్నదే ఆకాంక్ష" అని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. మూడో విడతలో తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం ప్రజల జీవితాలను సులభతరం చేయడమేనన్నారు. నియమ, నిబంధనలన్నీ ప్రజలకు అనుకూలంగా ఉండాలని, చట్టాలు వారికి భారంగా పరిణమించరాదని స్పష్టం చేశారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీని ఉద్దేశించి మంగళవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం ప్రస్తుతం పూర్తిస్థాయిలో సంస్కరణల దిశలో దూసుకుపోతోందని, స్పష్టమైన దృక్పథంతో వేగంగా సంస్కరణలు కొనసాగుతున్నాయని చెప్పారు. సామాన్య ప్రజలు నిజంగా ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటో చెప్పాలని ఎంపీలను ప్రధాని మోదీ అడిగారని, అప్పుడు వారి రోజువారీ ఇబ్బందులను తొలగించేలా సంస్కరణల పథాన్ని ప్రతి ఇంటికీ చేర్చవచ్చని ఆయన అభిప్రాయపడ్డారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 30-40 పేజీల దరఖాస్తు ఫారాలు, పనికిరాని పేపర్ వర్క్ సంస్కృతికి ఇక ముగింపు పలకాలని, ఒకే పనికి పదే పదే దరఖాస్తులు చేసుకునే పద్ధతికి కూడా చరమగీతం పాడాలని తాను భావిస్తున్నానని, పౌరుల ఇంటి వద్దకే సేవలన్నీ చేరువ కావాలని ఆకాంక్షిస్తున్నానని మోదీ స్పష్టం చేశారని వివరించాయి. స్వీయ ధ్రువీకరణ పత్రాల విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా తమ ప్రభుత్వం పౌరులను విశ్వసించిందని, అందుకే, ఎటువంటి దుర్వినియోగం లేకుండా పదేళ్లపాటు కొనసాగిందని గుర్తు చేశారని తెలిపాయి. సులభతర జీవితం, సులభతర వాణిజ్యం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని మోదీ స్పష్టం చేసినట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇక, బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించిన నేపథ్యంలో సమావేశంలో ప్రధాని మోదీని ఘనంగా సత్కరించారు. సమావేశం తర్వాత ఆ వివరాలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు విలేకరులకు వివరించారు. చట్టసభ సభ్యులకు ప్రధాని మోదీ సుస్పష్టంగా దిశానిర్దేశం చేశారని, మూడో విడతలో సంస్కరణలతో దూసుకుపోవడమే ప్రభుత్వ ప్రత్యేకతని చెప్పారని తెలిపారు.


### సోనియాకు మోదీ జన్మదిన శుభాకాంక్షలు

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ 79వ పుట్టిన రోజు సందర్భంగా ప్రధాని మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సోనియా గాంధీ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని ఆయన ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోనియా నాయకత్వాన్ని కొనియాడారు. దేశానికి, పార్టీకి ఆమె అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఎక్స్ వేదికగా సోనియా గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# భారత్‌లో 1.58 లక్షల కోట్ల పెట్టుబడులు

» ఏఐ రంగంలో మౌలిక సదుపాయాలు, నైపుణ్యాల పెంపునకు సహకరిస్తాం

» మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల.. ప్రధాని మోదీతో భేటీ అనంతరం ప్రకటన



న్యూఢిల్లీ, డిసెంబరు 9: భారత్‌లో ఏఐ (కృత్రిమ మేధ) రంగంలో 1750 కోట్ల డాలర్ల (రూ.1.58 లక్షల కోట్లు) పెట్టుబడులు పెడతామని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రకటించారు. ఇది ఆసియాలోనే తమ కంపెనీకి సంబంధించి అతి పెద్ద పెట్టుబడి అని తెలిపారు. ప్రధాని మోదీతో సత్య నాదెళ్ల మంగళవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. అనంతరం ఎక్స్‌లో ఒక ప్రకటన చేశారు. 'భారత్ ఏఐ భవిష్యత్తుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు, సర్వసత్తాక సామర్థ్యాలను పెంచుకోవటంలో సాయపడేందుకు ఈ పెట్టుబడులు పెట్టనున్నాం' అని పేర్కొన్నారు. ఇదే అంశంపై మైక్రోసాఫ్ట్ ఒక ప్రకటన విడుదల చేసింది. 2026-29 మధ్య నాలుగేళ్ల వ్యవధిలో 1750 కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టనున్నామని, ఏఐని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తామని తెలిపింది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ దిశగా భారత్ అడుగులు వేస్తున్న సమయంలో.. భారతీయ వినియోగదారులకు సర్వసత్తాక (సావరీన్) పబ్లిక్ క్లౌడ్, సావరీన్ ప్రైవేట్ క్లౌడ్‌ను తాము తీసుకొస్తున్నామని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ఏఐలో శిక్షణ పొందిన మానవ వనరుల ద్వారానే భారత్ ఏఐ రంగంలో ముందడుగు వేయగలుగుతుందని పేర్కొంది. ఈ మేరకు 2030 నాటికి భారత్‌లో 2 కోట్ల మందికి ఏఐ నైపుణ్య శిక్షణ అందిస్తామని వెల్లడించింది. అడ్వాంటేజ్(ఐ) ఇండియా కార్యక్రమం కింద ఇప్పటికే 56 లక్షల మందికి శిక్షణ ఇచ్చామని తెలిపింది. భారత్‌లో 300 కోట్ల డాలర్ల (రూ.26,955 కోట్ల) పెట్టుబడులు పెడతామని ఈ ఏడాది ప్రారంభంలో తాము చేసిన ప్రకటనను గుర్తు చేస్తూ.. ఈ మొత్తాన్ని వచ్చే ఏడాది పూర్తయ్యేలోపు ఖర్చు చేస్తామని మైక్రోసాఫ్ట్ స్పష్టం చేసింది. కాగా, ప్రపంచ ఏఐ హబ్‌గా భారత్ నిలిచేందుకు మైక్రోసాఫ్ట్ తాజా పెట్టుబడులు తోడ్పడనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. క్లౌడ్ స్కేలింగ్, కంప్యూటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏఐ స్కిల్ ప్రోగ్రామ్స్, డేటా సిస్టమ్‌ల భద్రత వంటి విభాగాల్లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఆరోగ్యం, తయారీ, ప్రభుత్వ పాలన, విద్య, ఆర్థిక సేవలు తదితర రంగాలకు భారత్ ఇస్తున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పెట్టుబడులను సమన్వయపర్చనున్నట్లు మైక్రోసాఫ్ట్ తెలిపింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచం ఆధారపడదగిన టెక్నాలజీ భాగస్వామిగా భారత్ ఎదిగిన తీరుకు మైక్రోసాఫ్ట్ పెట్టుబడుల ప్రకటన తాజా సంకేతమన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుంచి ఏఐ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా భారత్ వేస్తున్న ముందంజకు ఈ పెట్టుబడులు ఇతోధికంగా దోహదం చేస్తాయన్నారు.

### తెలంగాణకు భారీగా వచ్చే అవకాశం

మైక్రోసాఫ్ట్ పెట్టుబడుల్లో గణనీయమైన మొత్తం తెలంగాణకు వచ్చే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్ కేంద్రంగా 'ఇండియా సౌత్ సెంట్రల్ క్లౌడ్ రీజియన్'ను ఏర్పాటు చేస్తామని, 2026లో ఇది పని చేయటం ప్రారంభిస్తుందని మైక్రోసాఫ్ట్ గతంలోనే ప్రకటించింది. తాజా ప్రకటనలో ఈ అంశాన్ని గుర్తు చేస్తూ.. భారత్‌లో ఇదే తమ కంపెనీకి చెందిన అతి పెద్ద సెంటర్ అవుతుందని, కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియానికి ఇది రెట్టింపు సైజులో ఉంటుందని తెలిపింది.

### ఏడాదిలో మూడు భారీ పెట్టుబడులు

మైక్రోసాఫ్ట్ తాజా ప్రకటనతో.. ఏఐ రంగంలో ఈ ఏడాది భారత్‌లోకి మూడు భారీ పెట్టుబడులు వచ్చినట్లయ్యింది. దేశంలో ఏఐ హబ్‌ను నెలకొల్పుతామని, దీనికోసం రానున్న ఐదేళ్లలో 1500 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెడతామని గూగుల్ ఈ ఏడాది అక్టోబరులో ప్రకటించింది. అదానీ గ్రూపుతో కలిసి దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు కూడా దీంట్లో భాగం. దీని తర్వాత.. బ్రూక్‌ఫీల్డ్, రిలయెన్స్ ఇండస్ట్రీస్, డిజిటల్ రియాల్టీ అనే మూడు కంపెనీలు సంయుక్తంగా డిజిటల్ కనెక్షన్ పేరిట 1100 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించాయి. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ 1750 కోట్ల డాలర్ల భారీ పెట్టుబడులపై ప్రకటన చేసింది.

# ఇందిర, రాజీవ్ ఆదర్శాలను పుణికిపుచ్చుకున్న సోనియా

- కాంగ్రెస్‌కు నష్టమని తెలిసినా.. తెలంగాణ ఏర్పాటు చేశారు
- గాంధీజీ, నెహ్రూ అడుగుజాడల్లో నడుస్తూ దేశ రాజకీయాలపై తనదైన ముద్ర వేశారు
- రాహుల్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న రేవంత్‌రెడ్డి సర్కార్ : తూర్పు జగ్గారెడ్డి

**సంగారెడ్డిలో సోనియా జన్మదిన వేడుకలు**

సంగారెడ్డి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశప్రజలు దేవతగా కొలిచే ఇందిరాగాంధీ కోడలిగా సోనియాగాంధీ దేశ రాజకీయాలపై తనదైన ముద్రవేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గాంధీ, నెహ్రూ అడుగుజాడల్లో నడుస్తూ.. ఇందిర, రాజీవ్ ఆదర్శాలను పుణికి పుచ్చుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఇస్తే కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసినా.. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని అన్నారు. యూపీఏ పాలనలో దేశ ప్రజలకు మేలు చేసేలా అనేక పథకాలను తీసుకురావడంలో సోనియా కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సోనియాగాంధీ ఆలోచనతో అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం.. పేద ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడిందని పేర్కొన్నారు. సంగారెడ్డిలో మంగళవారం జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల ముందు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గే ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి సర్కారు తూచా తప్పకుండా అమలు చేస్తోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం పంపిణీ, తెల్లరేషన్ కార్డుల జారీ, రుణమాఫీ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గం అమలు చేసి చూపిందని వివరించారు. ఆర్టీసీని మూసివేయాలని గత ప్రభుత్వం భావిస్తే.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో తిరిగి లాభాల్లోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్‌ది అని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మీడియాతోపాటు ఎవరికీ స్వేచ్ఛ లేదని, నిరసనలను ఉక్కు పాదంతో అణచివేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను పునరుద్ధరించారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలతోపాటు పోచమ్మల వాళ్లు, గంగిరెద్దుల కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


సంగారెడ్డిలో సోనియా జన్మదిన వేడుకల్లో మహిళకు కేక్ తినిపిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

# తెలంగాణకిచ్చిన హామీలు నెరవేర్చండి

- పెండింగ్‌లోనే రూ.20వేల కోట్ల విలువైన 13 రైల్ ప్రాజెక్టులు
- పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలనూ నెరవేర్చలేదు
- రాజ్యసభలో ఎంపీ రేణుకా చౌదరి ఆగ్రహం

న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి డిమాండ్ చేశారు. పదేళ్ల క్రితం ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదని ఆమె మండిపడ్డారు. మంగళవారం జీరో అవర్ రేణుకా చౌదరి ఈ అంశాన్ని లేవనెత్తారు. విభజన హామీల్లోని మొత్తం రూ.20వేల కోట్ల విలువైన 13 రైల్ ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం పార్లమెంట్, రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనే అవుతుందని చెప్పారు. 'కాజీపేట్‌లో రైల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నిర్మాణంలో పురోగతి లేదు. రైలు మార్గాల విస్తరణ ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది. దక్షిణ మధ్య రైల్వే పూర్తిగా నిర్వీర్యమైపోయింది. తెలంగాణ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టుల అన్ని పత్రాలు, సంబంధిత డీపీఆర్‌లు కేంద్రానికి సమర్పించింది. రూ.18,489 కోట్ల విలువైన 10 కీలక ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 818 కిలో మీటర్ల పనులు పరిపాలనాపరమైన అనుమతుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాయి. డోర్నకల్-మిర్యాలగూడ, రామగుండం-మణుగూరు, కరీంనగర్-హసన్‌పర్తి, భద్రాచలం-కొవ్వూరు, పఠాన్‌చెరు-ఆదిలాబాద్ సహా ఇతర ప్రాజెక్టులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇది కేంద్రం మెహర్‌బానీ కాదు.. ప్రజల హక్కు' అని రేణుకా చౌదరి అన్నారు. తెలంగాణ అభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టులపై కేంద్రం వెంటనే దృష్టిసారించాలని డిమాండ్ చేశారు.

## ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుకు సహకరించాలి

- లోక్‌సభలో ఎంపీ చామల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయడానికి కేంద్రం తగిన సహకారం అందించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లోక్‌సభలో విజ్ఞప్తి చేశారు. మంగళవారం జీరో అవర్‌లో ఆయన ఈ ప్రాజెక్టు ప్రాముఖ్యాన్ని సభలో ప్రస్తావించారు. హైదరాబాద్ చుట్టూ ఇది దాదాపు 400 కిలోమీటర్లు విస్తరించి, సుమారు 8 జిల్లాలు, 14 మండలాలను కలుపుతుందని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా చేపట్టాలని ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ. 12వేల కోట్లని ఎంపీ చామల వివరించారు. 2047నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న తెలంగాణ దార్శనికతకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ఉండబోతోందని అన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ రద్దు చేయాలి: మల్లు రవి

న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐఆర్ ప్రక్రియ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, దానిని తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ తెలంగాణ కన్వీనర్ మల్లు రవి డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపు చట్టబద్ధమైన పద్ధతిలో జరగాలని అభిప్రాయపడ్డారు. మంగళవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో విధుల నిర్వహణ ఒత్తిడి కారణంగా సిబ్బంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్‌కు ఓటర్ల నమోదు అధికారం ఉంటుంది కానీ, ఉన్న ఓట్లను తొలగించే అధికారం ఉండదని మల్లు రవి స్పష్టం చేశారు. రాజకీయ స్వార్థంతో జరుగుతున్న ఓట్ల తొలగింపు ప్రక్రియను ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## అనిల్ అంబానీ కుమారుడిపై సీబీఐ కేసు

- బ్యాంకు రుణాలను మళ్లించినట్టు ఆరోపణ

న్యూఢిల్లీ, డిసెంబరు 9: బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను వేరే అవసరాలకు మళ్లించారని ఆరోపిస్తూ ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కుమారుడు జై అన్మోల్ అనిల్ అంబానీపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఆయన ఆధ్వర్యంలోని రిలయెన్స్ హోం ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్ఎఫ్ఎల్), ఆ సంస్థ డైరెక్టర్ రవీంద్ర శరద్ సుధాకర్‌లపై కూడా కేసు పెట్టినట్టు మంగళవారం అధికార వర్గాలు తెలిపాయి. వారి చర్యల కారణంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.228 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నాయి. రిలయెన్స్ హోం ఫైనాన్స్ వ్యాపార అవసరాల కోసం యూనియన్ బ్యాంకు (పూర్వపు ఆంధ్రాబ్యాంకు) నుంచి రూ.450 కోట్లు రుణంగా తీసుకున్నారు. అయితే సకాలంలో వాయిదాలు చెల్లించకపోవడంతో 2019 సెప్టెంబరు 30న ఆ రుణాన్ని నిరర్థక ఆస్తిగా బ్యాంకు ప్రకటించింది.

# ఏసీబీకి చిక్కిన అవినీతి అధికారులు

- రూ 15.వేలు తీసుకుంటూ పట్టుబడ్డ ట్రాన్స్‌కో ఏఈ
- రూ. 20వేలు తీసుకుంటూ చిక్కిన సివిల్ సప్లయ్స్ డీటీ



ఏఈ వెంకటేశ్వర్లు, డీటీ రవీందర్‌నాయక్

వెల్దండ/షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ మంగళవారం ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కారు. నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండ సమీప గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి మీటరు మంజూరు కోసం ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లును సంప్రదించాడు. ఏఈ రూ. 20 వేలు డిమాండ్ చేయగా.. తొలుత రూ.15 వేలు ఇచ్చేందుకు బాధితుడు ఒప్పుకుని, ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల సూచనల మేరకు మంగళవారం ఏఈని తన ఇంటికి పిలిచి లంచం ఇస్తుండగా..నల్గొండ రేంజ్ ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఏఈని పట్టుకున్నారు. మరోవైపు, రంగారెడ్డి జిల్లా పౌర సరఫరా కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా పనిచేస్తున్న రవీందర్‌నాయక్ మూడు నెలల క్రితం ఫరూఖ్‌నగర్ మండలంలోని అన్నారం గ్రామ రేషన్‌షాపులో మూడు క్వింటాళ్ల బియ్యం తక్కువ ఉన్నాయని డీలర్ యాదగిరిపై కేసు నమోదు చేసి, ఆ షాపును మరో డీలర్‌కు అప్పగించారు. ఈ కేసు నుంచి తప్పించాలని డీలరు పలు మార్లు డీటీని కలవగా.. మొదట రూ.50 వేలు డిమాండ్ చేసినప్పటికీ.. తర్వాత రూ.20 వేలకు వారిద్దరి మధ్య ఒప్పందం కుదిరింది. అనంతరం డీలర్ ఏసీబీ అధికారులను కలిశాడు. ఈ క్రమంలో మంగళవారం రవీందర్‌నాయక్ షాద్‌నగర్‌కు వచ్చి డీలర్ నుంచి లంచం తీసుకుంటుండగా డీఎస్పీ ఆనంద్ బృందం వల పన్ని పట్టుకుంది.

## కేసీఆర్ దీక్ష వల్లే తెలంగాణ కల సాకారం

- మన బిడ్డలను జైల్లో పెట్టిన ట్రంప్ పేరును ఇక్కడి రోడ్డుకు పెట్టడం సిగ్గుచేటు: హరీశ్‌రావు



హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ కల సాకారమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ దీక్ష లేకపోతే డిసెంబరు 9న అప్పటి యూపీఏ సర్కారు తెలంగాణపై ప్రకటన చేసి ఉండేది కాదన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాతే 24 గంటల కరెంటు, ఇంటింటికీ నీళ్లు, కోటి ఎకరాల మాగాణి సాధ్యమైందని గుర్తు చేశారు. కేసీఆర్ అంటే పోరాటం, త్యాగమని, రేవంత్‌రెడ్డి అంటే వెన్నుపోటు, ద్రోహమని వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విజయ్ దివస్ కార్యక్రమంలో హరీశ్ మాట్లాడారు. అభివృద్ధి బాటలో నడుస్తున్న తెలంగాణను సమైక్యవాదులతో కలిసి వెనుకబడేసే కుట్రకు సీఎం రేవంత్ తెరలేపారని ధ్వజమెత్తారు. సీఎం హోదాలోనూ తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని, కాళోజీ, దాశరథి, గద్దర్‌ను తక్కువ చేసి మాట్లాడారని దుయ్యబట్టారు. పన్నులు పెంచి, వీసాలు కఠినతరం చేసి, అమెరికాలో తెలుగు పిల్లలకు బేడీలు వేసి ఇబ్బంది పెడుతున్న ట్రంప్ పేరును హైదరాబాద్ రోడ్డుకు పెట్టడం సిగ్గుచేటన్నారు. కాగా, రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ రోజే(14న) ఏపీపీ పరీక్షలు నిర్వహించడం తగదని, తక్షణం వాయిదా వేయాలని హరీశ్ డిమాండ్ చేశారు.

## బాలికపై సామూహిక అత్యాచారం

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై సామూహిక అత్యాచారం చేసిన నలుగురు వ్యక్తులను సంగారెడ్డి పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు కాగా, ఇద్దరు మేజర్లు ఉన్నారు. సంగారెడ్డి ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల బాలిక తప్పిపోయినట్లు ఆమె తల్లిదండ్రులు సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా బాలిక సికింద్రాబాద్‌లోని ఒక లాడ్జ్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి చేరుకోగా, బాలికతో పాటు మరో నలుగురు వ్యక్తులు కూడా ఉన్నట్లు తేలింది. బాలిక నాలుగు రోజుల క్రితం సంగారెడ్డి నుంచి కర్నూల్‌కు, అక్కడి నుంచి సోమవారం సికింద్రాబాద్ బస్టాండ్‌కు చేరుకుంది. బస్టాండ్‌లో ఉన్న ఆమెను మంచిర్యాలకు చెందిన నలుగురు వ్యక్తులు మాయ మాటలు చెప్పి లాడ్జ్‌కు తీసుకువెళ్లారు. అనంతరం ఆమెపై అత్యాచారం చేశారని పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సంగారెడ్డి పట్టణ సీఐ రాము నాయుడు పేర్కొన్నారు. బాలికను తల్లి తండ్రులకు అప్పగించినట్లు వివరించారు.

# జనంలేని ఊర్లో ఎన్నికల హోరు

**మూడేళ్ల క్రితమే వెంకటేశ్ ఖని గ్రామం ఖాళీ.. పూర్తిగా పాడుబడి ఆనవాళ్లు కోల్పోయిన ఊరు**

- ఎప్పుడో కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోకి ప్రజలు
- 183 ఓటర్లతో జాబితా.. రెండో విడతలో ఎన్నికలు


వెంకటేశ్ ఖని గ్రామంలో నేలమట్టం అయిన నివాసాలు

కొత్తగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆ ఊర్లో ఇళ్లు కూలిపోయాయి. జనమే లేరు. అది ఊరని చెబితే కూడా ఎవ్వరూ నమ్మరు. అయినా అక్కడ సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలలో కేవలం రికార్డుల్లో మాత్రమే ఉన్న వెంకటేశ్ ఖని అనే గ్రామం గురించే ఇదంతా! 30 ఏళ్ల క్రితం ఈ ఊరు గ్రామ పంచాయతీగా ఏర్పడింది. సింగరేణి ఓపెన్‌కాస్ట్ పీవీకే-5 కోల్‌మైన్ విస్తరణలో భాగంగా 2022లో ఈ గ్రామంలోంచి ప్రజలను ఖాళీ చేయించారు. మొత్తంగా 79 బాధిత కుటుంబాలను గుర్తించి కొత్తగూడెం కార్పొరేషన్ 5వ వార్డు పరిధిలోని గంగాబిషన్ బస్తీలో ఇంటిస్థలాలను కేటాయించారు. బాధితుల్లో కొందరు కార్పొరేషన్ పరిధిలోని అద్దె ఇళ్లలో నివసిస్తుంటే, ఇంకొందరు తమకు కేటాయించిన స్థలాల్లోనే రేకుల షెడ్లు వేసుకొని ఉంటున్నారు. వెంకటేశ్ ఖని గ్రామంలో ఒక్కరంటే ఒక్కరు కూడా లేకున్నా గ్రామ పంచాయతీ మాత్రం అలాగే కొనసాగుతోంది. ఊర్లోని జనం కార్పొరేషన్ పరిధిలోకి వెళ్లినా ఓట్లు మాత్రం ఆ ఊరి పరిధిలోనే ఉన్నాయి. తాజాగా విడుదల చేసిన పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌లో వెంకటేశ్ ఖని పంచాయతీకి రెండోవిడతలో ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం ఆ పంచాయతీలో 183 ఓటర్లున్నారు. గ్రామాన్ని నాలుగు వార్డులుగా విభజించారు. సర్పంచ్ పదవికి ముగ్గురు, వార్డుల్లో 10 మంది నామినేషన్లు వేశారు. ఎన్నికలు జరిగి.. ఎవరు గెలిచినా.. ప్రజలు లేని గ్రామాన్ని ఏం అభివృద్ధి చేస్తారు? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

## ష్.. గప్‌చుప్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం 4,236 సర్పంచ్ స్థానాలకు గాను 395 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఐదు గ్రామాల్లో ఒక్క నామినేషన్ కూడా పడలేదు. ఫలితంగా ప్రస్తుతం 3,836 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అదేవిధంగా 37,440 వార్డుసభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. అందులో 9,331 వార్డుస్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 149 స్థానాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. ప్రస్తుతం 27,960 వార్డుసభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కాగా మంగళవారం సాయంత్రంతో మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తంగా 1,678 గ్రామ పంచాయతీలకు గాను 124 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 242, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 173, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 131, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 84, ఖమ్మం జిల్లాలో 63 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మహబూబాబాద్ రూరల్ నడివాడ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి రాయపాటి బుచ్చయ్య (70) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో 9వ వార్డు నుంచి నిల్చున్న అభ్యర్థి బొలుగం పద్మ కూతురు శ్రావణి (18) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.


కుమరం భీం జిల్లా తిర్యాణిలో చలిమంట కాగుతున్న ప్రజలు

# తెలంగాణను వణికిస్తున్న చలి

- మరింత తగ్గిన ఉష్ణోగ్రతలు.. గిన్నెధరిలో 6.1 డిగ్రీలు నమోదు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, డిసెంబరు 9 : రాష్ట్రంలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోతున్నాయి. ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గిన్నెధరిలో మంగళవారం అత్యల్పంగా 6.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో 20 జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలలోపు నమోదు కావడం చలి తీవ్రతను సూచిస్తోంది. ఈ నెల 10-13 తేదీల మధ్య రాష్ట్రంలో పలు చోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6-8 డిగ్రీల మధ్య నమోదు కానున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నెల 12వ తేదీ తర్వాత రాత్రిపూట ఉష్ణోగ్రతలు మరింత పడిపోనున్నాయని, 7, 8 జిల్లాలు మినహా మిగిలిన అన్నిచోట్లా సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని పేర్కొంది. చలి తీవ్రతకు సంబంధించి ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. చలి గాలుల తీవ్రత కూడా పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. కాగా మంగళవారం అర్లి(టి) గ్రామంలో 6.3, బజార్‌హత్నూర్‌లో 7.4, కెరమెరి మండలంలో 7.7, తాంసిలో 7.9, ఆదిలాబాద్ అర్బన్‌లో 8, బోథ్ పొచ్చెరలో 8.3, తలమడుగులో 8.5, సాత్నాల, రుద్రంగి మండలంలో 8.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్ నగరంలో సోమవారం రాత్రి శేరిలింగంపల్లిలో అత్యల్పంగా 8, రాజేంద్రనగర్‌లో 8.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## దేశంలో 'కుంగుబాటు' తేల్చాలి!

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలతో డిప్రెషన్ ఆత్మహత్యల్లో 15% ఆపొచ్చు
- పీజీఐఎంఈఆర్, నిమ్హాన్స్ అధ్యయనం

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మానసిక కుంగుబాటు(డిప్రెషన్)ను గుర్తించే పరీక్షలు చేపడితే భారీగా ఆర్థిక ప్రయోజనం ఉంటుందని తాజా అధ్యయనం వెల్లడించింది. డిప్రెషన్ బాధితులను గుర్తించి, వైద్యం అందించడం ద్వారా రూ.29,100 కోట్ల నుంచి రూ.48,200 కోట్ల వరకు ఆదా అవుతుందని, డిప్రెషన్ కారణంగా జరిగే ఆత్మహత్యల్లో కనీసం 15శాతం మేరకు నివారించవచ్చని తేల్చింది. చండీగఢ్‌లోని 'పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్), బెంగళూరుకు చెందిన 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ (నిమ్హాన్స్)' సంయుక్తంగా చేసిన ఈ అధ్యయనం నివేదిక తాజాగా 'ది లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్ ఈస్ట్ ఆసియా' జర్నల్‌లో ప్రచురితమైంది. ప్రస్తుతం దేశంలో కుంగుబాటు గుర్తింపు ప్రయత్నాలేమీ జరగడం లేదని అధ్యయనం పేర్కొంది. ఇతర వ్యాధులు, మానసిక ఇబ్బందులతో వచ్చినవారిని పరీక్షించినప్పుడు యాదృచ్ఛికంగా మాత్రమే డిప్రెషన్‌ను గుర్తిస్తున్నారని తెలిపింది. ఈ క్రమంలో దేశంలో 20ఏళ్లు నిండిన వారందరికీ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో 'రోగి ఆరోగ్య ప్రశ్నావళి (పీహెచ్‌క్యూ)'-2, 9 లను ఉపయోగించి రెండు దశల స్క్రీనింగ్ చేయాలని సూచించింది. ఇప్పటికే 'ఆయుష్మాన్ భారత్' కింద 22 రకాల మానసిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని.. డిప్రెషన్ పరీక్షలనూ జోడిస్తే ప్రజారోగ్య వ్యవస్థ మరింత బలపడుతుందని పేర్కొంది.

## ఓటు హక్కు వివాదంపై సోనియాకు కోర్టు నోటీసు

న్యూఢిల్లీ, డిసెంబరు 9: భారత పౌరసత్వం రాకుండానే ఓటు హక్కు పొందారంటూ వచ్చిన ఆరోపణలపై సమాధానం ఇవ్వాలని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీకి మంగళవారం ఇక్కడి ప్రత్యేక న్యాయస్థానం నోటీసులు పంపించింది. ఢిల్లీ పోలీసులకు కూడా నోటీసు ఇచ్చింది. ఆమె 1983లో భారత పౌరసత్వం పొందగా, అంతకు మూడు సంవత్సరాల ముందుగా 1980లోనే ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకున్నారంటూ న్యాయవాది వికాస్ త్రిపాఠీ తొలుత మేజిస్ట్రేటు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది మోసం, ఫోర్జరీ కిందకే వస్తుందని తెలిపారు. దీనిని క్రిమినల్ నేరంగా పరిగణించి విచారణకు ఆదేశించాలని కోరారు. ఇందుకు ఆధారంగా ఓటరు జాబితాలోని ఒక కాగితం జిరాక్స్ కాపీకి జిరాక్స్ తీసి సమర్పించారు. విచారణ జరిపిన మేజిస్ట్రేటు కోర్టు ఆ ఆధారాన్ని ఆమోదించలేదు. ఇలాంటి అంశాలపై విచారణ జరిపే అధికారం మేజిస్ట్రేటు కోర్టుకు లేదని చెబుతూ కేసు కొట్టివేసింది. ఇది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. దీనిపై రివిజన్ పిటిషన్ దాఖలు చేయగా ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే స్వీకరించారు. సోనియా గాంధీ, పోలీసులకు నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను వచ్చే నెల ఆరో తేదీకి వాయిదా వేశారు.

# మీ నాన్నను చంపించినట్లుగా నిన్నూ చంపేస్తా

- రెండేళ్లుగా బెదిరిస్తున్నాడు.. అందుకే చంపేశా
- వెంకటరత్నం హత్యపై ప్రధాన నిందితుడి వెల్లడి!?

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంకటరత్నం (54) హత్యకు పాత కక్షలు, ఆర్థిక లావాదేవీలే కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. జవహర్‌నగర్ పరిధిలోని కాప్రాలో జరిగిన ఈ హత్య ఘటనకు సంబంధించి ఆరుగురు నిందితులు గోషామహల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. అక్కడి పోలీసులు వారిని జవహర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. ప్రధాన నిందితుడు జుమ్మేరాత్‌బజార్‌కు చెందిన చందన్‌సింగ్‌గా గుర్తించారు. మిగిలిన ఐదుగురు, అతడి గ్యారేజ్‌లో పనిచేసే స్నేహితులు.. వడ్డె వెంకటనారాయణ (సెక్యూరిటీ), నరేశ్ కుమార్ (ఆటో మెకానిక్), ఇషాన్ శర్మ (హెల్పర్), పవన్ కుమార్ (ఆటోమెకానిక్), ఆటో డ్రైవర్ నర్సింగ్‌గా గుర్తించారు. ఈ ఆరుగురు కలిసి.. సోమవారం ఉదయం 7:55కు దారికాచి వెంకటరత్నాన్ని కత్తులతో నరికి, తుపాకీతో కాల్చి చంపిన సంగతి తెలిసిందే. వెంకటరత్నాన్ని హత్య చేసేందుకు గల కారణాలపై పోలీసులు విచారించిన క్రమంలో నిందితులు పలు విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. పాతికేళ్లక్రితం ప్రధాన నిందితుడైన చందన్‌సింగ్ తండ్రి సుదేశ్‌సింగ్ వద్ద వెంకటరత్నం డ్రైవర్‌గా చేరినట్లు తెలిసింది. సుదేశ్‌సింగ్ లోకల్‌గా పేరుమోసిన రౌడీషీటర్. భూ దందాలు, సెటిల్‌మెంట్లు చేసేవాడు. అలా అతడి దందాలు ఎక్కువ కావడంతో పోలీసులకు మోస్ట్‌వాంటెడ్‌గా మారాడు. భూ దందాల్లో సుదేశ్‌సింగ్ సంపాదించిన ఆస్తులను ఎక్కువగా తాను నమ్మినబంటు అయిన వెంకటరత్నం పేరిట పెట్టినట్లు తెలిసింది. సుదేశ్‌సింగ్‌ను పోలీసులు 2001లో ఎన్‌కౌంటర్ చేశారు. వెంకటరత్నమే పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా మారి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడంతో సుదేశ్‌సింగ్‌ను పోలీసులు హతమార్చారని అతడి కుమారుడు చందన్‌సింగ్ పగ పెంచుకున్నట్లు తెలుస్తోంది. సుదేశ్‌సింగ్ చనిపోయిన తర్వాత అతడి ఆస్తులకు బినామీగా ఉన్న వెంకటరత్నం వాటిని కొట్టేసినట్లు అతడి కుమారుడు చందన్‌సింగ్ గుర్తించినట్లు తెలిసింది. ఈ క్రమంలో రెండేళ్ల క్రితమే బినామీ ఆస్తుల గురించి తెలుసుకున్న చందన్‌సింగ్ ఆస్తుల్లో కొంత భాగం తన కివ్వాలని అడిగినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే వారి మధ్య విభేదాలు తలెత్తాయి. అయితే "మరోసారి ఆస్తుల గురించి మాట్లాడితే మీ నాన్నకు పట్టిన గతే నీకూ పడుతుందని, నిన్నుకూడా చంపేస్తాను" అని వెంకటరత్నం బెదించినట్లు చందన్‌సింగ్ పోలీసులకు వెల్లడించినట్లు తెలిసింది. గత రెండేళ్లుగా వెంకటరత్నం బెదిరింపులు ఎక్కువ కావడంతో భయపడిపోయిన చందన్‌సింగ్ ఎలాగైనా వెంకటరత్నాన్ని చంపేయాలని, లేదంటే అతడు కచ్చితంగా తనను చంపేస్తాడని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితులతో కలిసి కొద్దిరోజులగా మాటువేసి, పక్కాగా రెక్కీ చేసి సోమవారం ఉదయం 7:50కి స్కూటీపై వెళ్తున్న వెంకటరత్నాన్ని వెంబడించి దారుణంగా హతమార్చినట్లు చందన్‌సింగ్ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. అయితే.. ఓ ల్యాండ్ డీలింగ్ విషయంలో వెంకటరత్నం, చందన్‌సింగ్ కాకతాళీయంగా ఎదురుపడినట్లు.. ఆ క్రమంలో తన తండ్రిని చంపించింది వెంకటరత్నమేనని చందన్‌సింగ్‌కు తెలియడం.. చందన్‌సిగ్, గతంలో తన బాస్ సుదేశ్ కుమారుడని వెంకటరత్నానికి తెలియడం, ల్యాండ్ విషయంలో జోక్యం చేసుకుంటే "మీనాన్నకు పట్టించిన గతే నీకూ పట్టిస్తాను" అని చందన్‌ను వెంకటరత్నం బెదిరించడంతో అతడే హత్యకు పథకం వేసినట్లు మరో వాదన కూడా వినిపిస్తోంది.

**SARDAR VALLABHBHAI PATEL NATIONAL POLICE ACADEMY**
Government of India (Ministry of Home Affairs)
Hyderabad: 500 052

No.11011/1/2022/Estt/A1(E-18097) Dated: 08 December, 2025

Applications are invited from eligible individuals for filling up one vacant post of 'Network Administrator' in Sardar Vallabhbhai Patel National Police Academy, Hyderabad - 500052, purely on outsourcing basis for a period upto 31.03.2026 or till filling up the post on regular basis, whichever is earlier. The details and application form are available in Academy website http://www.svpnpa.gov.in and click on 'Vacancies' tab.

Sd/- Administrative Officer (Estt.)

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్ కార్యాలయం : హనుమకొండ
Rc.No.:D1/1594/2025 తేది:08.12.2025
ఈ-ప్రొక్యూర్మెంట్ సంక్షిప్త టెండర్ రద్దు ప్రకటన
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా రెవెన్యూ ఎక్స్‌పెండిచర్ కొనుగోలు మరియు సరఫరా నిమిత్తం డిస్ప్లే ఇన్ ఫైర్ సేఫ్టీ అండ్ BE-ఫైర్, నాగపూర్ ద్వారా అధీకృత సంస్థల నుండి https://tender.telangana.gov.in ఈ టెండర్ ప్లాట్ ఫామ్ ద్వారా టెండర్లు ఆహ్వానించబడినవి. ఇట్టి టెండర్ ఐ.డి. నెంబర్ 649529 గలది. తేది.10.12.2025 రోజున జరగవలసినది పరిపాలనా పరమైన కారణాల వలన ఈ-ప్రొక్యూర్మెంట్ సంక్షిప్త టెండర్ ప్రక్రియ పూర్తిగా రద్దు చేయనైనది.
సం/- చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ & అదనపు కలెక్టర్ (రెవెన్యూ), హనుమకొండ
DIPR RO No.11833-PP/CL/ADVT/1/2025-26, తేది. 09.12.2025

**The Andhra Pradesh Mineral Development Corporation Limited**
APMDC
Door No.294/1D, 100 Feet Road (Tadigadapa to Enikepadu Road), Kanuru, Vijayawada-521137, Andhra Pradesh, India.
Tel: +91-866-2429999, Fax: +91-866-2429977, Email: contracts-ho@apmdc.in

**NOTICE INVITING TENDER**
Selection Of Agency for Supply and Installation of 13 Digital Touch Panels in Classrooms at APMDC Public School, Mangampet in Annamaiah District.
Tender No: APMDC/P&C/Supply and Installation of Digital Touch Panels/2025-26, Dt.10.12.2025.
APMDC invites E-tenders from reputed contractors for Selection Of Agency for Supply and Installation of 13 Digital Touch Panels in Classrooms at APMDC Public School. Mangampet. For more information on the eligibility criteria, tender fees, timelines and other details, please visit e-procurement website of GoAP (www.apeprocurement.gov.in) or APMDC website (www.apmdc.ap.gov.in). The tender document is available for download from 10.12.2025 and the last date for bid submission is 30.12.2025.
Place: Vijayawada Sd/-Managing Director
Date: 10th December, 2025 The A. P. Mineral Development Corporation Limited
DIPR R.O.No.4645PP/CL/ADVT/1/1/2021-22, Dt.-09.12.2025

**GOVERNMENT OF INDIA**
**OFFICE OF THE PRINCIPAL COMMISSIONER OF CENTRAL TAX, HYDERABAD**
**GST BHAVAN, L.B. STADIUM ROAD, BASHEERBAGH, HYDERABAD – 500004**

**RECRUITMENT OF MERITORIOUS SPORTS PERSONS IN CENTRAL TAX AND CUSTOMS DEPARTMENT – HYDERABAD ZONE-2025**

Applications are invited from meritorious sports persons who have represented the Country / State/ University in the International/National/Inter University (conducted by Inter University Sports board)/Khelo India Tournaments for appointment to the post of Four (04) Tax Assistant (Level – 4 in the pay matrix (Rs. 25,500-81,100)) under Sports quota. Further details regarding the discipline of Sports earmarked for recruitments, educational qualifications and other eligibility conditions are available at departmental websites http:// www.cbic.gov.in and https://cgsthyderabadzone.gov.in. The application completed in all respects should reach the undersigned on or before **02.01.2026.** For candidates domiciled in North-Eastern States, Andaman & Nicobar Islands, Lakshadweep, Jammu & Kashmir, the application should reach the the undersigned on or before **09.01.2026.**

Sd/-
Additional Commissioner (CCA)
O/o The Principal Commissioner of Central Tax, Hyderabad
GST Bhavan, L.B. Stadium Road, Basheerbagh,
Hyderabad – 500004

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## గోవాలో ఘోరం

**గోవా** నైట్‌క్లబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం మన వ్యవస్థల బాధ్యతారాహిత్యానికీ, ప్రజల ప్రాణాలపట్ల ఉన్న నిర్లక్ష్యానికీ నిలువెత్తు నిదర్శనం. అధికారులు ఏమాత్రం నిబంధనలకు అనుగుణంగా నడుచుకున్నా, పాతికమంది ప్రాణాలు హరించిన ఈ దుర్ఘటన జరిగేది కాదు. అర్పోరా గ్రామ సమీపంలోని ఈ నైట్‌క్లబ్‌లో ప్రమాదం సంభవించగానే రెండేళ్ళుగా అది ఏ అనుమతులూ లేకుండా, చట్టవిరుద్ధంగా నడుస్తున్న సత్యాన్ని అప్పుడే తెలుసుకున్నట్టుగా మొఖంపెట్టి, సంతాపంతో పాటు, బాధితకుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని ప్రకటించింది. ఈ దేశంలో అక్రమాలు యథేచ్ఛగా సాగిపోతూంటాయి, నేరాలూ ఘోరాలూ జరగ్గానే ఎప్పటిలాగానే ప్రభుత్వాలు కొత్తగా ఆశ్చర్యపోతూంటాయి. దుర్ఘటనలకు కారణమైన సంస్థలకో, పరిశ్రమలకో, వాహనాలకో అనుమతులే లేవని తేల్చేస్తే తప్పు వాటిమీదకు పోతుందని, ప్రజలదృష్టి మారిపోతుందని ప్రభుత్వాలకు ఓ నమ్మకం.

రెండేళ్ళక్రితం గ్రామపంచాయితీ ఈ నైట్‌క్లబ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నోటీసులు ఇచ్చి, మరో ఆర్నెల్ల తరువాత కూల్చివేతకు సిద్ధపడితే, స్థల యజమాని పై స్థాయిలో ప్రయత్నాలు చేసుకొని, యథాతథస్థితి కొనసాగేట్టుగా చూసుకున్నాడట. రాష్ట్ర శాసనసభలో ఈ నైట్‌క్లబ్ ప్రస్తావన ఆగస్టులో వచ్చి, మొత్తంగా అక్రమ నైట్‌క్లబ్‌లమీద చర్చ జరిగింది కనుక, ఇదేమీ ప్రభుత్వం దృష్టికి రాని, దానికి తెలియకుండా పోయిన అంశమేమీ కాదు. కఠినచర్యలు ఇప్పుడు హామీ పడుతున్న ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మూడునెలల క్రితమే ఆ పనిచేసివుంటే ఇన్ని ప్రాణాలు పోయేవి కాదు. అడ్డదారిలో ఏర్పడిన క్లబ్ కనుక, ఏదీ సక్రమంగా లేకపోయింది. ఏకైక రాకపోకలమార్గం ఇరుకుగా ఉండటమే కాక, తగలబడుతున్న ఆ నైట్‌క్లబ్ దగ్గరగా పోయేందుకు కూడా అవకాశం లేక ఫైరింజన్లు అరకిలోమీటరు ఇవతలే ఆగిపోవాల్సివచ్చిందట. విస్తృతంగా వెదురు, గడ్డి ఉపయోగించి తయారుచేసిన పైకప్పును సులువుగా తగలబడే పదార్థాలతో మరింత సుందరంగా ఈ నైట్‌క్లబ్ నిర్వాహకులు తీర్చిదిద్దారు. టపాసులు కాలిస్తే తగలబడుతుందన్న భయం, జ్ఞానం వారికి లేవనుకోవాలో, పోతేపోనీ అన్న నిర్లక్ష్యమో తెలియదు. మంటల్లో బయటకుపోయే దారిలేక వంట సామగ్రితో పాటు ఇతరత్రా అనేకం ఉంచిన ఇరుకైన బేస్‌మెంట్‌లోకి దిగి, తిరిగి పైకి రాలేక చాలా మంది పొగకు ఉక్కిరిబిక్కిరై ప్రాణాలు విడిచారట. మంటలు రేగగానే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆ చీకట్లో జరిగిన తొక్కిసలాట అధిక ప్రాణనష్టానికి దోహదం చేసిందని అంటున్నారు.

ఎంతోకాలంగా వెలుగులీనుతూ, పర్యాటకులను ఆకర్షిస్తూ, సర్వమూ విక్రయిస్తూ, చక్కగా వ్యాపారం చేసుకుంటున్న ఒక నైట్‌క్లబ్‌ను అధికారులు అక్రమం పేరిట స్వేచ్ఛగా వదిలేసి ప్రోత్సహించిన ఫలితం ఈ దారుణఘటన. ఎంతటివారినైనా విడిచిపెట్టేది లేదంటూ పాలకుల భీషణ ప్రతిజ్ఞలు, కొన్ని అరెస్టులు, ఆరోపణలూ ప్రత్యారోపణలూ ఎప్పటిలాగానే స్క్రిప్ట్‌కు అనుగుణంగా సాగిపోతున్నాయి. ఘోరం జరిగిన ప్రదేశం మారింది తప్ప, మిగతా అంతా పాత కథే. ప్రమాదాలు జరగడం, అమాయకులు మరణించడం, విచారణకు ఆదేశించడం, మళ్ళీ ఘోరం జరిగేంతవరకూ ఆ ఊసు లేకపోవడం షరా మామూలే. జైపూర్ ఆస్పత్రిలోనూ, రాజ్‌కోట్ గేమింగ్‌జోన్‌లోనూ జరిగిన ఘోర అగ్నిప్రమాదాలను ఈ దుర్ఘటన తిరిగి గుర్తుచేస్తోంది. ఢిల్లీ సహా దేశంలో పలుప్రాంతాల్లో పిల్లల ఆస్పత్రుల్లో సంభవించిన ప్రమాదాలు కళ్ళముందు కదలాడుతున్నాయి. పర్యాటకంమీద ఆధారపడే గోవాలో ప్రజల ప్రాణాలకు భద్రతలేదన్న సందేశంపోవడం దాని మనుగడకు మంచిదికాదు. విదేశీయులు తరలివచ్చే ఇటువంటి చోట్లలో దుర్ఘటనలు జరగడం అంతర్జాతీయంగా మనకు అప్రదిష్ఠ తెస్తుంది. దేశంలోని వివిధ నగరాలనుంచి గోవాకు తరలివచ్చే యువతరం గణనీయంగా ఉన్న నేపథ్యంలో, కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న నైట్‌క్లబ్‌లు వారికి కనీస రక్షణ కల్పించలేకపోవడం సరికాదు. పర్యాటకం నుంచి భారీగా ఆదాయం పొందుతున్న ప్రభుత్వం తగిన నియంత్రణలు లేక, ప్రాణాలకు పూచీపడలేక చేతులు ఎత్తేసిందన్న సందేశాలు వెలువడటం తప్పు. ప్రతీ దుర్ఘటన మనకు ఒక హెచ్చరిక. ప్రజల భద్రతకు పూచీపడే, వారి ప్రాణాలకు విలువనిచ్చే విధానాలను, వ్యవస్థలను తయారుచేసుకొని, తప్పిదాలనుంచి పాఠాలు నేర్చుకోగలిగితే ప్రమాదాలు పునరావృతం కాకుండా నిరోధించవచ్చు.

# ఇండిగో రెక్కలు కత్తిరించగలమా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

**వి**మానయానాన్ని మరింత బలంగా, పోటీపడే విధంగా మార్చేందుకు, కేవలం రెండు సంస్థల గుత్తాధిపత్యాన్ని నివారించేందుకు కట్టుబడి ఉన్నామని తెలుగువాడైన కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పార్లమెంట్ ఉభయ సభల్లో నిర్ద్వంద్వంగా ప్రకటించారు. 'ఎంత పెద్ద ఎయిర్ లైన్స్ అయినా కావచ్చు, నిబంధనలను పాటించకుండా, ఉద్దేశపూర్వకంగా వైఫల్యాలకు గురి కావడం ద్వారా ప్రయాణీకులకు ఇంత పెద్ద ఎత్తున కష్టనష్టాలకు లోను చేయడాన్ని ఇక ఎంత మాత్రమూ అనుమతించే ప్రసక్తి లేదు..' అని ఆయన గర్జించారు. ఈ సమస్యకు పూర్తి బాధ్యత ఇండిగోది మాత్రమే అని రామ్మోహన్ స్పష్టం చేశారు. ఢిల్లీలో పాఠశాల విద్యాభ్యాసం, అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన 38 సంవత్సరాల రామ్మోహన్ నాయుడుకు తండ్రి ఎర్రన్నాయుడు అకాలమరణంతో పిన్నవయస్సులో ప్రజాప్రతినిధి అయ్యే అవకాశం లభించింది. నిజానికి ఎర్రన్నాయుడు కేంద్ర కేబినెట్ మంత్రి అయినప్పుడు ఆయన వయస్సు కూడా 39 సంవత్సరాలే. తండ్రి ప్రత్యేకత వేరు. కుమారుడు హిందీలోనూ, ఇంగ్లీషులోనూ అనర్గళంగా మాట్లాడగలిగిన ప్రతిభావంతుడు. ఎవరినైనా ఇట్టే ఆకర్షించగల స్ఫురద్రూపి. ఈ రెండు భాషలు అంతగా రాకపోయినా జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేసి తెలుగుదేశంకు ఢిల్లీలో ప్రాధాన్యత సంతరించి పెట్టిన ఎర్రన్నాయుడు నీడ నుంచి రామ్మోహన్‌నాయుడు క్రమంగా బయటపడి తన అస్తిత్వాన్ని నిరూపించుకోగలిగారు.

అలాంటి రామ్మోహన్‌నాయుడుకు ఇండిగో నిర్వాకం ఫలితంగా గత పదిరోజుల్లో దేశంలో ఎంతో ప్రచారం లభించింది. డిసెంబర్ మొదటి వారంలో ఇండిగో వేయికి పైగా విమానాలను రద్దు చేయడంతో లక్షలాది ప్రయాణీకులు నానా ఇబ్బందులకు గురికావడంతో అందరి దృష్టి పౌర విమానయానశాఖపైకి మళ్లింది. మీడియాతో సహా ప్రతి ఒక్కరూ ఆయనను ప్రశ్నించడం మొదలుపెట్టారు. ఒక జాతీయ మీడియా సంస్థ నేరుగా ఆయనను బోనులో నిలబెట్టింది. ఇక తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ఉన్న మీడియా సంస్థల గురించి వేరే చెప్పనక్కర్లేదు. చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేరుగా రంగంలోకి దిగి జరిగిన వైఫల్యానికి కారణం ఇండిగోదే అని ప్రకటించారు. ఆ తర్వాత తెలుగుదేశం ఎంపీలు కూడా ఆయనకు అండగా నిలిచారు. ప్రధాని, హోంమంత్రి, కేంద్రమంత్రులు కూడా రామ్మోహన్‌కు బాసటగా నిలిచారని వార్తలు వచ్చాయి.

ఒక ప్రైవేట్ సంస్థ చేసిన తప్పిదానికి కేంద్రమంత్రిని ఎలా బాధ్యత చేస్తారు? అన్న ప్రశ్న సరైనదా అన్న విషయాన్ని పక్కన పెడితే ఈ దేశంలో గత పదేళ్లగా జరుగుతున్న ఉగ్రవాద దాడులు, ఘోర రైలు ప్రమాదాలతో పాటు అనేక దుస్సంఘటనలకు ఏ మంత్రినీ బాధ్యుడిని చేసిన దృష్టాంతాలు లేవు. ఫలానా మంత్రి ఎక్కడ అని ప్రశ్నిస్తూ జవాబు చెప్పాల్సిందేనని ఏ మీడియా సంస్థా నిలదీసిన దాఖలాలు లేవు. మరి ఒక తెలుగుమంత్రిని అంత అవలీలగా ఎందుకు ప్రశ్నించగలుగుతున్నారు? అయినప్పటికీ రామ్మోహన్‌నాయుడు ధైర్యంగా ముందుకు వచ్చి ఒకటి రెండు సంస్థల గుత్తాధిపత్యం వల్లే ఈ పరిణామాలు జరిగాయని, ఇండిగోదే పూర్తి తప్పిదమని ప్రకటించగలిగారు. కాని ఆ ఒకటి రెండు సంస్థల గుత్తాధిపత్యం దేశంలో నెలకొనేందుకు ఎవరి విధాన నిర్ణయాలు కారణం? ఇండిగో లాంటి సంస్థకు తననెవరూ ఏమీ చేయలేదన్న ధీమాతో ఇష్టం వచ్చినట్లు వ్యవహరించేందుకు ఎవరు ధైర్యం కల్పించారు?

మన దేశంలో ప్రైవేట్ సంస్థలు ప్రజలను దోపిడీ చేస్తుంటే ప్రశ్నించేందుకు ఎవరూ ధైర్యం చేయకపోవడం, అధికారులు, న్యాయస్థానాలు కూడా వాటికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయనే అభిప్రాయం నెలకొనడం ఈ పరిస్థితికి కారణమా? ఈ దేశంలో ప్రభుత్వాలనూ అధికారులనూ తాము మేనేజ్ చేయగలమని, ఎలాంటి విపత్కర పరిస్థితుల నుంచి అయినా అవలీలగా బయటపడగలమనే ధైర్యం చాలా సంపన్నులైన వ్యాపారవేత్తలకు ఉన్నదనడంలో ఎలాంటి సందేహం లేదు. లేకపోతే 2024 మార్చిలో ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ (ఎఫ్‌డీటీఎల్) నిబంధనలను విధించి, ఆ తర్వాత 2025 జూలై 1కి, 2025 డిసెంబర్ 1కి డెడ్‌లైన్లు పొడిగిస్తూ పోయినప్పటికీ ఇండిగో ఆ నిబంధనలను ఎందుకు పాటించలేకపోయింది? డీజీసీఏ అన్ని విమానయాన సంస్థలతో చర్చించిన తర్వాతే ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను రూపొందించిందింది. కొన్ని విమానయాన సంస్థలు ఆ నిబంధనలను పాటించాయి కూడా. కాని ప్రతి రోజూ 2300 విమానాలు నడిపే ఇండిగో ఈ 20 నెలల కాలంలో సుశిక్షితులైన పైలట్లను, ఫస్ట్ ఆఫీసర్లను, ఇతర సిబ్బందిని ఎందుకు సంపాదించుకోలేకపోయింది? సరైన పైలట్ శిక్షణ నీయలేదని గత అక్టోబర్‌లో ఇండిగోకు జరిమానా విధించిన డీజీసీఏకు నిబంధనలను పాటించేందుకు ఆ సంస్థ ఎలాంటి శ్రద్ధా చూపలేదన్న విషయం అర్థమయ్యే ఉండాలి. ఇవాళ చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఆ నిబంధనలకు డెడ్‌లైన్‌ను ఫిబ్రవరికి పొడిగించే బదులు డిసెంబర్ 1కి ముందే పొడిగించి ఉంటే ఇంత అస్తవ్యస్త పరిస్థితి ఎదురయ్యేది కాదని, నిబంధనలను పాటించే బదులు ఉద్దేశపూర్వకంగా విమానాలను రద్దు చేసి లక్షలాది ప్రయాణీకులను ఇండిగో ఇబ్బందులపాలు చేసి ప్రభుత్వం దిగివచ్చేలా చేసేది కూడా కాదని విమర్శలు వస్తున్నాయి. దేశంలో 65 శాతానికి పైగా తానే విమానాల రాకపోకలను నిర్వహిస్తున్నానన్న అహంభావంతో ఇండిగో వ్యవహరించిందన్న విషయం స్పష్టం.




> **చిన్న చిన్న దేశాలకూ ప్రభుత్వ రంగంలో లేదా పీపీపీ నమూనాలో పౌర విమానయాన సంస్థలు ఉంటే మనం ఉన్న సంస్థను కూడా అణాకాణీకి అమ్మేసుకున్నాం. ప్రభుత్వ విమానయాన సంస్థల గుత్తాధిపత్యం తొలగించి ప్రైవేట్ సంస్థలు పోటీ పడేందుకు అవకాశం కల్పించిన మనం ఇప్పుడు ప్రైవేట్ సంస్థల గుత్తాధిపత్యాన్ని నివారించలేకపోతున్నాం!**

నిజానికి ఢిల్లీలో టర్మినల్ 1ను కూడా నెలల తరబడి ఖాళీ చేయకుండా ఆ టర్మినల్ తమదేనన్నట్లు వ్యవహరించిన ఇండిగోను ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా మందలించిన మాట వాస్తవం కాదా?

ఇండిగో అనుభవం చాలా ప్రమాదకరమైన సంకేతాలను పంపిస్తోంది. విమానయానరంగంలోనే కాదు, ఏ రంగంలోనైనా ఒకటి రెండు సంస్థల గుత్తాధిపత్యాన్ని అనుమతించడం వల్ల జరిగే ప్రమాదాలేమిటో మనకు తెలియవస్తున్నాయి. ఇంధనం, టెలికమ్యూనికేషన్స్, సిమెంట్, విమానాశ్రయాలు, రేవులు, రవాణా, సినిమా థియేటర్లు, రిటైల్ సూపర్ మార్కెట్ల నుంచి చివరకు ఆహార పదార్థాల వ్యాపారాన్ని, ఆన్‌లైన్ సర్వీసుల్ని కూడా గుత్తాధిత్య సంస్థలు కబళించే పరిస్థితులు మన దేశంలో ఏర్పడుతున్నాయి. నేతలే పని గట్టుకుని కొన్ని వ్యాపార సంస్థల్ని చేరదీసి వాటికి ఎనలేని వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వాధినేతలే విదేశాలకు ఆ సంస్థల తరఫున బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించేందుకు వెళ్లిన తార్కాణాలు లేకపోలేదు. బడా సంస్థలకు రుణాలు ఎగ్గొట్టే అవకాశంతో పాటు భారీగా రుణాలు, ప్రభుత్వ రంగసంస్థల నుంచి నిధులు పొందేందుకు అవకాశం కల్పించే ప్రభుత్వం చిన్న, మధ్యతరహా సంస్థలకు కూడా ఎదిగే అవకాశాలు కల్పించి ఉంటే, వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవహరించి ఉంటే ఈ పరిస్థితులు దాపురించేవి కావు. దేశంలో ఐదు సంస్థల గుత్తాధిపత్యాన్ని తొలగించి పోటీని, ధరలు నిర్ణయించే శక్తినీ అడ్డుకోకపోతే మనది దళారీ పెట్టుబడిదారీ దేశమవుతుందని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ విరాల్ ఆచార్య ఏనాడో హెచ్చరించిన మాట నిజం కాదా?

ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళాకు విశేష ప్రచారం లభించడంతో కోట్లాది ప్రజలు అక్కడకు వెళ్లారు. అదే అవకాశంగా తీసుకుని విమానయాన సంస్థలు పోటీ పడి తమ విమానాల సంఖ్యను రెట్టింపు చేసి ప్రజల నుంచి నాలుగు రెట్లు వసూలు చేశాయి. విదేశాల నుంచి కూడా విమానాలు నడిపాయి. అప్పుడు పైలట్లు ఎక్కడి నుంచి వచ్చారు? మన దేశంలో కాంపిటీషన్ కమిషన్ లాంటి సంస్థలు ఉన్నప్పటికీ పోటీ అనేది వివిధ రంగాల్లో మృగ్యమైపోతోంది. అమెరికా వంటి అనేక పెట్టుబడిదారీ దేశాల్లో కూడా యాంటీ ట్రస్ట్ చట్టాలు, ఏజెన్సీలు రంగంలోకి దిగి గూగుల్, యాపిల్ లాంటి సంస్థల గుత్తాధిపత్యాన్ని అరికట్టేందుకు ప్రయత్నిస్తాయి. కాని మన దేశంలో రాజకీయ వ్యవస్థ ఈ గుత్తాధిపత్యానికి లొంగిపోతోంది. చాలా పెట్టుబడిదారీ దేశాలు, చిన్న చిన్న దేశాలకు కూడా ప్రభుత్వ రంగంలో లేదా పీపీపీ నమూనాలో విమానయాన సంస్థలు ఉంటే మనం ఉన్న సంస్థను కూడా అణాకాణీకి అమ్మేసుకున్నాం. ప్రభుత్వ విమానయాన సంస్థల గుత్తాధిపత్యం తొలగించి ప్రైవేట్ సంస్థలు పోటీపడేందుకు అవకాశం కల్పించిన మనం ఇప్పుడు ప్రైవేట్ సంస్థల గుత్తాధిపత్యాన్ని నివారించలేకపోతున్నాం! అవి ఇబ్బడిముబ్బడిగా ధరలు పెంచినా, వాటి సేవలు సరిగా లేకపోయినా శీతకన్ను వేసే పరిస్థితి ఏర్పడింది. కింగ్‌ఫిషర్, జెట్ ఎయిర్‌వేస్, గో ఎయిర్, సహారా లాంటి ఎన్నో సంస్థలు అనేక కారణాల వల్ల మూత పడుతుంటే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకుండా ఉండిపోయాం. వోడాఫోన్, ఐడియా లాంటి సంస్థలు రుణాలను ఈక్విటీగా మళ్లించేందుకు తోడ్పడుతున్న ప్రభుత్వం ఏవియేషన్ కంపెనీలకు ఎందుకు అండగా నిలబడలేకపోతోంది? మరోవైపు అతి చిన్న నగరాల్లో కూడా ప్రభుత్వం విమానాశ్రయాలను నిర్మిస్తూ పోతోంది. మన దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణీకులను దృష్టిలో ఉంచుకుని, ఎన్ని విమానాలు, ఎంత మంది పైలట్లు, సిబ్బంది, విమానాశ్రయాలు అవసరం అన్న అంచనాలు వికసిత్ భారత్–47 వంటి ఉన్నత లక్ష్యాలు పెట్టుకున్న మోదీ వంటి దూరదృష్టి గల నేతలకు, మనకు మరో పది సంవత్సరాల్లో 20 వేల మంది పైలట్లు అవసరమని చెప్పిన రామ్మోహన్‌నాయుడు వంటి విద్యాధికులకు లేవని చెప్పలేం. ఎటొచ్చీ మాటలకూ, చేతలకూ తేడా ఎంతో ఉంటుంది. మన విమానయాన రంగం అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా, ప్రజల అవసరాలను తీర్చే విధంగా ఉండాలంటే ఇంజనీర్లు, పైలట్ల వంటి సుశిక్షితులైన సాంకేతిక సిబ్బంది అవసరమని రెండు దశాబ్దాల క్రితం 2004లో ప్రఫుల్ల పటేల్ పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్నప్పుడు సివిల్ ఏవియేషన్ పాలసీ చైర్మన్ నరేష్ చంద్ర తన నివేదికలో చేసిన సిఫారసులను ఎంతవరకు అమలు చేశాం? ఎన్నో ప్రశ్నలు వేయవచ్చు కాని మన దేశంలో జవాబుదారీ అన్న మాటకు ప్రస్తుతం అర్థం లేదని ఒక్క మాటలో చెప్పగలం. ఇండిగో రెక్కలు కత్తిరించి, మరిన్ని ప్రైవేట్ సంస్థలు పౌర విమానయాన రంగంలో ప్రవేశించేందుకు ఎంతకాలం పడుతుందో వేచిచూడాలి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

## మానవ హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత

**మ**నందరం పుట్టుకతోనే కలిగి ఉన్న మానవ హక్కుల గురించి తప్పక తెలుసుకోవాలి. వాటిని పరిరక్షించుకోవాలి. వాటికి భంగం కలిగినప్పుడు ప్రతి ఒక్కరూ స్పందించవలసిన అవసరం ఉంది. ప్రపంచ శాంతి ఒప్పందాలకు అనుగుణంగా ఏర్పడిన ఐక్యరాజ్యసమితి, 1948 డిసెంబర్ 10ని 'అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం'గా ప్రకటించింది. మారుతున్న కాలంతో పాటుగా రాజ్యాంగబద్ధ హక్కుల ముఖ్యోద్దేశ్యమైన పౌర స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సహజసిద్ధ గౌరవం వంటివి సమాజంలో తగ్గిపోతుండడం విచారకరం. అయితే జాతి, కుల, మత, వర్ణ, వర్గ, లింగ భేదాలకు అతీతంగా ప్రజలు హక్కులు కలిగి ఉన్నారు. వివక్షకు గురికాని క్రూరత్వం నుంచి వెట్టిచాకిరీ, బానిసత్వం వంటి వాటి నుంచి విముక్తి పొంది, పౌరులు స్వేచ్ఛగా వారి ఇష్టానుసారంగా జీవించే, ఏ ప్రాంతంలోనైనా పర్యటించే, జీవించే హక్కులు ప్రజలకున్నాయి. వీటిని నిరోధించడం, లేదా నిర్బంధించడం, వ్యతిరేకించడం వంటివి చట్టవ్యతిరేక చర్యలుగా పరిగణించవచ్చు.

అయితే కాలం మారినా కొన్ని ప్రాంతాల్లో ఈ హక్కులకు అంతరాయం కల్గిస్తూ బాల్య వివాహాలను ప్రోత్సహిస్తూ, కులాంతర వివాహాలను వ్యతిరేకిస్తూ సొంత కుటుంబీకులే అమానుష చర్యలకు పాల్పడడం, తద్వారా హింసాత్మక చర్యలకు దారితీయడం బాధాకరం. కొందరు తమకున్న హక్కులను తెలుసుకోలేకపోవడానికి అవిద్య, అజ్ఞానం కారణాలైతే మరికొన్ని చోట్ల అసూయ, రాగద్వేషాలు, కుల, మత విభేదాలు, గొప్ప–బీద వంటి తారతమ్యాలు కూడా కారణాలుగా కనబడతాయి. అందుకే ఈ హక్కులకు భంగం కలిగినప్పుడు బాధిత వ్యక్తుల రక్షణ కోసం 1993లో 'మానవ హక్కుల పరిరక్షణ చట్టం' ఏర్పాటు చేశారు.

ప్రతి వ్యక్తికీ పుట్టుకతో వచ్చిన స్వేచ్ఛ, సమానత్వంతో పాటూ ఆహారం, ఆరోగ్యం, విద్య వంటి వాటికి కూడా నోచుకోలేని వారు కొందరు ఉన్నారు. గ్రామీణుల నుంచి నగరవాసుల వరకూ చాలా ప్రాంతాల వారికి మానవహక్కులపై అవగాహన, ఆయా హక్కుల ప్రాముఖ్యం తెలియదు. ఇటువంటి వారికి అన్ని విధాలా భద్రత, పౌష్టికాహారం, మెరుగైన వైద్యం వంటివి కల్పించవలసిన బాధ్యత, మానవహక్కుల గురించి తెలియజేయాల్సిన బాధ్యత, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

రాజ్యాంగం ప్రకారం UDHR (Universal Declaration of Human Rights) ప్రకారం... ఆర్టికల్ 1) స్వేచ్ఛ, గౌరవం, 2) జీవించే హక్కు, 3) హింస, దౌర్జన్యం నుంచి రక్షణ, 5) పీడిత బాధ నుంచి విముక్తి, 9) పౌరులను అక్రమంగా అరెస్టు చేయరాదు. 18) మత స్వేచ్ఛ, 19) వాక్ స్వాతంత్ర్యం, 20) విద్యా హక్కు, 30) హక్కులను ఉల్లంఘించరాదు. వంటి వాటితో పాటు ఆర్టికల్ 14 నుంచి 32 వరకూ ఉన్న హక్కులకు భంగం కలిగించరాదు. ఒకవేళ ఆయా హక్కులకు భంగం కలిగితే cr.nhrc@nic.in అనే మెయిల్ ఐడీకి ఫిర్యాదు చేయవచ్చు. లేదా పౌరులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ 'జాతీయ మానవ హక్కుల కమిషన్'కు రాతపూర్వకంగా కూడా ఫిర్యాదు చేయవచ్చు. నేరాలను అరికట్టాలంటే సమాజంలోని ప్రతి వ్యక్తీ బాధ్యతతో మెలగాలి. మనం మానవ హక్కులను కాపాడుకోవడంతోపాటు ఇతరుల హక్కులనూ గౌరవించాలి. అప్పుడే మనం సమాజంలో ప్రజాస్వామ్యం, శాంతి భద్రతలు కాపాడినట్లు.

– ఎస్. బాలాత్రిపురసుందరి
అడ్వకేట్

## ముఖ్యమంత్రికి ఓయూ సంధిస్తున్న ప్రశ్నలు

**సీఎం** రేవంత్‌రెడ్డి నేడు ఉస్మానియా యూనివర్సిటీకి వస్తున్న సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులుగా ముఖ్యమంత్రి రావడాన్ని స్వాగతిస్తూనే కొన్ని ప్రధాన అంశాలపై ఆయన దృష్టి పెట్టాలన్నది మా ఆకాంక్ష. గత ఆగస్టు 25న సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి మొదటిసారి ఓయూకు వచ్చారు. ఆ సందర్భంగా రేవంత్ పలు వ్యాఖ్యలు చేశారు. 'తెలంగాణకు పర్యాయపదం ఉస్మానియా యూనివర్సిటీ. నాటి పాలకుల వల్లనే ఓయూకు ఈ దుస్థితి. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ విశ్వవిద్యాలయాల వలె మన విశ్వవిద్యాలయాలూ మారాలి. వాటి సమగ్ర అభివృద్ధి జరగాలి' అని సీఎం తెలిపారు. అయితే వందేళ్ల ఘనమైన చరిత్రను నింపుకున్న ఉస్మానియా యూనివర్సిటీ నేడు 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందంగా తయారైంది. గత పాలకుల నిర్లక్ష్యం, నిధుల కొరత, ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలు, ప్రైవేట్ యూనివర్సిటీల పోటీ, పెరుగుతున్న ఫీజులు, మౌలిక సదుపాయాల లేమి... వంటి సమస్యలు ఓయూను పట్టి పీడిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చేసిన వ్యాఖ్యలతో యూనివర్సిటీ భవిష్యత్‌పై కొత్త ఆశలు చిగురించాయి.

గత పాలకులు ఉస్మానియాకు నిధుల కేటాయింపులో తీవ్రమైన నిర్లక్ష్యం చేశారు. బడ్జెట్లో ఇచ్చే నిధులు కేవలం యూనివర్సిటీలోని ఉద్యోగుల జీతాలకే సరిపోయేవి. ఇతరత్రా ఖర్చుల కోసం విద్యార్థుల మీద యూనివర్సిటీ అధికారులు ఫీజుల భారం మోపారు. కానీ మౌలిక వసతులు మాత్రం కల్పించలేదు. హాస్టళ్లు సరిపోకపోవడంతో, నిజాం కాలం నాటి పురాతనమైన గుర్రపుశాలలోనే విద్యార్థులు ఉండాల్సిన దుస్థితి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కొత్త హాస్టల్ భవనాలు నిర్మించాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశ పెట్టాలి. పెంచిన కోర్సు ఫీజులను తగ్గించే చర్యలు చేపట్టాలి. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.100 కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి. క్యాంపస్ విద్యార్థులకు ఉచిత మెస్ సౌకర్యం కల్పించాలి. ఆధునిక ప్రయోగశాలలు, లైబ్రరీ వసతి మెరుగుపరచాలి. యూనివర్సిటీ భూమి కబ్జా కాకుండా ఓయూ చుట్టూ ప్రహరీ నిర్మించాలి. ఓయూ అభివృద్ధికి రూ.1500 కోట్లు ఇవ్వాలి. ఓయూలో ప్రస్తుతం 75శాతం బోధనా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని సత్వరమే భర్తీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

యూజీసీ నుంచి రావాల్సిన ఫెలోషిప్ స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందడం లేదు. సీఎం ప్రారంభించిన ఫెలోషిప్ పథకం నేటికీ ఆచరణకు నోచుకోలేదు. ఫెలోషిప్ అంటే కేవలం ఐదు, పదివేలు కాకుండా నేటి పరిశోధనకు అనుగుణంగా కనీసం రూ.25 వేలకు పెంచాలి. ఉత్తమ రీసెర్చ్ అవార్డ్ నెలకొల్పాలి. పరిశోధనను రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా చూడాలి. ఎంతో చరిత్ర కలిగిన ఉస్మానియా, కాకతీయ, జేఎన్టీయూ వంటి యూనివర్సిటీల అభివృద్ధిని విస్మరించి, ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు పెద్దపీట వేయడం సమంజసం కాదు. యూనివర్సిటీలు అంటే కేవలం డిగ్రీలు ఇచ్చే ఫ్యాక్టరీలు కాదు, రేపటి తెలంగాణ భవిష్యత్తు కేంద్రాలు. ఓయూలో నెలకొన్న ఈ పరిస్థితులపై విద్యార్థుల పక్షాన రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచన చేస్తారని ఆశిస్తున్నాం.



● ఆర్.ఎల్.మూర్తి, ఓయూ రీసెర్చ్ స్కాలర్

## ఇచ్చిన మాట నెరవేర్చరా?

**ఎంతో** ఘనచరిత్ర కలిగిన ఓయూ ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతున్నది. పన్నెండేళ్ల క్రితం జరిగిన అధ్యాపకుల భర్తీ తర్వాత ఇప్పటివరకు అధ్యాపక ఖాళీలను భర్తీ చేయలేదు. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో ఒకరిద్దరు పర్మనెంట్ ఫాకల్టీ తప్పితే, మిగిలిన వారంతా సొంత సబ్జెక్టులో కనీస జ్ఞానంలేని, భాషా పరిజ్ఞానం లేని వ్యక్తులు కాంట్రాక్టు అధ్యాపకులుగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో దాదాపుగా అన్ని యూనివర్సిటీలదీ ఇదే పరిస్థితి.

ప్రస్తుతం తెలంగాణలో యూనివర్సిటీల స్వయంప్రతిపత్తి... విద్యావేత్తల చేతుల నుంచి రాజకీయ ఎజెండాలు కలిగిన అధికారుల చేతుల్లోకి మారింది. అకడమిక్ వ్యవహారాల్లో రాజకీయ జోక్యం మితిమీరింది. దీనివల్ల యూనివర్సిటీ అకడమిక్ వ్యవహారాల్లో విద్యార్థులకు, అధ్యాపకులకు ఉండాల్సిన సంబంధం దెబ్బతింటోంది. గత ప్రభుత్వం ఉన్నత విద్యావ్యవస్థను బలహీనపరుస్తూ, ప్రైవేట్ యూనివర్సిటీలను ప్రోత్సహించింది. అధికార పక్షానికి అనుకూలంగా ఉన్నవారినే వీసీలుగా నియమించింది. నిధుల విషయంలో కూడా అదే జరిగింది. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా అదే జరుగుతోంది. స్వార్థ ప్రయోజనాల కోసం అధికారదాహంతో ఉన్నత విద్య విలువలను దిగజారుస్తున్నారు.

ప్రభుత్వాలు యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిలో ఇష్టానుసారంగా జోక్యం చేసుకుంటున్నాయి. పదవులకు ఆశపడిన అధ్యాపకులు... ప్రశ్నిస్తున్న విద్యార్థులపై వ్యక్తిగత దాడులకు దిగుతున్నారు. కేసులు పెట్టి బెదిరిస్తున్నారు. 28 ఏళ్ళు దాటితే విద్యార్థులకు హాస్టల్ వసతి ఇవ్వలేమనే కొత్త నిబంధనతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తున్నారు. కరోనా వల్ల నష్టపోయిన పీహెచ్‌డీ విద్యార్థులకు సబ్మిషన్‌కు అవకాశం ఇవ్వటం లేదు. ఇలాంటి విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న యూనివర్సిటీ అధికారులను ప్రజాపాలన అని చెప్పుకునే ప్రభుత్వం చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నది.

ఓయూ అభివృద్ధికి వేయి కోట్లు ఇస్తానని మాటిచ్చిన రేవంత్‌రెడ్డి, మిగతా యూనివర్సిటీల అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టాలి. రీసెర్చ్ స్కాలర్స్, పీజీ విద్యార్థులకు ప్రతినెలా ఫెలోషిప్స్ ఇచ్చి, పరిశోధనలను ప్రోత్సహించి, ఉన్నత విద్య భవిష్యత్తును కాపాడాలి.

● సునీల్ నీరడి

## తీపికబురు కోసం ఎదురుచూపు

**ఉ**ద్యమాలగడ్డ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ నెల 5న 'సీఎం రేవంత్ రెడ్డి గారు.. మా ఓయూకు రండి' అంటూ అధ్యాపకులు, సిబ్బంది ఓ భారీ స్వాగత ప్రదర్శన నిర్వహించారు. 107 ఏళ్ల ఓయూ చరిత్రలో సీఎం రాక కోసం ప్రదర్శన నిర్వహించడం ఇదే ప్రథమం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే నాడు రాష్ట్రంలో కీలకమైన పదవిని చేపడతారని తెలిసినప్పటికీ ఒక నాయకుడిని తీవ్రంగా నిరసించిన ఓయూ విద్యార్థులు.. నేడు రేవంత్‌రెడ్డిని క్యాంపస్‌కు ఆహ్వానిస్తున్నారు. దీనికి గత పాలకులే ప్రధాన కారణం. ఓయూను ఉమ్మడి రాష్ట్రంలో కంటే స్వరాష్ట్రంలోనే పాలకులు ఎక్కువగా నిర్వీర్యం చేశారు. 600లకు పైగా మంజూరైన పోస్టులున్నప్పటికీ ఒక్క నోటిఫికేషన్ కూడా గతంలో ఇవ్వలేదు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుని పదేళ్లు గడిచినప్పటికీ ఓయూలో నియామకాలు జరగలేదు. రెగ్యులర్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను కూడా పూర్తిస్థాయిలో ఆనాడు ఇవ్వలేదన్నది విద్యార్థుల మరో ఆరోపణ. మొత్తంగా, కేసీఆర్ సర్కార్ ఓయూను చిన్నచూపు చూసిందనేది స్పష్టం. నిజానికి, ఓయూతో పాటు మిగతా వర్సిటీలనూ పట్టించుకోలేదు. రాష్ట్రంలోని 12 వర్సిటీలలో మంజూరైన పోస్టులే సుమారు 2వేలకు పైగా ఉన్నాయి. వీటి భర్తీకి కూడా నాటి ప్రభుత్వం ఇష్టపడలేదు. చివరకు తమ బాధను చెప్పే అవకాశమే ఆ పదేళ్లకాలంలో వారికి దొరకలేదు.



ఉస్మానియా వర్సిటీలో బోధన, పరిశోధనలు పెరగాలంటే ప్రభుత్వం నుంచి నిధుల సహకారం కావాలి. వర్సిటీ ప్రతిష్ఠ మరింత దిగజారకుండా కాపాడుకోవాలని సిబ్బంది ఎదురుచూస్తున్నారు. వర్సిటీలో సుమారు 1200మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. వీరు 15 నుంచి 30 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇతర రాష్ట్రాలలో వలె తమ సర్వీసునూ క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రతతో పాటు యూజీసీ పే స్కేల్ ఇవ్వాలనేది వీరి ప్రధానమైన డిమాండ్. పార్ట్ టైం అధ్యాపకులను కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా చేయాలనే డిమాండ్ కూడా ఉంది. బోధనేతర సిబ్బంది కూడా కాంట్రాక్టు పద్ధతిలో వందల సంఖ్యలో 10–30 ఏళ్లుగా పనిచేస్తున్నవారున్నారు. ఓయూ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయనివిధంగా ధైర్యంగా క్యాంపస్‌లో అడుగుపెట్టిన రేవంత్‌రెడ్డి, రాష్ట్రంలో కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగ నియామకాలు చేపడతారనే నమ్మకంతో ఓయూ విద్యార్థులున్నారు. గ్లోబల్ వర్సిటీలకు దీటుగా ఓయూను నిలిపేందుకు కొత్త కోర్సుల ఏర్పాటు, నాణ్యమైన విద్యాబోధన అందించే చర్యలు చేపట్టాలనేది వీరి కోరిక. హాస్టళ్లను సుందరంగా తీర్చిదిద్దాలని, సరికొత్త ల్యాబ్‌లను ఏర్పాటు చేసి గ్లోబల్ పోటీలో నిలిచేలా నిధులను కేటాయించాలని కోరుతున్నారు. రేవంత్‌రెడ్డి చెప్పే గుడ్‌న్యూస్ కోసం వీరంతా ఎదురుచూస్తున్నారు.

● డా. ఎన్.యాదగిరిరావు
హైదరాబాద్ పట్టణాభివృద్ధి పరిశోధకులు

## యూనివర్సిటీల్లో నేరుగా భర్తీ చేసే పోస్టులెన్ని?!

**ఉ**మ్మడి ఏపీలో దాదాపు 12 ఏళ్ల క్రితం వచ్చిన నోటిఫికేషన్ మినహా స్వరాష్ట్రం సాధించుకున్నాక తెలంగాణలో ఇంతవరకు ఒక్క అధ్యాపక నోటిఫికేషన్ కూడా రాకపోవడం శోచనీయం. ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి జీవో 21ని తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం... వంద మార్కులకు గాను డిగ్రీ, పీజీలకు కలిపి 20 మార్కుల్ని కేటాయిస్తే, పీహెచ్‌డీకి పది మార్కులే కేటాయించారు. జాతీయ స్థాయి నెట్, రాష్ట్ర స్థాయి సెట్‌కు సమానంగా మార్కులు కేటాయించడంతో ఉద్యోగార్థులు ఆందోళన చెందుతున్నారు. కాబట్టి ఈ జీవోలో అవసరమైన మార్పులు చేయాలి. యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకుల ఉద్యోగ భద్రత లేదా క్రమబద్ధీకరణ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 16లో పేర్కొన్న సమాన అవకాశాల సూత్రాన్ని ఉల్లంఘిస్తున్నది.

యూనివర్సిటీల్లో నాణ్యతా ప్రమాణాలు పెరగాలంటే అటు కాంట్రాక్టు, తాత్కాలిక అధ్యాపకుల సేవలను గౌరవిస్తూనే, నిరుద్యోగ యువతకూ న్యాయం చేయాలి. కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకులకు నియామకాల్లో వయోపరిమితి సడలింపు, బోధనా అనుభవానికి మార్కుల్ని కేటాయించడం ద్వారా వారికి ప్రాధాన్యం కల్పించవచ్చు. స్థానిక ఎన్నికల తర్వాత ఆచార్యుల భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుందని వార్తలు వెలువడుతున్నాయి. సీఎం నేటి ఓయూ పర్యటన నేపథ్యంలో, పూర్తి స్థాయిలో అధ్యాపక పోస్టుల్ని భర్తీ చేయాలని నిరుద్యోగ యువత కోరుతోంది. ప్రస్తుతం వర్సిటీల్లో పూర్తిస్థాయి పాలక మండళ్లు కొలువుదీరలేదు. ఖాళీగా ఉన్న దాదాపు 2 వేల పోస్టులు కాకుండా 450 అధ్యాపక పోస్టుల్ని మాత్రమే భర్తీ చేస్తారని, అది కూడా కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులను మినహాయించి అంటే– ఇక నిరుద్యోగులకు మిగిలే పోస్టులు ఎన్ని? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ నేపథ్యంలో మరొక్కసారి ఖాళీలను గుర్తించి, పూర్తిస్థాయిలో యూనివర్సిటీ అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసినపుడే బడుగు, బలహీనవర్గాలకు నాణ్యమైన విద్యను అందించినట్లు అవుతుంది.

● యం.అర్జున్, హైదరాబాద్





# నోటికి తాళం నోట్లతో గాలం





- ముగిసిన తొలివిడత పంచాయతీ ఎన్నికల ప్రచారం
- ప్రలోభాల జాతరకు తొలగిన తెర
- పోలింగ్‌కు ఇక మిగిలింది ఒక్క రోజే..
- మందు, మనీ పంపిణీకి రహస్య ఏర్పాట్లు
- నేటి సాయంత్రం నుంచి మద్యం షాపులు బంద్
- నేడే పోలింగ్ మెటీరియల్ పంపిణీ
- జిల్లాలో మూడు మండలాల పరిధిలో రేపు పోలింగ్
- 64 పంచాయతీల్లో 264 మంది సర్పంచ్ అభ్యర్థుల పోటీ



ముల్కనూర్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

హనుమకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరిగే భీమదేవరపల్లి, కమలాపూర్, ఎల్కతుర్తి మండలాల్లో ప్రచారం మంగళవారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. వారం రోజులుగా పల్లెల్లో హోరెత్తిన ప్రచారం సద్దుమణిగింది. అభ్యర్థుల ప్రసంగాలు, వాడవాడనా ప్రత్యక్షంగా తిరిగి ఓటర్లను కలుసుకోవడం, ఓట్లను అభ్యర్థించడం నిలిచిపోయింది. ప్రచారంలో ఉన్న ప్రధాన పార్టీల ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు సైతం వెనక్కి వెళ్లిపోయారు. అంతా నిశ్శబ్దం ఆవరించుకున్నది.

మొదటి విడతగా ఈ మూడు మండలాల పరిధిలోని 69 సర్పంచ్, 658 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు ఈనెల 11వ తేదీన పోలింగ్ జరగాల్సి ఉండగా వీటిలో నాలుగు గ్రామ పంచాయతీలు- భీమదేవరపల్లి మండలంలోని వీర్లగడ్డతండా, ఎల్కతుర్తి మండలంలోని గుంటూరుపల్లి, శాంతినగర్, కమలాపూర్ మండలంలోని కొత్తపల్లిలలో సర్పంచ్, వార్డు సభ్యులతో సహా మొత్తంగా ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, భీమదేవరపల్లి మండలంలోని గాంధీనగర్ గ్రామపంచాయతీలో కేవలం సర్పంచ్ స్థానం మాత్రమే ఏకగ్రీవమైంది. ఏకగ్రీవం అయినవి పోగా 64 పంచాయతీలకు పోలింగ్ జరగనున్నది. సర్పంచ్ స్థానాలకు 264 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 1339 మంది పోటీ పడుతున్నారు.

### హోరాహోరీగా ప్రచారం

ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోయారు. ఒక్క చాన్స్ ప్లీజ్.. అంటూ ఓట్ల కోసం ప్రాధేయపడ్డారు. తమను గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి పాటుపడతానని హామీలు, వాగ్దానాలు చేశారు. అభ్యర్థులు తమ సామాజికవర్గం ఓటర్లపైనే కాకుండా ఇతరవర్గాల ఓటర్లను ఆకట్టుకునేందుకు తాయిలాలను ఎరచూపారు. ముఖ్యంగా మహిళా ఓటర్లపై దృష్టిసారించారు. వారిని మచ్చిక (మిగతా 8వ పేజీలో)





# ఊగుతున్న ఊళ్లు

## కిక్కెస్తున్న పంచాయతీ ఎన్నికలు

- పెద్ద మనుషులు, కులసంఘాలు, క్యాడర్‌కు రాత్రైతే చీర్స్..
- నాటు కోడి, మటన్, బోటి, తలకాయ సూపు, చికెన్ ఫ్రైతో అభ్యర్థుల కాక
- చీప్ లిక్కర్‌కు నై.. బ్రాండెడ్ విస్కీకే సై.. షాపుల్లో క్వార్టర్స్‌కు ఫుల్ డిమాండ్
- మద్యానికే రూ.లక్ష నుంచి రూ.5లక్షలకు పైగా వ్యయం
- ఉమ్మడి జిల్లాలో రూ.60కోట్లకు పైగా మద్యంపైనే ఖర్చు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పంచాయతీ పోరు పల్లెను మత్తెక్కిస్తోంది. రాత్రైతే చీర్స్‌తో ఊరు చిందులేస్తోంది. పెద్ద మనుషులు, కుల, యువజన సంఘాల మద్దతు కోసం అభ్యర్థులు మందును ఎరగా వేస్తున్నారు. మనీకి లొంగని నేతలను మద్యంతో తమ దారికి తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక పొద్దంతా ప్రచారంలో వెంట తిరిగే క్యాడర్‌ను చీకటి పడితే చాలు మందు, విందులతో చేజారకుండా జాగ్రత్త పడుతున్నారు. ఎన్నికల ఖర్చులో సగానికిపైగా మద్యం కోసం అభ్యర్థులు వెచ్చిస్తున్నారు. మొదటి విడత ప్రచారం పూర్తి కావటంతో ఇక మద్యంతో పాటు ఇతర ప్రలోభాలతో ఓటర్లకు ఎర వేసే పనిలో అభ్యర్థులు బిజీగా వున్నారు.

### ఖర్చులకు తగ్గేదేలే..

ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులు చాలా చోట్ల ఖర్చులకు తగ్గేదేలే అంటున్నారు. ఎన్నికల ప్రచారాన్ని అసెంబ్లీ ఎన్నికలకు తీసిపోకుండా నిర్వహిస్తున్నారు. ప్రచార వాహనాలతో పాటు కొన్నిచోట్ల అభ్యర్థులు ఎల్ఈడీ స్ర్కీన్‌లను కూడా వినియోగిస్తున్నారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులను రంగంలోకి దించి ప్రచారం చేస్తున్నారు. ఖర్చు ఎంతైనా పర్వాలేదు.. ఒక్కసారి ఊరికి సర్పంచ్ కావాలే.. అనే లక్ష్యంతో ఓట్ల కోసం నోట్లను నీళ్లలా ఖర్చు చేస్తున్నారు. వలస వెళ్లిన ఓటర్లకు ప్రత్యేకంగా వాహనాలు, ఇతర ఖర్చులు కూడా సర్దేస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా.. రిజర్వేషన్ కలిసి వచ్చిన వాళ్లు అప్పులు చేసి మరీ ఖర్చు చేస్తున్నారు.

### మద్యంతో దావత్‌లు.. కోట్లల్లో అమ్మకాలు

ఒకప్పుడు పోలింగ్‌కు ఒకరోజు ముందే మద్యం, మనీ వంటివి పంపిణీ చేసేవారు. అయితే ఈ ఎన్నికల్లో మాత్రం రిజర్వేషన్లు ఖరారు కాకముందు నుంచే ఆశావహులు మద్యం దావత్‌లు ఏర్పాటు చేయటం మొదలు పెట్టారు. రిజర్వేషన్లు ఖరారైన తరువాత దావత్‌లు పతాకస్థాయికి చేరుకున్నాయి. గుర్తులు కేటాయించకముందే తనను గుర్తుపెట్టుకోండంటూ దావత్‌లతో (మిగతా 7వ పేజీలో)

### పల్లెలో ఓట్ల పండుగ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు విడతలుగా జరుగుతున్న ఎన్నికల్లో తొలివిడత 11వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. మంగళవారం సాయంత్రం ప్రచారం నిలిపివేశారు. మరోవైపు మూడో విడత ఎన్నికలకు సంబంధించి మంగళవారం గుర్తుల కేటాయింపులు చేశారు. కాగా, ఎన్నికల పర్వం పల్లెల్లో పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. గ్రామ కూడళ్లలో ఏ నలుగురు కలిసినా ఎన్నికలపైనే చర్చ నడుస్తోంది. ఆయా పార్టీల మద్దతుతో పాటు స్వతంత్రంగా పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలపైన పల్లెజనం బేరీజు వేసుకుంటున్నారు.

పార్టీరహి తంగా ఎన్నికలు జరుగుతున్నప్పటికీ ప్రచారం పర్వంలో అభ్యర్థులు తనకు మద్దతు ఇచ్చే పార్టీ కడువాలతోనే ప్రచారం చేస్తున్నారు. పొద్దంతా ప్రచారంతో అభ్యర్థులు రాజకీయాల ను వేడెక్కిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారికి ఫోన్‌లో అభ్యర్థులు పలకిరిస్తున్నారు. ఓటింగ్ రోజు తప్పకుండా ఊరికి రావాలని, రానుపోను ఖర్చులతో పాటు ఇతర ఆఫర్‌లు కూడా ఇస్తున్నారు.

## తొలి విడతకు భారీ బందోబస్తు

- వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 11 మండలాల్లో పోలింగ్
- ఇప్పటికే 156 లైసెన్స్‌డ్ తుపాకులు స్వాధీనం
- 1470 మంది బైండోవర్
- విధుల్లోకి 1800 మంది సిబ్బంది

7

## నేడు, రేపు 163వ సెక్షన్ అమలు

పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

7

## మద్యం షాపులకు సీల్

రేపు పోలింగ్ ఫలితాలు వచ్చే వరకు మూసివేత


**బహిరంగ ప్రకటన**
(సంబంధించిన వారికి)

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింటు **శ్రీమతి అల్లమనేని ఉజ్వల భర్త రిష్వంత్**, వయస్సు: 29 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, ఇ.నం.1-135, జోటపల్లి గ్రామం, పర్వతగిరి మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం వారు తెలంగాణ రాష్ట్రం, హనుమకొండ జిల్లా, కాజీపేట మండలం, శాయంపేట జాగీర్ గ్రామంలోని సర్వే నం.189, 196, 197 & 198లోని దిగువ షెడ్యూలులో పేర్కొన్న 198-61 చ.గజాల విస్తీర్ణ ప్లాట్ నం.2 (భాగం) కలిగిన ఖాళీ ప్లాటును తూముల వెంకటేశ్వర్ రావు తండ్రి నారాయణ, నివాసం: ఇ.నం.1-8, వేంపట్ల గ్రామం, కూసుమంచి మండలం, ఖమ్మం జిల్లా వారితో ఒప్పందం చేసుకున్నారు. అగ్రిమెంట్ హోల్డర్ అయిన శ్రీ మెట్టుపల్లి దుర్గారావు తండ్రి చొక్కారావు, నివాసం: ఇ.నం. 1-9-1151/ఎ, సహకార్ నగర్, హంటర్ రోడ్, హనుమకొండ మండలం, హనుమకొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం వారి నుండి రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.5433/2021 తేది 15.06.2012 ప్రకారం కొనుగోలు చేశారు. నా క్లయింట్ సదరు ఆస్తిని కొనుగోలు చేసి, సదరు ఆస్తికి యజమానిగా ఉండి, తేగిన అడ్వాన్స్ మొత్తం చెల్లించారు. కావున సాధారణ ప్రజలకు, సంస్థలకు మరియు ఇతర ప్రయోజనంగల వారికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే, ఈ నోటీసు తేదీ నుండి వారం రోజులలోగా వ్రాతపూర్వకముగా తెలియజేయవచ్చును. నిర్దేశిత గడువులోగా ఎలాంటి అభ్యంతరం అందనట్లయితే, సదరు ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం నా క్లయింటు ముందుకు కొనసాగుతారు మరియు నిర్దేశిత గడువు మీదట ఎలాంటి అభ్యంతరం స్వీకరించబడదు.

**ఆస్తి షెడ్యూలు**

తెలంగాణ రాష్ట్రం, హనుమకొండ జిల్లా, కాజీపేట మండలం, శాయంపేట జాగీర్ గ్రామంలోని సర్వే నం.189, 196, 197 & 198లోని 198-61 చ.గజాల విస్తీర్ణ ప్లాట్ నం.2 (భాగం) కలిగిన ఖాళీ ప్లాట్ సరిహద్దులు: **తూర్పు:** 30'-0" వెడల్పు రోడ్డు, **పశ్చిమం:** నీల వీరనారాయణ ఖాళీ ప్రదేశం, **ఉత్తరం:** ఖాళీ ప్లాట్ నం.2 (భాగం), **దక్షిణం:** చలం శివానందం ప్లాట్.

తేది: 08.12.2025

Sd/- CH. అగారెడ్డి, B.Sc., LL.B
అడ్వకేట్ నోటరీ
నక్కలగుట్ట, హనుమకొండ, సెల్: 9490380382




మాధన్నపేట చెరువు వద్ద పంబారట్టులో భాగంగా అయ్యప్పకు అభిషేక పూజలు చేస్తున్న పూజారులు

## మార్మోగిన పంబారట్టు వేడుక

- పూజలతో పులకించిన మాధన్నపేట చెరువు కట్ట
- పెద్దసంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు
- భక్తిశ్రద్ధలతో మణికంఠుడి ఊరేగింపు
- ఆకట్టుకున్న కళాకారుల విన్యాసాలు
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది దంపతులు

7



'అవినీతికి పాల్పడడం కన్నా.. అడుక్కు తినడం మిన్న' అంటూ జ్వాల సంస్థ ఆధ్వర్యంలో యాచకులతో నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## అవినీతి ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- లోక్‌సత్తా ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు బి.రామ్మోహనరావు
- అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'జ్వాల' ర్యాలీ
- ప్లకార్డులు పట్టుకొని పాల్గొన్న యాచకులు

7





తెలంగాణ తల్లి విగ్రహం ముందు కలెక్టర్, వివిధ శాఖల అధికారులు

## కలెక్టరేట్‌లో 'తెలంగాణ తల్లి'

### విగ్రహాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ స్నేహ

హనుమకొండకలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. కలెక్టర్ స్నేహ శబరీష్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణతో కలెక్టరేట్ ప్రాంగణం మార్మోగింది. కలెక్టరేట్‌ను సందర్శించే ప్రజలకు, అధికారులకు ఈ విగ్రహం ప్రేరణగా నిలువనుంది. తెలంగాణ గౌరవం, సంప్రదాయాలు, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను, ఆర్అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, డీటీఓ శ్రీనివాస్‌కుమార్, జిల్లా అధికారులతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చురుగ్గా సమ్మక్క గద్దె విస్తరణ పనులు

తాడ్వాయి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో దేవస్థానం ఆధునీకరణ పనుల్లో భాగంగా సమ్మక్క గద్దెకు మొదటి రాతి స్తంభాన్ని పూజారులు నిలబెట్టారు. మంగళవారం కార్యక్రమానికి ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ హాజరయ్యారు. ఎస్పీ కొబ్బరికాయ కొట్టగా పూజారులు ప్రత్యేక పూజలు చేసి గద్దె స్తంభాన్ని నిలబెట్టారు. ఈ క్రమంలో సమ్మక్క గద్దె రాతి స్తంభాల పనులు ప్రారంభమయ్యాయి. పూజారులు, అధికారులు, పోలీసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సోనియాగాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం

- ఆమెపై బీజేపీ నిందలు వేయడం అనైతికం
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సోనియాగాంధీ జన్మదిన వేడుకలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆమె లేకుంటే తెలంగాణ ఆవిర్భవించేదే కాదన్నారు. మంగళవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో సోనియాగాంధీ 79వ జన్మదిన వేడుకలు జరిగాయి. సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసిన అనంతరం రాజేందర్ రెడ్డి మాట్లాడారు. బీజేపీ నేతలు ఎప్పటికీ నెహ్రూ, ఇందిరాగాంధీ రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీలపై విషాన్ని కక్కుతూనే ఉన్నారన్నారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలే అర్పించారన్నారు. బీజేపీ నాయకులు రాజకీయ పబ్బం కోసం ఆ కుటుంబంపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. ప్రధాన మంత్రి పదవిని త్యజించిన ఘనత సోనియాగాంధీకి ఉందన్నారు. దేశంలో రూపాయి పతనం, ఇండిగో విమానాల రద్దు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీజేపీ నేతలు... కావాలని నెహ్రూ, సోనియాగాంధీపై విమర్శలు చేసి ప్రజలను పక్కదారి పట్టించే కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఈవీ శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బత్తిని శ్రీనివాస్, ఆనంద్ మోజెస్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, బీసీ సెల్ చైర్మన్ బొమ్మతి విక్రమ్‌తో పాటు డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ తదితరులు పాల్గొన్నారు.


SHRIRAM Finance

**రిజిస్టర్డ్ ఆఫీస్:** శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
**నిర్వాహక కార్యాలయం:** 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బీరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

**గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు**

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కాని వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించుటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

**వేలం. తేది: 23-12-2025 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి నం.1-8-588,3 వఅంతస్తు,వైష్ణవి హీరో హోండా షోరూమ్ పైన, నక్కలగుట్ట, హన్మకొండ-506001**

| Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name |
|---|---|---|---|---|---|
| CDPRKPJ2503310003 | KODARI VAMSHI | | | | |

**వేలం వేయు తేది: 23-12-2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం.2-121,1వ అంతస్తు,పాలకుర్తి రోడ్,జనగాం-506143. తెలంగాణ**

| Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name |
|---|---|---|---|---|---|
| JNGONPJ2503030002 | GUGULOTHU MADHAVI | PLKTYIP2503210001 | GADEPAKA NAGANNA | JNGONPJ2503310004 | VIKAS CHITTIMELLI |
| PLKTYPJ2506040008 | PARSHARAMULU PALLE | JNGONPJ2506210003 | ANITHA BANOTHU | PLKTYPJ2507010010 | MANGA SWAPNA |
| PLKTYPJ2503040018 | JYOTHI KOMURAMMA | GHNPRPJ2506230012 | VENKATESH PITTALA | GHNPRPJ2506230010 | VENKATESH PITTALA |
| GHNPRPJ2503080007 | MEKALA RAJU | GHNPRPJ2506230013 | VENKATESH PITTALA | PLKTYPJ2506280013 | YELLASWAMY GORANTHALA |
| GHNPRPJ2506120007 | PITTALA SRINIVAS | GHNPRPJ2506190002 | YAKAMMA BHASKULA | | |

**వేలం వేయు తేది: 23-12-2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి.నం.3-61,మెయిన్‌రోడ్,భూపాలపల్లి,జయశంకర్ భూపాలపల్లి జిల్లా-506169.**

| Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name |
|---|---|---|---|---|---|
| BHPLERE2506040027 | NEELAM LALITHA | BHPLEPJ2506100007 | MAMIDI RAJU | BHPLEPJ2506230009 | BAYYA PRASHANTH KUMAR |
| BHPLERE2503060028 | GANJI LAXMISAMAIAH | BHPLEPJ2503110023 | JARUPULA PRAMEELA | BHPLEPJ2506250001 | MUPPIDOJU LAXMAN |

**వేలం వేయు తేది: 23-12-2025 వేలం వేయు చిరునామా: 6-3-88,బోడ్లా మధుసూదన్ రావు హాస్పిటల్ ప్రక్కన, రామమందిర్ రోడ్ దగ్గర ,మహబూబాబాద్-506101.మహబూబాబాద్‌జిల్లా,తెలంగాణ**

| Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name |
|---|---|---|---|---|---|
| KSDRMPJ2506040003 | JATOTHU LAXMA | MABOBPJ2506300002 | RAMCHANDRU BODA | | |

**వేలం తేది: 23-12-2025 వేలం చిరునామా:2-23-1,1ST FLOOR, PALLAVI MEDICAL & GENERAL STOERS, MAIN ROAD. MULUGU 506343**

| Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name |
|---|---|---|---|---|---|
| MLUGUPJ2506050005 | BURRI SRILATHA | MLUGUPJ2504010011 | CHINTHA NAGAMANI | | |

**వేలం తేది: 23-12-2025 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి నం. 8-1-61 నుండి8-1-65 వరకు, గ్రౌండ్ ఫ్లోర్,జననీ కాంప్లెక్స్,హైదరాబాద్ రోడ్,సిద్దిపేట,సిద్దిపేటజిల్లా .502103**

| Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name |
|---|---|---|---|---|---|
| CHRILPJ2506060003 | PUTTA SRIKANTH | CHRILPJ2506130007 | THIRUPATHI ERI | CHRILRE2503190006 | CHENNAMALLU NARSAMMA |
| CHRILPJ2503110007 | BARMA RAJA MALLAIAH | CHRILPJ2506130008 | THIRUPATHI ERI | CHRILPJ2507010010 | GADARAJU ARUN KUMAR |
| CHRILPJ2503110013 | SOLANKI NOURTMAL | CHRILPJ2506170008 | GOLLAPALLI DASHARATH | CHRILPJ2507010018 | KANDUKURI VAMSHI |
| CHRILPJ2506110015 | SREENIVAS GANGARAMAINA | CHRILPJ2506180007 | DEVANABOINA SANTHOSH KUMA | CHRILPJ2507010011 | GADARAJU ARUN KUMAR |
| CHRILPJ2506110019 | UPPARI SAMPATH KUMAR | CHRILPJ2506230001 | AEDULA RAMCHANDRAM | | |

**వేలం తేది: 23-12-2025 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 1-4-249, మొదటి అంతస్తు,కూడా రోడ్,కొత్త బస్టాండ్ దగ్గర,సూర్యపేట,సూర్యపేట జిల్లా -508213 .**

| Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name |
|---|---|---|---|---|---|
| TRMLGPJ2506130002 | NAKKA BHADRAMMA | TRMLGPJ2506160003 | GANGI AVILAIH | TRMLGPJ2503270009 | LASKAR DHARAVATH |

**వేలం వేయు తేది: 23-12-2025 వేలం వేయు చిరునామా: 11-25-79 & 80 ,మొదటి అంతస్తు, MG రోడ్,వరంగల్,వరంగల్‌జిల్లా తెలంగాణ**

| Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name |
|---|---|---|---|---|---|
| WARN2PJ2506090009 | CHERIPELLY CHANDRA SHEKAR | WRNPTPJ2506230001 | VAKITI YAKAIAH | WRNG4PJ2506290001 | ARRA RAJENDER |
| WARN2PJ2506170001 | VADDURI PRASHANTH | WRNPTPJ2506250001 | DUMPALA NARASIMHA | WRNG4PJ2506290002 | ARRA RAJENDER |
| WRNPTPJ2506210013 | BHUKYA BHADRAIAH | WARN1PJ2506250004 | BANOTH SATHISH | WARN2PJ2503290001 | PENTHALA NAGARAJU |
| WRNPTPJ2506210011 | GADDA SARITHA | WRNPTPJ2506270002 | CHIRABOINA RAJU | WRNPTPJ2506300002 | DEVA NETHAVATH |
| WRNG4PJ2506230005 | TANGELLAPELLI UMA | WRNPTPJ2506270003 | ABARLA ARUNA | WRNPTRE2507010011 | GUNTI RAMULU |
| | | WRNL3PJ2503280002 | KATLA NAGARAJU | WRNPTPJ2507010005 | GUGULOTHU GOPAL |

**వేలం వేయు తేది: 23-12-2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి.నం.1-8-301,1వ అంతస్తు,TGSRTC బస్‌స్టాండ్ దగ్గర,హనుమకొండ రోడ్, భువనగిరి,యాదాద్రి భువనగిరి జిల్లా**

| Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name |
|---|---|---|---|---|---|
| ALERPJ2506020010 | DINAKAR UPPU | ALERPJ2506100004 | KALYANI CHOWDABOINA | ALERPJ2503210005 | DUSARI KISTAIAH |
| ALERPJ2506020009 | DINAKAR UPPU | ALERPJ2506140005 | SHARATH KUMAR MUDDEPAKA | ALERPJ2506240009 | BAIRAPAKA UMESH |
| ALERPJ2506030003 | MOHAMMAD JAVID | ALERPJ2506200003 | SATHYANARAYANA ARRAGOLLA | ALERPJ2503240010 | MARUPAKA RAMESH REDDY |
| ALERPJ2503060002 | RAMAKRISHNA GUJJA | ALERPJ2503200008 | KURSHID PASHA | | |
| ALERPJ2506090006 | MADHU MYLARAM | | | | |
| ALERPJ2506100011 | KETHAVATH SAI KUMAR | | | | |

**వేలం తేది: 23-12-2025 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి నం. 8-4-1,జోనల్ ఆఫీసు ఎదురుగా,ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం సమీపంలో,గణేష్ నగర్, కరీంనగర్.505001**

| Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name | Loan A/c No. | Customer Name |
|---|---|---|---|---|---|
| JMKNTPJ2506110002 | SARAIAH RACHAPALLI | JMKNTPJ2506250005 | RASAPELLI SHANKAR | JMKNTPJ2503270002 | MARRI THIRUPATHI |
| JMKNTPJ2503150003 | SHIVARATRI NAGARAJU | JMKNTPJ2503260003 | MARRI THIRUPATHI | | |

**వేలం సమయం: 11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ ఎం సురేష్ కుమార్** ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటి రోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 10.12.2025
స్థలం: వరంగల్

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

# మొదటి విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని మొదటి విడతలో భాగంగా మూడు మండలాల్లో ఈ నెల 11న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిల్లా ఎన్నికల పరిశీలకుడు శివకుమార్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుంచి ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెల్లడించారు. హనుమకొండ జిల్లాలో మొదటి విడతలో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ర్యాండమైజేషన్ పద్ధతిలో పీవోలు, ఓపీవోల ఎంపిక చేపట్టామని, స్థానికేతరులకే ఆయా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ.. ఓటర్లు తమ గుర్తింపు కోసం ఓటరు ఐడీ లేదా రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించిన 18 ప్రత్యామ్నాయ పత్రాలలో ఏదో ఒక దానిని చూపించవచ్చని స్పష్టం చేశారు. ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, బ్యాంక్, పోస్టు ఆఫీస్ పాస్‌పుస్తకం (ఫోటోతో), రేషన్ కార్డు (ఫోటోతో), పట్టాదారు పాస్‌పుస్తకం, ఉపాధి హామీ జాబ్ కార్డు, దివ్యాంగుల ధృవీకరణ పత్రం, పెన్షన్ పత్రాలు మొదలగు గుర్తింపుకార్డులను చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. పోలింగ్ ప్రారంభానికి ఒక గంట ముందు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో సెల్‌ఫోన్లు అనుమతించవద్దన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ప్రచారం నిషేధించబడినట్లు గుర్తుచేశారు. పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. పోలింగ్ ముగిసిన వెంటనే పోలింగ్ కేంద్రాల్లోనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించాలన్నారు.

ఫలితాల ప్రకటన తర్వాత ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని సూచించారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా సహకరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీపీవో లక్ష్మీ రమాకాంత్, ఎన్నికల వ్యయ పరిశీలకులు దేవేందర్, డీఆర్డీవో మేన శ్రీను, జడ్పీ సీఈవో రవి, తదితర అధికారులు పాల్గొన్నారు.

**పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు**

హనుమకొండ టౌన్: గ్రామ పంచాయతీ తొలివిడత ఎన్నికల కోసం హనుమకొండ జిల్లాలో పోలింగ్ సామగ్రి పంపిణీకి డిస్ట్రిబ్యూషన్- రిసెప్షన్ సెంటర్లు సిద్ధమయ్యాయి. కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాలపై భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండల కేంద్రాల్లో మంగళవారం ఏర్పాట్లు పూర్తయ్యాయి. భీమదేవరపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎల్కతుర్తిలో కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్, కమలాపూర్‌లో మోడల్ స్కూల్‌లో సెంటర్లను ఏర్పాటుచేశారు. పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ కోసం టెంట్లు, కౌంటర్లు, ఫర్నిచర్, తాగునీరు, భోజన వసతులు కల్పించామని ఎంపీడీవోలు వీరేశం, విజయ్‌కుమార్, బాబు తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ స్నేహ శబరీష్, ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు, వివిధ శాఖల అధికారులు

## ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**జిల్లా పరిశీలకుడు శివకుమార్‌నాయుడు**

హనుమకొండ కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగే మండలాల్లో పకడ్బందీ ఏర్పా ట్లు చేయాలని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకుడు శివకు మార్ నాయుడు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హా ల్‌లో ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, సంబంధిత అధికారులతో మంగళవారం ఎన్నికల పరిశీలకుడు సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా శివకుమార్ నాయుడు మాట్లాడుతూ.. సర్పంచ్, వార్డు స్థానాలకు సంబంధించి ప్రతీవార్డు బ్యాలెట్ పేపర్‌ను తనిఖీ చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్లు సరిగా ఉన్నాయా లేదా అని చెక్ చేసుకోవాలన్నారు. ఎన్నికల సామగ్రి, సిబ్బంది సరిపోను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని, పోలింగ్ అనంతరం కౌంటింగ్ జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు.

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ఈ నెల 11వ తేదీన మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించే భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను ఆర్‌వోలు వెళ్లి పరిశీలించాలని సూచించారు. పోలింగ్ రోజు ఈ మూడు మండలాలకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్లు తనిఖీ చేయాలని ఎంపీడీఓలు, స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వైవీ గణేష్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, డీఆర్‌డీఓ మేన శ్రీను, జడ్పీ సీఈఓ రవి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలేమిటి?

**లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ కావ్య**

హనుమకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వికలాంగులు, వృద్ధుల సంక్షేమానికి సంబంధించి వరంగల్ ఎంపీ కడియం కావ్య లోక్‌సభలో గళమెత్తారు. వీరి కోసం ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ సమాధానం ఇచ్చారు. వికలాంగుల పునరావాసానికి ఏడీఐపీ పథకం కింద ఆధునిక సహాయ పరికరాలు, అర్హులైవారికి ఆర్థిక సహాయం అందిస్తునట్టు తెలిపారు. ఆరోగ్య బీమా పథకం ద్వారా ఏటా రూ.లక్ష ఆరోగ్య బీమా పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. వృద్ధుల కోసం అటల్ వయో అభ్యుదయ యోజన (ఏవీవైఏవై) అమలు చేస్తున్నామన్నారు. ఆయుష్‌శాఖ ద్వారా వైద్య సహాయం అందిస్తున్నామన్నారు.

# భద్రకాళి ఆలయ సిబ్బంది సస్పెన్షన్

**నకిలీ టికెట్లు ఇచ్చినందున ఈవో చర్యలు**

వరంగల్ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవస్థానంలో టికెట్ కౌంటర్లలో పని చేస్తున్న సిబ్బంది ఎస్. నరేందర్, పి.శరత్‌కుమార్‌ను ఈవో రామల సునిత మంగళవారం సస్పెండ్ చేశారు. వారం రోజుల క్రితం ఆలయానికి వచ్చిన ఓ భక్తుడికి వాహన పూజకు సంబంధించి నకిలీ టికెట్లు ఇచ్చి డబ్బులు జేబులో వేసుకున్న విషయం గమనించిన సదరు వ్యక్తి ఈవోకు ఫిర్యాదు చేయడంతో ఆమె విచారణ చేపట్టారు. నకిలీ టికెట్లు ఇచ్చినట్లు నిర్ధారణ అయినందున వారిని సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఆలయ సిబ్బంది గాని, అర్చకులు గాని భక్తులను డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ మేరకు వాహనాలు పార్కింగ్ చేసే స్థలంలో బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. పూజల సందర్భంగా భక్తులను ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలని, వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం..**

**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

ఆలయాల్లో పూజల సందర్భంగా సిబ్బంది, అధికారులు, అర్చకులు ఎవరైనా భక్తులను డబ్బులు డిమాండ్ చేసినా, ఇతర విషయాల్లో అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. ఈ మేరకు ఈవోకు ఆదేశాలు జారీ చేశారు.

# రోడ్డుపైన పరిచి.. రోలర్‌తో తొక్కించి

**శబ్దకాలుష్యం చేస్తున్న బైక్ సైలెన్సర్లను ధ్వంసం చేసిన పోలీసులు**



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కాజీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శబ్దకాలుష్యం చేసే 335 ద్విచక్ర వాహన సైలెన్సర్‌లను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకొని కాజీపేట చౌరస్తాలో మంగళవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ మాట్లాడుతూ వరంగల్ ట్రైసిటీలో కొంతమంది యువకులు సౌండ్ పొల్యూషన్ చేసే సైలెన్సర్లను ద్విచక్ర వాహనాలకు బిగించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. యువకులు మళ్లీ ఇలాంటి సైలెన్సర్‌లను బైక్‌లకు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, హనుమకొండ, కాజీపేట, వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు జి.సీతారెడ్డి, పి.వెంకన్న, కె.సుగుణ, ఎస్సైలు ఎస్.సంపత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సైలెన్సర్లను రోడ్డుపైన పలు వరుసల్లో పెట్టి రోడ్డు రోలర్‌తో పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ దృశ్యాన్ని జనం ఆసక్తిగా తిలకించారు. బైక్‌లకు కంపెనీ బిగించే సైలెన్సర్లను తొలగించి, బాగా శబ్దం చేసే సైలెన్సర్ల బిగించుకొని కొంతమంది యువకులు రోడ్లపైన హల్‌చల్ చేస్తున్నారు. వారి న్యూసెన్సును అరికట్టేందుకు ఈ చర్యలు చేపట్టినట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# పన్ను బకాయి లక్ష్యాలను చేరుకోవాలి

**● మేయర్ గుండు సుధారాణి**

**● పన్ను వసూళ్లపై అధికారులతో సమీక్ష**

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలని మేయర్ గుండు సుధారాణి రెవెన్యూ అధికారులను సూచించారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తోపాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో బిల్ కలెక్టర్ల వారిగా ఇప్పటివరకు జరిగిన వసూళ్ల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. డిసెంబరు 31లోగా సూచించిన పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

ఆర్ ఐలు క్షేత్రస్థాయిలో పన్ను వసూళ్ల తీరును పరిశీలించారు. అన్ని పన్నులతో పాటు సమాంతరంగా నీటి పన్నును కూడా వసూలు చేయాలన్నారు. బడా బకాయిదారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నగరంలో చాలా మంది నల్లా పన్ను చెల్లించడం లేదని, ఇంటిపన్నుతో పాటు నల్లా పన్నులు తప్పకుండా చెల్లించే విధంగా అధికారులు దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ సిబ్బంది ప్రజల సహకారంతో పన్నుల వసూళ్ల మంచి గుర్తింపు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్‌లు రవీందర్, ప్రసన్నరాణి, ఆర్‌వోలు శ్రీనివాస్, షహజాదీ బేగం, ఆర్‌ఐలు, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

## గ్రామాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**కలెక్టర్ సత్యశారద**

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసినందున ఆయా గ్రామాల్లో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పోలింగ్ ప్రారంభానికి 44 గంటల ముందు ఆయా మండలాల్లో సైలెన్స్ పీరియడ్ అమలులోకి వస్తుందన్నారు. ఈ కీలక సమయంలో అధికారులు ఎలాంటి ఉల్లంఘనలు జరగకుండా పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్ని విభాగాల నోడల్ అధికారులకు సూచించారు. బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇతరత్రా ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని ఆదేశించారు. ప్రజలు గుంపులుగా ఉండకూడదని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం నాడు కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

## సూరంపేట సర్పంచ్ ఏకగ్రీవం



శశిపాల్ రెడ్డి

శాయంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాయంపేట మండలంలోని సూరంపేట గ్రామ సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైనట్టు ఎంపీడీవో ఫణిచంద్ర వెల్లడించారు. గ్రామంలో సర్పంచ్ స్థానం కోసం నలుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. ఇందులో ముగ్గురు అభ్యర్థులు విత్ డ్రా కావడంతో స్వతంత్ర అభ్యర్థి సూరం శశిపాల్ రెడ్డి ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికైనట్లు ఎంపీడీవో తెలిపారు. అలాగే గ్రామంలోని 8 వార్డులులకుగాను 11 నామినేషన్‌లు దాఖలు కాగా ముగ్గురు ఉపసంహరించుకోవడంతో మొత్తం 8 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని ఎంపీడీవో తెలిపారు.

# ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి

**భయంతో మృతదేహాన్ని మాయం చేయడానికి ప్రయత్నించిన డ్రైవర్**

**భూపాలపల్లి జిల్లాలో వెలుగు చూసిన ఘటన**



రాకేష్ (ఫైల్)

గణపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సరదాగా ట్రాక్టర్ ఎక్కి కూర్చున్న బాలుడు జారి పడ్డాడు.. టైర్ కింద నలిగిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.. దీంతో ఏం చేయాలో తోచలేదు డ్రైవర్‌కు.. చివరకు బాలుడి మృతదేహాన్ని మాయం చేసే ఉద్దేశంతో గోనె సంచిలో మృతదేహాన్ని వేసి గట్టుచప్పుడు కాకుండా ఓపెన్‌కాస్టు మట్టి గుట్టల వద్ద పడేశాడు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో ఆలస్యంగా సోమవారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

గణపురం మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన బండెల రాజు-రజిత దంపతులు వ్యవసాయ కూలీలు. వీరికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు రాకేష్(5) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నర్సరీ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో అతడు ఇంటి వద్దే ఉండగా తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి సమీపంలో ఉండే గంపల శంకర్ తన సొంత ట్రాక్టర్‌ను తీసుకొని వరి కోతలకు బయల్దేరగా రాకేష్‌తోపాటు మరో బాలుడు అతడితో వెళ్లారు. ఇద్దరూ సరదాగా ట్రాక్టర్ ఎక్కారు. ఈ క్రమంలో రాకేష్‌తో కలిసి వచ్చిన బాలుడు మార్గమధ్యలోనే దిగిపోయాడు. వ్యవసాయం క్షేత్రానికి చేరుకొని ధాన్యాన్ని నింపుకొని తిరిగి వస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పింది. దీంతో డ్రైవర్ పక్కనే కూర్చొని ఉన్న రాకేష్ ఒక్కసారిగా జారి పడ్డాడు. ట్రాక్టర్ వెనుక భాగంలో పడిపోగా అతడిపై నుంచి టైర్ ఎక్కింది. దీంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

ఈ దుర్ఘటనతో డ్రైవర్ బీతిల్లిపోయాడు. ఏం చేయాలో తోచక బాలుడి మృతదేహాన్ని గోనె సంచిలో వేసి సమీపంలోని ఓపెన్‌కాస్టు-3 మట్టి గుట్టల వద్ద పడేశాడు. ఆదివారం సాయంత్రం వరకు బాలుడు ఇంటికి రాకపోవడంతో బాలుడి తల్లితండ్రులు శంకర్‌ను ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పాడు. దీంతో తమ కుమారుడిని శంకర్ కిడ్నాప్ చేశాడంటూ బాలుడి తండ్రి సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు శంకర్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా జరిగినదంతా అతడు వివరించాడు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాలుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడైన డ్రైవర్ శంకర్‌ను అరెస్టు చేశామని ఎస్సై అశోక్ తెలిపారు.

# ఉమ్మడి జిల్లా స్థాయి బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో డిసెంబరు మూడోవారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అంతర్ జిల్లాల అండర్-16 బాలుర క్రికెట్ టోర్నీలో పాల్గొననున్న ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 5న ప్రారంభమైన జిల్లా స్థాయి అండర్-16 బాలుర క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల నుంచి ఆరు జట్లను ఎంపిక చేసి లీగ్ కం నాకౌట్ పద్ధతిన మొగిలిచర్ల, వంగపల్లి క్రికెట్ మైదానాల్లో జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించామని శ్రీనివాస్ తెలిపారు. హోరా హోరీగా జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ కనబర్చిన క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయికి ఎంపికైన ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఈ నెల మూడో వారంలో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అంతర్‌జిల్లా అండర్-16బాలుర క్రికెట్ టోర్నీలో పాల్గొంటారన్నారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి జిల్లాకు ఒక జట్టును ఎంపిక చేసి మూడు రోజులు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించగా ఇందులో వరంగల్ జిల్లా జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెలక్షన్ కమిటీ చైర్మన్ ఫుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు రఘురాం, నిజాముద్దీన్, తోట రాము, సంయుక్త కార్యదర్శి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

**క్రీడాకారులు వీరే..**

సాత్విక్‌యాదవ్, ఓ.కుమార్, ఇ.శివకాశి, అన్విత్, వి.సుప్రీత్, బి.విశేఖర్



పోటీలకు ఎంపికైన ఉమ్మడి వరంగల్ జిల్లా బాలుర జట్టు

సాయి, ఎస్.శ్రీతేజ్, హర్షిత్, ఇమ్రాన్, సాత్విక్, వేదాంతశర్మ, ఎం.మనీష్ కుమార్, టి.శ్రీచరణ్, ఎం.సాయిహర్షిత్, ప్రేమతేజ, ఎన్.జయంత్, సుహాన్, హర్షిల్, రాకేష్, స్నేహిత్ హెచ్‌సీఏ అంతర్ జిల్లాల పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారు.

## మౌలాలి రైల్వేస్టేషన్‌లో మరమ్మతులు

**ఈ నెల 21న చర్లపల్లి వరకే పలు రైళ్లు**

కాజీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మౌలాలి రైల్వేస్టేషన్‌లో రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు, పలు మరమ్మతు పనుల దృష్ట్యా ఈ నెల 21న సికింద్రాబాద్ - మౌలాలి మధ్య నడిచే పలు రైళ్ల రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (12706) సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్, (12757) సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్‌డౌన్, (17202) సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్, (67764) కాజీపేట - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే అప్‌అండ్‌డౌన్ పుష్ పుల్, (20101) నాగ్‌పూర్ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైళ్లు ఈ నెల 21న చర్లపల్లి రైల్వేస్టేషన్ వరకే నడుస్తాయని, తిరిగి చర్లపల్లి నుంచే ప్రారంభిస్తారని రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 22న తిరిగి ఈ రైళ్లు యథావిధిగా నడుస్తాయని చెప్పారు. సికింద్రాబాద్ న్యూఢిల్లీ, సికింద్రాబాద్ - చెన్నై రూట్‌లలో నడిచే పలు రైళ్లు ఈ నెల 21న దారి మళ్లించి నడిపిస్తున్నామని చెప్పారు.

## కేయూ సౌత్ జోన్ వాలీబాల్ పురుషుల జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించే 2025-26 సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ కాకతీయ యూనివర్సిటీ పురుషుల వాలీబాల్ పోటీలకు జట్టు ఎంపికైంది. ఈ మేరకు మంగళవారం కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య ఎంపిక క్రీడాకారుల వివరాలను వెల్లడించారు. ఎంపికైన వారిలో ఎం.లక్ష్మణస్వామి, జె.సాయికిరణ్, కె.సాయికుమార్ ఆర్.వెంకటేశ్వర్‌రావు, కె.ఉదయ్‌కుమార్, బి.శివకుమార్, జి.వసంతరావు, ఎ.సంజీవ్‌కుమార్, టి.రామచరణ్ అంజీ, ఐ.భీమ్‌రావు, పి.ఆదినారాయణ, బి.రోషన్, టి.జశ్వంత్‌లు ఎంపికైనట్లు వెంకయ్య వెల్లడించారు. జట్టుకు కోచ్, మేనేజర్‌గా వి.రామాంజనేయులు వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో వెంకయ్య తదితరులు

# తెలంగాణ ఉద్యమానికి ఢిల్లీ గడగడలాడింది

**● చరిత్ర కడుపున పుట్టిన ఉద్యమాగ్ని శిశువు కేసీఆర్**

**● అది గ్లోబల్ సమ్మిట్ కాదు.. లోకల్ సమ్మిట్**

**● దీక్షా దివస్ ముగింపులో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**

హనుమకొండ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ ఆమరణ దీక్ష తర్వాత ఉద్యమం ఉధృతంగా మారి ఢిల్లీని గడగడలాడించిందని కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో దీక్షా దివస్ ముగింపు వేడుకలను ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలలో ముందుగా శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి తెలంగాణ ఉద్యమ నేపథ్యం, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన, సంక్షేమం గురించి వివరించారు.

ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సుభిక్షం కోసం 2001లో కేసీఆర్ టీఆర్‌ఎస్ పార్టీని స్థాపించారని అన్నారు. చరిత్ర కడుపున ఉద్యమ అగ్ని శిశువుగా కేసీఆర్ జన్మించారని, కేసీఆర్ వ్యూహం లేకపోతే తెలంగాణ వచ్చేది కాదన్నారు. అయితే కేసీఆర్ పోరాటం చేస్తే తెలంగాణ రాలేదని, సోనియా దయ వల్ల వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని దేశపతి విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో హైడ్రా పేరుతో వేయికిపైగా పేదల ఇళ్లను కూల్చి వేశారని, ఈ బుల్డోజర్ ప్రభుత్వాన్ని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ గొప్పతనాన్ని, పోరాట పటిమను అప్పటి కేంద్ర మంత్రి ప్రణబ్‌ముఖర్జీ తన పుస్తకంలో గొప్పగా రాశారని, ఆ విషయాన్ని రేవంత్‌రెడ్డి తెలుసుకోవాలని సూచించారు.

సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో నిర్వహించింది గ్లోబల్ సమ్మిట్ కాదు.. లోకల్ సమ్మిట్‌లాగా ఉందని దేశపతి ఎద్దేవా చేశారు. 2009లో అప్పటి టీఆర్‌ఎస్ తక్కువ సీట్లు గెలవడంతో కేసీఆర్ పనిఅయిపోయిందని అని ప్రచారం చేశారని, మళ్లీ ఉద్యమాన్ని ఉధృతం చేసి రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. తెలంగాణలో రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్, అనే సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నదే కేసీఆర్ ధ్యేయమని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం తొలగించి కాంగ్రెస్ కార్యకర్త విగ్రహంలా రూపకల్పన చేసి రేవంత్‌రెడ్డి పైశాచికత్వాన్ని నిరూపించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, జోరిక రమేష్, బుద్దె వెంకన్న, పోలెపల్లి రాంమూర్తి, తక్కళ్లపెల్లి విసీల్ రావు, నయీమొద్దీన్, పస్తం అనిల్, తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు





**WANTED**

★ హన్మకొండలోని ప్రముఖ కోఆపరేటివ్ బ్యాంకుల్లో పనిచేయుటకు బ్యాంకింగ్ రంగంలో అనుభవం గల అకౌంటెంట్స్ గోల్డ్‌లోన్ స్టాఫ్ మరియు మార్కెటింగ్ ఏజెంట్స్ (M/F) కావలెను. Age:25-35 సం॥ప్ర॥ 9502121397, 9441863251 AJW-257176

**CHANGE OF NAME**

★ I, AKKANAKUNTA VENKATAIAH(Old Name), S/o. Pochaiah , H.No58-3-44, SC Colony, kadipikonda, Kazipet(M), Hanumakonda (Dist) T.G., Pin 506003. I Have Changed My Name as AKKENAKUNTA VENKATA SWAMY [New Name], S/o. Pochaiah, For all Future Purposes AJW-257228

**అమ్మబడును**

★ హనుమకొండ, శాయంపేట బస్‌స్టాప్ దగ్గరలో గల మా ఆఫీస్‌లోని ఫర్నీచర్ అమ్మబడును. సం॥ప్ర॥ 9440714846. AJW-257117

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

**3+2 స్కీం కలదు**

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

**ప్రకటనల కొరకు సంప్రదించండి**

హన్మకొండ
9985400013
8978510273
9985411677

వరంగల్
9949638376
9985408173

జనగామ
9866431354

మహబూబాబాద్
9985418040

తొర్రూర్
9985418040

నర్సంపేట
9949638376

భూపాలపల్లి
9985401232

పరకాల
9985401232

### వర్గాన్ని కాదు..
# వ్యక్తిని చూసి ఎన్నుకోండి

వర్ధన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మీ గ్రామం అభివృద్ధి చెందలేదని బాధపడుతున్నారా? రహదారులు, మురుగు కాల్వలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా ? ఇప్పటిదాక ఎన్నికైన సర్పంచులు రాజకీయాలు చేయడం మినహా ప్రగతి మరిచిపోయారని ఆవేదన చెందుతున్నారా ? అలాంటి బాధలకు తెరదించే రోజు వచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ నెల 11, 14, 17తేదీల్లో జరుగుతున్న ఎన్నికల్లో ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించండి.. మంచి లక్షణాలు ఉన్న అభ్యర్థిని ఎంచుకోండి. వ్యక్తిగత ప్రయోజనం కన్నా ప్రజల ప్రయోజనానికి ప్రాధాన్యం ఇవ్వండి.

**సర్పంచుకు ఉండాల్సిన లక్షణాలు**

గ్రామస్థులకు నిత్యం అందుబాటులో ఉండాలి. బాధితుల సమస్యను చిత్తశుద్ధితో విని పరిష్కారానికి కృషి చేయాలి. కులం, వర్గం, పార్టీ, బంధువులు అన్న తారతమ్యం చూపకుండా అందరినీ సమానంగా చూడాలి. గ్రామ నిధులను పారదర్శకంగా వినియోగించాలి. ప్రతీ పైసాను ప్రజల అవసరాలకే వెచ్చించాలి. ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి అవి అర్హులకు అందేలా చొరవ చూపాలి. గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి. అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. గ్రామ సమస్యలపై త్వరగా పరిష్కరించాలి. రోడ్లు, నీరు, విద్యుత్, పాఠశాలలు, వైద్య సదుపాయాలు, యువతకు అవకాశాలు.. ఇలా అన్ని అంశాల్లో అభివృద్ధికి కృషి చేయాలి. గ్రామసభలు నిర్వహించి ఆర్థిక వివరాలు ప్రజలకు తెలుపాలి. ఎవరు ఏం అడిగినా నిజాయితీగా సమాధానం ఇవ్వాలి. గొడవలు, కేసులు, కొట్లాటలు జరగకుండా చూడాలి. ప్రజల మధ్య సత్సంబంధాలు పెంచాలి. గ్రామంలో శాంతిని నెలకొల్పాలి.



# తొలి విడతకు భారీ బందోబస్తు

- వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని11 మండలాల్లో పోలింగ్
- ఇప్పటికే 156 లైసెన్స్‌డ్ తుపాకులు స్వాధీనం
- 1,470 మంది బైండోవర్
- విధుల్లోకి 1,800 మంది సిబ్బంది

వరంగల్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న జరిగే మొదటి విడత పంచాయతీ పోలింగ్‌కు పోలీసులు పకడ్బందీగా బందోబస్తు సిద్ధం చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మూడు జిల్లాల (వరంగల్, హనుమకొండ, జనగామ) పరిధిలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా 152 లైసెన్స్‌డ్ తుపాలకుల స్వాధీనం చేసుకోవడంతోపాటు రౌడీషీటర్లతో పాటు ఎన్నికలకు విఘాతం కల్గించే వ్యక్తులను బైండోవర్ చేశారు. పోలింగ్ జరిగే గ్రామాల్లో ఎలాంటి అల్లర్లకు పాల్పడినా కఠినమైన చర్యలు ఉంటాయని గ్రామాల్లో పోలీస్ కవాతుతో హెచ్చరించారు.

**విధుల్లో 1,800 మంది పోలీసులు**

రాష్ట్రమంతా ఎన్నికలు జరుగుతున్నందున బయట జిల్లాల నుంచి పోలీసులు వచ్చే అవకాశం లేనందున కమిషనరేట్‌లోని అధికారులు, సిబ్బందితోనే మూడు విడతలకు రొటేషన్ పద్ధతిలో బందోబస్తు విధులకు వినియోగించనున్నారు. డీసీపీల నుంచి హోంగార్డు వరకు ప్రతీ ఒక్కరికి బందోబస్తు డ్యూటీని కేటాయించారు. వారిలో జోన్‌ల వారీగా ఉన్న ముగ్గురు డీసీపీలతో పాటు ముగ్గురు అదనపు డీసీపీలు, 12 మంది ఏసీపీలు, 23 మంది సీఐలు, 100 మంది ఎస్సైలు, 11 మంది మహిళా ఎస్సైలు, 56 మంది ఏఎస్సైలు, మహిళా ఏఎస్సైలు, 200 మంది హెడ్‌కానిస్టేబుల్స్, 730 మంది కానిస్టేబుల్స్, 200 మంది మహిళా కానిస్టేబుల్స్, ఏఆర్ సిబ్బంది విధుల్లో నిమగ్నం కాబోతున్నారు. కమిషనరేట్ సరిహద్దుల్లో ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి అక్రమ మద్యం, నగదును నివారించేందుకు ఆరు చెక్‌పోస్టులు ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ రూట్‌లో పెంబర్తి, మహబూబాబాద్ రూట్‌లో వేపచెట్టుతండా, ఖమ్మం రూట్‌లో రాయపర్తి, కరీంనగర్ రూట్‌లో పెంచికలపేట, మరో రెండు రూట్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఏమైనా అల్లర్లు చోటుచేసుకుంటే తక్షణమే అక్కడికి చేరుకొని ఘర్షణలను అదుపులోకి తెచ్చేందుకు స్థానిక ఏసీపీ ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, సీఐ, ఎస్సై ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు.

**270 గ్రామ పంచాయతీలపై ఫోకస్**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా మూడు విడతల్లో 35 మండల్లాలోని 807 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ జరగనుంది. మొదటి విడతలో భాగంగా 11 మండలాల్లోని 270 గ్రామ పంచాయతీల్లో నిర్వహించే పోలింగ్‌పై పోలీసు యంత్రాంగం మొదటగా దృష్టిసారించింది. 270 పంచాయతీల్లో 95 రూట్‌లుగా విభజించి 193 సాధారణ, 77 సమస్యాత్మక పంచాయతీలను గుర్తించి సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్‌స్క్వాడ్, ఎస్ఎస్‌టీ బృందాలతో పాటు కమిషనరేట్ కార్యాలయంలోని ఎస్‌బీ, ఎలక్షన్ సెల్, పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయనున్నారు.

# మద్యం షాపులకు సీల్

- తొలి విడత ఫలితాలు వచ్చే వరకు మూసివేత
- 6 మండలాల్లో బంద్ అమలు



మద్యం షాపునకు సీల్ వేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వరంగల్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల మొదటి విడతలో పోలింగ్ జరిగే గ్రామాల పరిధిలోకి వచ్చే వైన్, బార్‌షాపులకు అబ్కారీ అధికారులు మంగళవారం సాయంత్రం 5 గంటలకు సీల్ వేశారు. తొలి విడత ఎన్నికలు జరిగే వరంగల్ అర్బన్ ఎక్సైజ్ సూపరింటెండెట్ పరిధిలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్‌లో కొనసాగుతున్న 14 వైన్ షాపులతో పాటు ఒక బార్ షాపుకు ఎక్సైజ్ సీఐలు దర్గా భవాని, చంద్రమోహన్ ఆధ్వర్యంలో సీల్ వేసినట్లు సూపరింటెండెం ట్ చంద్రశేఖర్ తెలిపారు. అదే విధంగా వరంగల్ రూరల్ ఎక్సైజ్ పరిధిలోకి వచ్చే వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరిలో పోలింగ్ జరిగే ప్రాంతాల పరిధిలోకి వచ్చే సుమారు 6 మద్యం షాపులకు సీఐ స్వరూప ఆధ్వర్యంలో సీల్ వేసినట్లు సూపరింటెండెంట్ అరు ణ్ తెలిపారు. 11న పోలింగ్ ఫలితాలు వచ్చే వరకు ఆయా గ్రామా ల పరిధిలో మద్యం షాపులు మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈ రెం డున్నర రోజులు మద్యం విక్రయాలు జరగకుండా ఆయా ఎక్సైజ్ ఠాణాల అధికారులతో పాటు అబ్కారీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

## 173 వాహనాలు సీజ్

వరంగల్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సోమవారం రాత్రి కమిషనరేట్ వ్యాప్తంగా 57 ప్రాంతాల్లో నిర్వహించిన నాకాబందీలో 8,259 వాహనాలు తనిఖీలు చేసి 173 వాహనాలు సీజ్ చేసినట్లు సీపీ వెల్లడించారు. 7 అక్రమ మద్యం రవాణా కేసులు నమోదు చేసి లక్ష 18వేల మద్యంతో పాటు 3 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా రూ. 1,50,000 నగదుతో పాటు అనుమతి లేని 49 వేల విలువ చేసే బాణా సంచాను సీజ్ చేశామన్నారు. మడికొండ పీఎస్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మిస్సింగ్ కేసులో కనిపించకుండా పోయిన వ్యక్తి పోలీసులు గుర్తించామన్నారు.

## నేడు, రేపు 163వ సెక్షన్ అమలు

### పోలీస్ అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా సాగేందుకు పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. మొదటి విడత పోలింగ్‌లో భాగంగా సీపీ మంగళవారం డీసీపీలు, ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, పోలింగ్ కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో గుంపులుగా లేకుండా జాగ్రత్త పడాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వచ్చి, వెళ్లేమార్గాలు ఒకటే ఉండేలా చూడాలన్నారు. సమస్య తలెత్తితే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసు బలగాలను రప్పించుకోవాలన్నారు.

పోలింగ్ సమయం ముగిసిన వెంటనే క్యూలైన్‌లో ఉన్న వరకు మాత్రమే అనుమతించాలన్నారు. పోలింగ్ పరిసరాల్లో ప్రచారాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ఫలితాలు ప్రకటించే వరకు బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు కవిత, అంకిత్‌కుమార్, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

**పోలింగ్ ప్రాంతాల్లో గుంపులుగా ఉండడం నిషేధం**

మొదటి విడత పంచాయతీ ఎన్నిల పోలింగ్‌లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాల్లో పోలింగ్ జరిగే ప్రాంతాల్లో గుంపులు, గుంపులుగా ఉండటం నిషేధమని సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలోని బీఎన్ఎస్ 163 సెక్షన్ ప్రకారం.. ఐదుగురు.. అంతకంటే ఎక్కువ ఉండటం నేరమని, ఈ సెక్షన్ బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం రాత్రి 8గంటల వరకు అమలులో ఉంటుందన్నారు. ఉత్తర్వలును అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

# ఊగుతున్న ఊళ్లు

(5వ పేజీ తరువాయి)

అన్నివర్గాల వారి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేశారు. ఇక నామినేషన్లతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల్లో కీలకమైన వారిని తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు లిక్కర్ వ్యూహం అమలు చేస్తున్నారు. పొద్దంతా ప్రచారం చేస్తున్న అభ్యర్థులు చీకటి అయిందంటే చాలు.. పెద్ద మనుషులను మజా చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు. మందుతో పాటు చికెన్, ఫిష్, మటన్‌లల్లో ఆ పెద్దమనిషికి ఏది ఇష్టమైతే దానితో చీర్స్ కొడుతున్నారు. మద్యం కిక్కులో పెద్దమనుషుల అభయం తీసుకుంటున్నారు.

ఇక పల్లెల్లో కీలక పాత్ర పోషించే కుల, యువజన సంఘాలను సైతం తమకు మద్దతు ఇచ్చేలా అభ్యర్థులు దావత్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మద్యంతో పాటు అన్నిరకాల నాన్‌వెజ్‌లు దిగుతున్నాయి. డీజేలతో చీర్స్ కొడుతూ చిందులేస్తున్నారు. అభ్యర్థులకు పొద్దంతా ఓ లెక్క.. రాత్రైతే మరో లెక్కనట్లుగా ఖర్చు తడిసి మోపడవుతోంది. పల్లెల్లో చీప్‌లిక్కర్ తాగేవాళ్లు కూడా ఎన్నికలు కావటంతో బ్రాండెడ్ మందే కావాలంటున్నారు. చీప్ లిక్కర్ పంపిస్తే ముఖం చిట్లించుకుని.. ఎన్నడో ఈ మందు బంద్ పెట్టినా.. బ్రాండెడ్ మందు ఉంటే ఇవ్వు.. లేకుంటే వదిలేయ్.. అంటూ మొహమాటం లేకుండా చెప్పేస్తున్నారు. దీంతో ఫుల్, హాఫ్ బాటిల్స్ కంటే క్వార్టర్స్‌కే ఎక్కువ డిమాండ్ ఉందని మద్యం షాపుల యాజమానులు చెప్తున్నారు.

చిన్న గ్రామ పంచాయతీలో అయితే మద్యం కోసమే రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నారు. ఇక పెద్ద గ్రామ పంచాయతీ అయితే రూ.లక్ష నుంచి రూ.5లక్షలకు పైగా ఒక్కొక్క అభ్యర్థి మద్యం కోస మే ఖర్చు చేస్తున్నారు. గ్రామ పంచాయతీలో ఇద్దరు, ముగ్గురు పోటీ చేస్తే మద్యం కోసమే రూ.3లక్షల నుంచి రూ.20లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఎన్నికల కోసం పెట్టే ఖర్చులో సగానికిపైగా మద్యం కోసమే ఖర్చు చేస్తున్నారనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. ఏకగ్రీవమైన గ్రామాల్లో కూడా మద్యం ఖర్చు తప్పటం లేదట.

ఉమ్మడి జిల్లాలో 1,706 గ్రామాలకు ఎన్నికలు జరుగు తుండగా, మద్యం కోసమే ఏకంగా రూ.60కోట్ల నుంచి రూ. 100కోట్ల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గురువారం మొదటి విడత పంచాయతీ ఎన్నిక లు ఉండటంతో మూడు నాలుగు రోజుల నుంచే మద్యం కొనుగోలు చేసి, నమ్మకస్తుల ఇళ్లల్లో డంప్ చేశారు.

# విలువైన పరిశోధనలను అందించాలి

### కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యువ పరిశోధకులు దేశానికి విలువైన పరిశోధనలు అందించాలని కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం అన్నారు. కేయూలో రెండు రోజుల పాటు జరుగనున్న నోబెల్ ప్రైజ్‌డే సెలబ్రేషన్స్‌ను క్యాంపస్‌లో రిజిస్ట్రార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, స్టూడెంట్స్ వెల్ఫేర్ ఆఫీసర్ రాధిక నేతృత్వంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో రిజిస్ట్రార్ మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ వేడుకలు దోహదపడుతాయన్నారు. యువతలో పరిశోధన దృక్పథాన్ని పెంపొందించాలన్నారు.

**11 విభాగాల్లో పోస్టర్ ప్రజంటేషన్**

నోబెల్ ప్రైజ్‌డే మొదటి రోజు మంగళవారం కేయూ క్యాంపస్‌లోని 11 విభాగాల్లో పోస్టర్ ప్రజంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అన్ని విభాగాల్లో 335 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కేయూ రిజిస్ట్రార్‌తో పాటు క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ మైక్రోబయోలజీ విభాగంలో విద్యార్థుల పోస్టర్లను పరిశీలించారు.

**విభాగాల వారీగా ఇవే..**

లైఫ్‌సైన్సెస్ విభాగంలో బాటనీ, జువాలజీ, మైక్రోబయోలజీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, ఫార్మసీ విభాగాల్లో 212 మంది విద్యార్థులు అలాగే కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎకానమిక్స్, ఇంగ్లీష్ విభాగాల్లో 123 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. రసాయన శాస్త్ర విభాగంలో శాస్త్రం, సమాజాన్ని మార్చిన నోబెల్ రసాయన శాస్త్ర ఆవిష్కరణలు, అనే అంశంపై ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. అలాగే భౌతికశాస్త్రం విభాగంలో 'నోబెల్ భౌతిక ఆవిష్కరణలు ఆధునిక ప్రపంచాన్ని ఎలా ఆకృతీకరించాయి' అనే అంశంపై మంజుల నేతృత్వంలో పోటీలు జరిగాయి.

లైఫ్ సైన్సెస్, ఫార్మసీ విభాగంలో నోబెల్ ఆవిష్కరణలు మానవ ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడతాయి.. అనే అంశంపై విభాగాధితులు ప్రొఫెసర్ జానపురెడ్డి కృష్ణవేణి, శాస్త్రి, సుజాత, కుడ్లె మధుకర్, లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ వై.వెంకయ్య నేతృత్వంలో పోటీలు జరిగాయి. వీటితోపాటు ఆర్థిక శాస్త్ర విభాగంలో నోబెల్ ఆర్థిక శాస్త్ర విజేతలు సమాజాలను ఎలా మార్చారు.. అనే అంశం ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ఇంగ్లీష్ విభాగంలో సాహిత్యంలో నోబెల్ విజేతలు అనే అంశంపై పోటీలు జరిగాయి. పోటీలకు ఆయా విభాగాల ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు పి.వెంకటగోపీనాథ్, సంగీత్, చంద్రశేఖర్, రంగారెడ్డి,ప్రియాంక, కవిత, మహేందర్, రాజేందర్, సాధు రాజేశ్, ఈవీ రావు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న అధ్యాపకులు, పరిశోధకులు

**నేడు ముగింపు**

నోబుల్ ప్రైజ్ డే సెలబ్రేషన్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బుధవారం బహుమతులను పంపిణీ చేయనున్నారు. పోస్టర్ ప్రజంటేషన్, వక్తృత పోటీల్లో విజేతలకు కేయూ సెనెట్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులను అందచేస్తామని స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి తెలిపారు. ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, తన్నై నాగ్, చంద్రశేఖర్, రాజా విశ్వనాథన్‌లో హాజరై పరిశోధన అంశాలపై ఉపన్యాసాలు ఇస్తారు.

# అవినీతి ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- లోక్‌సత్తా ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు రామ్మోహనరావు
- అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జ్వాల ర్యాలీ
- ప్లకార్డులు పట్టుకొని పాల్గొన్న యాచకులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విభాగాల్లో అవినీతి సర్వసాధారణంగా మారిందని, అవినీతికి పాల్పడ్డ ప్రభుత్వ ఉద్యోగులపై ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేసినా.. ఎలాంటి ఫలితం లేకుండాపోతోందని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు బండారి రామ్మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ, లోక్‌సత్తా సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ వేయిస్తంభాల ఆలయం ఎదుట 'అవినీతికి పాల్పడం కన్నా.. అడుక్కు తినడం మిన్న' అంటూ వినూత్న రీతిలో యాచకులతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రామ్మోహనరావు పాల్గొని ముందుగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

లోక్‌సత్తా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ మాట్లాడుతూ.. ఏసీబీ అధికారులకు పట్టుబడిన ప్రభుత్వ ఉద్యోగులు మళ్లీ ఉద్యోగంలో చేరకుండా నిబంధనలు కఠినతరం చేయాలని, పూర్తి స్థాయిలో ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జీతాలు, ఫించన్లు తీసుకుంటూ అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అడుక్కునే యాచకుల కంటే హీనమైన స్థితిలో ఉన్నారని అన్నారు. అందుకే యాచకులతో వినూత్న రీతిలో ఈ ర్యాలీ నిర్వహించామని ప్రశాంత్ తెలిపారు.

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న యాచకులను సమీకరించి వారికి ప్లకార్డులు అందజేసి నిర్వహించిన ఈ ర్యాలీ వేయి స్తంభాల ఆలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు వినూత్న రీతిలో సాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్ వీవీ రావు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ కార్యవర్గ సభ్యులు అచ్చె అమర్‌నాథ్, బుర్రి కృష్ణమూర్తి, ప్రకాష్, గుండపు సాయి చంద్, ఎల్బీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు, నగరంలో వివిధ కూడళ్లలోని బిచ్చగాళ్లు తదితరులు పాల్గొన్నారు.


**బహిరంగ ప్రకటన**

ICICI Bank నమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390 007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

**బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన**

ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి వారిచే వినియోగించబడిన బంగారు ఆభరణాలపై రుణవసతి ("వసతి")గా పొందిన వారి బకాయి మొత్తములను చెల్లించవలసినదిగా దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడినవి. తమ బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తప్పనిసరి పరిస్థితిలో డిసెంబర్ 20, 2025న తనఖా చేయబడిన బంగారు ఆభరణములను మేము వేలము నిర్వహించుచున్నాము. ముందస్తు సమాచారం లేకుండా ఖాతాను తొలగించు / వేలము తేదీని మార్చు హక్కును ICICI బ్యాంక్ కలిగియున్నది. వేలము ఆన్‌లైన్ ద్వారా మ.12.30 గం. నుండి మ.3.30 గం.ల మధ్య https://gold.samil.in లో నిర్వహించబడును. సవివర నియమ నిబంధనల కొరకు దిగువ ఇచ్చిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి. ఒకవేళ రుణగ్రహీత మరణించినచో న్యాయవారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

| రుణ ఖాతా నం. | ఖాతాదారు పేరు |
|---|---|
| శాఖ పేరు: ఆదిలాబాద్-రాజీవ్ నగర్ | |
| 664857015037 | సయ్యద్ ఖయాజుద్దీన్ |
| శాఖ పేరు: [illegible] | |
| 220062000253 | జి. రాజేందర్ |
| 220062001078 | మంగలిపల్లి లలిత |
| 220062001786 | పిట్టల విజయ్ |
| 220062001826 | [illegible] లక్ష్మి |
| శాఖ పేరు: ఆర్మూర్ | |
| 069557000067 | మహ్మద్ ముజమ్మిలుద్దీన్ |
| 069557000106 | పొనుగంటి భాస్కర్ |
| శాఖ పేరు: బోయిన్‌పల్లి | |
| 761262002043 | [illegible] శివకుమార్ |
| శాఖ పేరు: [illegible] | |
| 220162001642 | మంద లక్ష్మి |
| శాఖ పేరు: చౌటుప్పల్ | |
| 756262000817 | [illegible] |
| 756262000586 | పోలిపురం మహేందర్ రెడ్డి |
| 756262000323 | పోలిపురం మహేందర్ రెడ్డి |
| 756262000847 | సురేష్ [illegible] |
| శాఖ పేరు: [illegible] | |
| 221862002660 | [illegible] పరమేష్ |
| శాఖ పేరు: ధారూర్ | |
| 220362000729 | భూపతి తిరుపతి |
| శాఖ పేరు: గద్వాల్ | |
| 092062013127 | నరేష్ నరేష్ |
| 092062014742 | చిట్టెమ్మ చిట్టెమ్మ |
| శాఖ పేరు: ఘట్‌కేసర్ | |
| 179362007076 | శివశంకర్ పిండి |
| శాఖ పేరు: గోదావరిఖని | |
| 068257000112 | శ్రీనివాస్ జిన్నంశెట్టి |
| శాఖ పేరు: గుడిపల్లి | |
| 221962000468 | [illegible] |
| శాఖ పేరు: హుజూరాబాద్, తెలంగాణ | |
| 362962006346 | [illegible] |
| శాఖ పేరు: హైదరాబాద్-[illegible] | |
| 754057000025 | శీలం రాజశేఖర్ |
| శాఖ పేరు: హైదరాబాద్-చాంద్రాయణగుట్ట | |
| 752657000022 | మహ్మద్ జమీల్ |
| శాఖ పేరు: హైదరాబాద్-ఎల్.బి.నగర్ | |
| 131462003643 | [illegible] |
| శాఖ పేరు: హైదరాబాద్-మోతీనగర్ | |
| 236657000159 | వెంకటేష్ [illegible] |
| శాఖ పేరు: హైదరాబాద్-సాగర్ సొసైటీ | |
| 469757000013 | [illegible] |
| శాఖ పేరు: హైదరాబాద్-సైనిక్‌పురి | |
| 232157000066 | అమిత్ సింగ్ |
| శాఖ పేరు: హైదరాబాద్-సరూర్‌నగర్ | |
| 486457000033 | ఆర్. ప్రశాంత్ |
| శాఖ పేరు: హైదరాబాద్-శివం రోడ్ | |
| 236262001567 | [illegible] శ్రావణ్ కుమార్ |
| శాఖ పేరు: హైదరాబాద్-తిలక్ రోడ్ | |
| 453457000012 | నిఖిల్ ఎం. షా |
| శాఖ పేరు: హైదరాబాద్-[illegible] | |
| 041057000137 | బోయ రంగస్వామి |
| 041057000138 | బోయ రంగస్వామి |
| శాఖ పేరు: హైదరాబాద్-అల్వాల్ | |
| 111762002105 | మహేంద్రకుమార్ [illegible] |

| రుణ ఖాతా నం. | ఖాతాదారు పేరు |
|---|---|
| శాఖ పేరు: హైదరాబాద్-అమీర్‌పేట్ | |
| 111362004428 | జి. సంగీత |
| శాఖ పేరు: హైదరాబాద్-హస్తినాపూర్ | |
| 386657000067 | [illegible] రవి |
| శాఖ పేరు: హైదరాబాద్-[illegible] | |
| 111162003137 | కృష్ణ చైతన్య [illegible] |
| శాఖ పేరు: హైదరాబాద్-కావూరి హిల్స్ | |
| 112062003140 | గజ్జల భాస్కర్ రెడ్డి |
| 112057000182 | అవినాష్ [illegible] |
| శాఖ పేరు: హైదరాబాద్-[illegible] | |
| 037057000081 | [illegible] |
| శాఖ పేరు: హైదరాబాద్-సంతోష్ నగర్ | |
| 103557000056 | నిమ్మ రుత్విక్ రెడ్డి |
| 103557000063 | నిమ్మ రుత్విక్ రెడ్డి |
| శాఖ పేరు: హైదరాబాద్-శేరిలింగంపల్లి | |
| 131762003292 | ఆసిఫ్ పాషా సయ్యద్ |
| శాఖ పేరు: జగిత్యాల | |
| 280862004539 | బోయిని నితీష్ |
| 280862009205 | ఒడ్డాల తిరుపతి |
| శాఖ పేరు: జమ్మికుంట | |
| 412762004490 | కరుపాకల తిరుపతి |
| శాఖ పేరు: ఖమ్మం-గాంధీ చౌక్ | |
| 130862006282 | ధనియాకుల వాగేశ్వరరావు |
| శాఖ పేరు: [illegible] | |
| 222262000532 | గొల్ల అంజనేయులు |
| శాఖ పేరు: [illegible] | |
| 220662000456 | కొప్పుల రామకృష్ణ |
| 220657000021 | పొనుగంటి రాజేందర్ |
| శాఖ పేరు: కోరుట్ల | |
| 775557000071 | అకుల మల్లికార్జున్ |
| 775557000163 | ముక్కెర అనిరుధ్ |
| 775557000190 | ముక్కెర అనిరుధ్ |
| 775562000767 | [illegible] సుమన్ |
| శాఖ పేరు: లక్ష్మీ నగర్ | |
| 223162000802 | మంగలి అంజయ్య |
| 223162000715 | [illegible] |
| శాఖ పేరు: మాదాపూర్ | |
| 220762000531 | [illegible] శేఖర్ |
| 220762000817 | ముక్కెర సుమలత |
| 220762001109 | మామిడి రాజేందర్ |
| శాఖ పేరు: మహబూబ్‌నగర్ | |
| 068962032138 | చంద్రశేఖర్ గౌడ్ కాటం |
| శాఖ పేరు: మంచిర్యాల | |
| 061857000104 | [illegible] |
| శాఖ పేరు: మణికొండ, తెలంగాణ | |
| 322257000039 | మహ్మద్ ముబాషిర్ అహ్మద్ |
| 322257000189 | మహ్మద్ ముబాషిర్ అహ్మద్ |
| శాఖ పేరు: [illegible] | |
| 222162000175 | మధుసూదన్ రెడ్డి కె. |
| శాఖ పేరు: మెదక్ | |
| 069062020655 | శ్రీనివాస్ రెడ్డి |
| 069062021007 | లక్ష్మణ్ బానోత్ |
| 069062025376 | [illegible] |
| శాఖ పేరు: మేడ్చల్ | |
| 279862002197 | [illegible] |

| రుణ ఖాతా నం. | ఖాతాదారు పేరు |
|---|---|
| శాఖ పేరు: ముధోల్-ఆంధ్రప్రదేశ్ | |
| 204562006746 | [illegible] సుదర్శన్ |
| 204562003336 | [illegible] |
| 204562003796 | [illegible] లక్ష్మీబాయి |
| శాఖ పేరు: [illegible] | |
| 220962000909 | [illegible] లక్ష్మణ్ |
| శాఖ పేరు: నకిరేకల్ | |
| 380062002522 | [illegible] సైదులు |
| శాఖ పేరు: [illegible] | |
| 223262001041 | [illegible] కుమార్ |
| శాఖ పేరు: నర్సంపేట | |
| 092162038436 | రాజా ముత్యం |
| శాఖ పేరు: నస్పూర్-సీసీసీ క్రాస్‌రోడ్ | |
| 802862000069 | దురిశెట్టి సాయి ప్రశాంత్ |
| శాఖ పేరు: నిజామాబాద్ | |
| 653162007828 | షహనాజ్ బేగం |
| శాఖ పేరు: [illegible] | |
| 221062001082 | [illegible] |
| శాఖ పేరు: కుత్బుల్లాపూర్ | |
| 130457000055 | [illegible] |
| శాఖ పేరు: కుత్బుల్లాపూర్-[illegible] | |
| 180757000103 | [illegible] |
| శాఖ పేరు: రామచంద్రాపురం-మెదక్ | |
| 279562002107 | [illegible] జయదీప్ |
| శాఖ పేరు: [illegible] | |
| 223462000619 | [illegible] బాలరాజు |
| శాఖ పేరు: రామచంద్రాపురం | |
| 221562000699 | [illegible] |
| శాఖ పేరు: సిద్దిపేట | |
| 069162023247 | [illegible] కృష్ణాచారి |
| 069157000030 | సయ్యద్ ఖాజా అమీనుద్దీన్ |
| 069162021720 | సయ్యద్ ఖాజా అమీనుద్దీన్ |
| 069162023591 | సయ్యద్ ఖాజా అమీనుద్దీన్ |
| 069162023398 | సయ్యద్ ఖాజా అమీనుద్దీన్ |
| 069162023424 | [illegible] విజయలక్ష్మి |
| 069157000143 | అంబటి కిరణ్ |
| శాఖ పేరు: సిద్దిపేట-మెదక్ రోడ్ | |
| 753657000059 | మహ్మద్ జావిద్ పాషా |
| శాఖ పేరు: [illegible] | |
| 221162001212 | ఎం.డి.[illegible] |
| శాఖ పేరు: సిరిసిల్ల, తెలంగాణ | |
| 363262008586 | [illegible] |
| శాఖ పేరు: సూర్యాపేట్ | |
| 280762009566 | [illegible] యాదగిరి |
| శాఖ పేరు: తాండూర్ | |
| 379862008815 | మహ్మద్ గౌస్ |
| 379857000110 | [illegible] |
| శాఖ పేరు: వికారాబాద్ | |
| 395857000143 | శ్రీ సాయిదత్త ఏజెన్సీస్ |
| 395862003659 | సోమయ్య సోమయ్య |
| 395862003861 | ఎడిగె పురుషోత్తం |
| శాఖ పేరు: వనపర్తి | |
| 131162018138 | [illegible] సుదర్శన్ నాయుడు |
| శాఖ పేరు: జహీరాబాద్ | |
| 083662016834 | జి. [illegible] లక్ష్మి |
| శాఖ పేరు: బెంగళూర్ - హెబ్బాల్ | |
| 318062000310 | శశికళ వై. |
| శాఖ పేరు: కర్నూల్ | |
| 027962018620 | ఎస్. పెద్ద సంజీవ నాయుడు |

తేదీ : 10.12.2025
ప్రదేశం: హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, హన్మకొండ, పెద్దపల్లి, మెదక్, కరీంనగర్, జగిత్యాల, వరంగల్, జోగులాంబ (గద్వాల్), ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, రాజన్న (సిరిసిల్ల), సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ, సూర్యాపేట, భద్రాద్రి (కొత్తగూడెం), ఖమ్మం

సం/- అధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున


# మార్మోగిన పంబారట్టు వేడుక

- పూజలతో పులకించిన మాధన్నపేట చెరువు కట్ట
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు



అయ్యప్పస్వామిని రథం వద్దకు తీసుకువస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, భక్తులు



పంబారట్టు వేడుకలో పాల్గొన్న మాలధారులు, భక్తులు

నర్సంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట మాధన్నపేట చెరువులో మంగళవారం అయ్యప్ప పంబారట్టు(జలక్రీడ) ఆద్యంతం కన్నుల పండువగా జరిగింది. అంతకుముందు స్వామివారిని నర్సంపేట పట్టణం నుంచి మాధన్నపేట చెరువు వరకు ఊరేగించారు. మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. కేరళలోని శబరిమలై పుణ్యక్షేత్రం సమీపంలోని పంబానదిలో నిర్వహించే పంబారట్టు తరహాలోనే నర్సంపేటలోనూ ఉత్సవాన్ని జరిపించారు.

నర్సంపేటలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి - స్వప్న దంపతుల ఆధ్వర్యంలో 25వ మండల పూజా మహోత్సవంలో భాగంగా వారి కుమారుడు పెద్ది నిదర్శన్‌రెడ్డి, కూతురుచే కేరళకు చెందిన తాంత్రికవేత్త గురుస్వామి శంకరన్‌నంబూద్రి పూజా వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయసేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, ఆలయకమిటీ అధ్యక్షుడు పైసా సురేశ్ కమిటీ సభ్యుల నేతృత్వంలో తాంత్రికవేత్త, గురుస్వామి శంకరన్ నంబూద్రి వేద మంత్రోచ్చరణల నడుమ జల, పుష్ప తాంత్రిక పూజలను నిర్వహించారు. అనంతరం గర్భగుడిలోని అయ్యప్ప విగ్రహాన్ని నెత్తిన ఎత్తుకొని ఊరేగింపు ట్రాక్టర్‌లో పెట్టాక ట్రాకర్ నడిపి సుదర్శన్‌రెడ్డి ఊరేగింపును ప్రారంభించారు.

**అట్టహాసంగా శోభాయాత్ర**

అయ్యప్ప ఆలయం నుంచి స్వామి ఊరేగింపు అట్టహాసంగా మాధన్నపేట చెరువు వరకు కళాకారుల డప్పుచప్పుళ్ల, మహిళల కోలాటనృత్యాలు, డోలుకళాకారుల విన్యాసాలు, కళాకారిణిలు, మాలధారుల నృత్యాల నడుమ ఊరేగింపుగా సాగింది. పలువురు మాలధారులు అశ్వాలతో ఊరేగింపులో పాల్గొన్నారు.

అనంతరం మంగళవారం మధ్యాహ్నం అయ్యప్పపంబారట్టు(జల క్రీడ) ఉత్సవాన్ని, వైభవంగా నిర్వహించారు. చెరువు నీటిలో అయ్యప్ప విగ్రహానికి మాలాధారులతో కలిసి తాంత్రికవేత్త, గురుస్వామి శంకరన్‌నంబూద్రి, ఆలయ అర్చకులు దినేశ్‌మిశ్రాజలక్రీడ వేడుకను ఘనంగా నిర్వహించారు. అనంతరం చెరువు మెట్ల వద్ద ఏర్పాటు చేసిన వేదికపై అయ్యప్ప విగ్రహాన్ని ప్రతిష్ఠించి వేలాదిగా తరలివచ్చిన మాలాధారులు, భక్తుల సమక్షంలో గురుస్వామి వేదమంత్రోచ్చారణల నడుమ స్వామిని కొలుస్తూ పాలు, పెరుగు, నెయ్యి, బస్వం (విబూది), పంచదార, చందనం,పసుపు, పండ్లు, తేనె, జలంతో అభిషేక పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ అభిషేక పూజలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడి, పెద్దిస్వప్న దంపతులు పిల్లలతో కలిసి అభిషేక పూజలను తిలకించారు.

**మహాన్నదానం**

పంబారట్టు ఉత్సవం సందర్భంగా మాధన్నపేట చెరువు కట్టజాతరను తలపించింది. మాధన్నపేట చెరువులో పంబారట్టు వేడుకలను తిలకించడానికి మాలధారులు, భక్తులు తరలిరావడంతో చెరువుకట్ట సందడిగా మారింది. వేడుక అనంతరం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడి, ఏర్పాటు చేసిన పంబాసద్దిని (సహపంక్తిభోజనం) మాలధారులు, భక్తులు భుజించారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ శింగిరికొండ మాధవశంకర్, కమిటీ సభ్యులు మాదారపు చంద్రశేఖరం శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, ఇరుకు కోటేశ్వర్‌రావు, కొమాండ్ల భూపాల్‌రావు, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డరవీందర్ ఆలయకమిటీ సభ్యులతో పాటు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మాజీ మునిసిపల్ చైర్మెన్ నాగెల్లి వెంకటనారాయణగౌడ్, గోనె యువరాజ్ అప్పాల సుదర్శన్, రావుల సతీష్, నాగిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లికి పాదపూజ

వడ్డెపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పట్టణానికి చెందిన తుమ్మల సుశీలకు కుమారులు మంగళవారం ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ప్రైవేటు సమావేశ మందిరంలో పాద పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. తుమ్మల రమేష్, విజయ్, సతీష్‌తో పాటు కుమార్తెలు తల్లికి నూతన వస్త్రాలు అందించి పాదాలను కడిగారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు దీక్షిత్, ధీరజ్, సంసిద్ధు రాయ్, శణ్ముఖప్రియ, ఉత్తేజ్, లోహిత్‌కుమార్, సాద్వితతో పాటు కుమార్తెలు, కోడళ్లు పాల్గొన్నారు.



తల్లికి పాదపూజ చేస్తున్న కుమారులు, కుమార్తె ←

## బీసీలను మోసగించిన కాంగ్రెస్



ప్రెస్ క్లబ్‌లో చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ జేఏసీ నేతలు

వడ్డెపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం చేసిందని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ వి. వేణుగోపాల్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా 5,380 సర్పంచ్ స్థానాలు దక్కేవని, బీసీ రిజర్వేషన్లను 17 శాతానికి తగ్గించడం వలన కేవలం 2,300 సర్పంచ్ సీట్లు మాత్రమే దక్కాయన్నారు. రాష్ట్రంలోని జనరల్ స్థానాల్లో నిలబడిన బీసీ అభ్యర్థులను పార్టీలకతీతంగా సర్పంచ్‌లుగా గెలిపించి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 15, 16న పార్లమెంటును ముట్టడిస్తామని హెచ్చరించారు. సభకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో బీసీ జేఏసీ నేతలు దొడ్డపల్లి రఘుపతి, డాక్టర్ చిర్రరాజు, బొనగాని యాదగిరి గౌడ్, తమ్మల శోభారాణి, తేళ్ల సుగుణ, భీమగాని యాదగిరి, బక్కి అవినాష్, తేళ్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ అధికారులను సస్పెండ్ చేయాలి



రిజిస్ట్రార్ రామచంద్రానికి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

కేయూ క్యాంపస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేయూ న్యాయశాస్త్ర విభాగం విద్యార్థులకు అన్నం పెట్టకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌తో పాటు జేడీలను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నేతలు మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ.. విద్యార్థుల మధ్య గొడవలు పెడుతూ మెస్‌లో విద్యార్థుల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. విద్యార్థులకు భోజనం పెట్టడం లేదన్నారు. మెస్‌ను మూసివేసి విద్యార్థి వ్యతిరేక విధానాలను పాటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో న్యాయ విద్యార్థి రాకేశ్‌రెడ్డి, అరుణ్, సందీప్, స్టాలిన్,రంజిత్, రణధీర్, ప్రదీప్, రోహిత్, యోగేశ్, జితన్, సాత్విక్, ఆదిత్య, దుర్గేశ్, శివాజీ, శ్రీను, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

కేయూ క్యాంపస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేయూ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సివిల్ సప్లయ్ డిపార్టుమెంట్ కమిటీ సభ్యురాలు అనితారెడ్డి మంగళవారం పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి పౌష్టికాహారంపై ఆరా తీశారు. భీమారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పలు సూచనలు చేశారు. పిల్లలతో ఉత్సాహంగా గడిపారు.

## ఓటు చోరీపై సంతకాల సేకరణ



ఓటు చోరీపై ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కాజీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాజీపేట విష్ణుపురిలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఎమ్డీ రహ్మతుల్లా ఆధ్వర్యంలో ఓటు చోరీని వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ చేశారు. ప్రతిఒక్కరూ రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటు చోరీ పై పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. ఆ తర్వాత కాంగ్రెస్ నాయకురాలు సోనియా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్‌కట్‌చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ మహిళలు పాల్గొన్నారు.

## రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న నారాయణ, ప్రిన్సిపాల్ నిమ్మ సుదర్శన్

కేయూ క్యాంపస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మరొకరికి ప్రాణదానమని కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. మంగళవారం సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాలలో ప్రిన్సిపాల్ నిమ్మ సుదర్శన్ నేతృత్వంలో రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ నిమ్మ సుదర్శన్, డీన్ శ్రీనివాస్, అధ్యాపకుడు చల్లా శ్రీనివాస్, సుజాతలు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు పుల్లూరి అశోక్‌కుమార్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, లా కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, లా కళాశాల ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

వడ్డెపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ మాజీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లోని ఒయాసిస్ అనాథాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫిషర్‌మెన్ కాంగ్రెస్ స్టేట్ డైరెక్టర్ మండల సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపెల్లి విజయ్, తాళ్లపెల్లి రవీందర్ (జేకే), జనగాం శ్రీనివాస్‌గౌడ్, తాళ్లపెల్లి రాజ్‌కుమార్, నల్ల ఆశీర్వాదం, ఆశ్రమ నిర్వాహకులు ఒద్దిరాజు చంద్రప్రకాష్‌తో పాటు అనాథాశ్రమం పిల్లలు పాల్గొన్నారు.

● కాజీపేట: కాజీపేట చౌరస్తాలో మంగళవారం కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. 62, 63 డివిజన్‌ల కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీలు సోనియా చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు గోల్కొండ రాంబాబు, మేరుగు రాజయ్య, ఆరూరి సాంబయ్య, షేక్ అజ్గర్, సిరిల్ లారెన్స్, దొంగల కుమార్, ఇప్ప శ్రీకాంత్, ఎండీ షబ్బీర్, మంతుర్తి బొంద్యాల్ తదితరులు పాల్గొన్నారు.



వడ్డెపల్లిలోని అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు



కాజీపేటలో సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

● మడికొండ: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్కూరి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణగౌడ్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కట్కూరి రేవంత్, 45వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సట్ల సదానందం గౌడ్, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ కృష్ణ, కాంగ్రెస్ శ్రేణులు మంద రాము, నర్మెట వేణుగోపాల్ గౌడ్, ఆకారపు శివాజీ, బస్కె రవి, పైడిపాల శ్రీనివాస్, దామెరుప్పుల కోటేశ్వర్, అబ్దుల్ సమద్ తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు, పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకల్లో వరంగల్ ఎంపీ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోనియాగాంధీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



కడిపికొండలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద

వరంగల్ మెడికల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులు, ఐడీఓసీ పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, ఎన్‌పీడీసీఎల్, ఆర్‌అండ్‌బీ, సంబంధిత శాఖల అధికారులతో కలిసి వరంగల్ కలెక్టరేట్ నిర్మాణం, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల పురోగతిని క్షేత్రస్థాయి పరిశీలించారు. జీబ్ల్యూఎంసీ పరిధిలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో కొనసాగుతున్న నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయి కలియ తిరుగుతూ పరిశీలించారు. ఆటోనగర్ వైపు కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని, పనుల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, అధికారులు



వడ్డెపల్లి చెరువు కట్ట వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న టీఎంకేఎంకేఎస్ నాయకులు

## వడ్డెపల్లి చెరువును కాలుష్యం నుంచి కాపాడాలి

### టీఎంకేఎంకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. వెంకట్

వడ్డెపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ శివారులోని వడ్డెపల్లి చెరువును కాలుష్యం, కబ్జాల నుంచి కాపాడాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం (టీఎంకేఎంకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ అన్నారు. మంగళవారం వడ్డెపల్లి చెరువును టీఎంకేఎంకేఎస్ బృందంతో పాటు వడ్డెపల్లి మత్స్యపారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ మట్టెపల్లి నటరాజ్ ఆధ్వర్యంలో సందర్శించారు. అనంతరం చెరువు కట్టపై నిర్వహించిన సమావేశంలో గొడుగు వెంకట్ మాట్లాడుతూ చెరువులో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలన్నారు. ఉచిత చేపపిల్లలకు బదులు నేరుగా సొసైటీ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలు, కోళ్ల వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ అధికారులను కోరారు. చెరువును శాటిలైట్ ద్వారా సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లు ఏర్పాటు చేసి భూకబ్జాదారుల నుంచి చెరువును పరిరక్షించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో టీఎంకేఎంకేఎస్ జిల్లా ప్రతినిధులు నిమ్మల విజేందర్, జునగిరి దుర్గయ్యతోపాటు వడ్డెపల్లి మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు రమేష్‌బాబు, అరుణ్, రమేష్, రజిత తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ వర్సిటీలో కొండచిలువ

వరంగల్ మెడికల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో మంగళవారం కొండచిలువ సంచారం కలకలం సృష్టించింది. కాళోజీ వర్సిటీ ప్రధాన గోడను ఆనుకొని ఉ న్న ఆటోనగర్ ముళ్లపొదల్లో నుంచి కొండచిలువ ప్రవేశించినట్లు తెలుస్తోం ది. ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉద్యోగులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశా రు. విశ్వవిద్యాలయ అధికారులు అటవీశాఖకు సమాచారం అందించారు.

## పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కేయూ క్యాంపస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు మంగళవారం రీజినల్ పెన్షన్ ఆఫీసులో అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నేతలు స్టాలిన్, రంజిత్ కుమార్, జ్యోతి, అనూషలు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని అనేక ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలనుకల్పించడం లేదన్నారు. కార్మిక చట్టాలను పాటించకుండా భద్రతను గాలికి వదిలివేస్తున్నాయని అన్నారు. కనీస వేతనలు అమలు చేయడం లేదన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై చట్టం మేరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వినయ్, లావణ్య, వంశీ, ముష్రార్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



పీఎఫ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

## వీళ్లు స్లీపింగ్.. వాళ్లు జంపింగ్

### పోలీసుల నిర్లక్ష్యంతోనే ముగ్గురు నిందితుల పరారీ

### చెన్నైలో ఒకరు దొరికినట్లు సమాచారం

వరంగల్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పోలీస్‌స్టేషన్ నుంచి ముగ్గురు నిందితులు సోమవారం తెల్లవారుజామున పారిపోవడానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని తేటతెల్లమైంది. పోలీసు కస్టడీలో ఉన్న నిందితులకు కాపలాగా ఉన్న క్యూఆర్‌టీ విభాగానికి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లతోపాటు సెంట్రీ డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్, హోంగార్డు గాఢనిద్రలో ఉండటంతో ఇదే అదునుగా భావించిన ముగ్గురు నిందితులు పోలీస్‌స్టేషన్ నుంచి పరారీ అయినట్లుగా తెలుస్తోంది. గంజాయి నుంచి తీసే హాశీస్ ఆయిల్ కోసం వచ్చిన నలుగురు నిందితులను ఆదివారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. అనంతరం సోమవారం తెల్లవారుజామున సుమారు 5.30ప్రాంతంలో పారిపోయేందుకు పోలీస్‌స్టేషన్‌లోని కంప్యూటర్స్ రూమ్‌కు పార్కింగ్ వైపు ఉన్న డోర్‌ను తీసి బయటికి వచ్చారు. పోలీస్‌స్టేషన్ వెనుక వైపు జలేశ్వరాలయం వైపు ఉన్న గోడను ముగ్గురు దూకారు. ఇంకొంకరు దూకుతున్న సమయంలో పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే స్వీపరు గమనించి అరిచాడు. దీంతో ఒక నిందితుడు దూకకుండా పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఉండిపోయాడు. వెంటనే సెంట్రీ డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. ఇంతలోనే గోడ దూకిన ముగ్గురు నిందితులు స్టేషన్ పక్కకే ఉన్న పిల్లల ఆస్పత్రి గల్లీలోని ఓ వృద్ధుడి దగ్గర ద్విచక్రవాహనం గుంజుకొని పారిపోయారు. సీసీ పుటేజీల ఆధారంగా ప్రత్యేక బృందాలు గాలించగా హైదరాబాద్ ఉప్పల్‌లో ద్విచక్ర వాహనం లభ్యమైనట్లు తెలిసింది. కాగా, ఒక పోలీసు బృందం ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకోగా, చైన్నై వెళ్లిన మరో బృందానికి ముగ్గురిలో ఒక నిందితుడు పట్టుబడ్డట్లుగా సమాచారం.

## నోటికి తాళం.. నోట్లతో గాలం

(5వ పేజీ తరువాయి)

చేసుకునేందుకు ప్రయత్నాలు చేశారు. యువ ఓటర్లను కూడా వదిలిపెట్టలేదు. ప్రచారంలో మందు, విందులకు కొదువలేకుండా పోయింది. ప్రచారానికి పెద్ద మొత్తం డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేసినట్టు తెలుస్తోంది.

కాగా, ఈ ఎన్నికలు పార్టీ గుర్తులతో జరగకపోయినా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నేతలు కూడా ప్రచారరంగంలో దగారు. తమ పార్టీలు మద్దతు ఇస్తున్న అభ్యర్థుల గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం సాగించారు. ఈ మూడు మండలాల్లో పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే నెలకొన్నది. బీఆర్ఎస్ పక్షాన హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బీఆర్ఎస్ మద్దతు ఇస్తున్న అభ్యర్థుల పక్షాన ఎన్నికల ప్రచారం సాగించారు. మల్కాజీగిరి బీజీపీ ఎంపీ ఈటల రాజేందర్ కూడా పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం తమ పార్టీ అభ్యర్థుల కోసం పరోక్షంగా ప్రచారం సాగించారు.

### తెరుచుకుంటున్న మూటలు

ఎన్నికల ప్రచారం ముగియడంతో మాటలు బంద్ అయి మూటలు తెరుచుకుంటున్నాయి. పోలింగ్‌కు ఇక ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉండడంతో ఈ లోపే వీలైనంత ఎక్కువమంది ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు చివరి అస్త్రాలను సంధిస్తున్నారు. తాయిలాల పంపిణీకి రంగం సిద్ధం చేసుకున్నారు. ఒక్కో ఓటుకు రూ.1000 అంతకన్నా ఎక్కువ కూడా ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. దీనికితోడు మద్యం పంపిణీ సైతం కట్టలు తెంచుకోనున్నట్టు తెలుస్తోంది. ఓటర్ల మనసును గెలుచుకునేందుకు అభ్యర్థులు తమదైన వ్యూహాలను అమలు చేస్తున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీలో అక్కడి రాజకీయ పరిస్థితులను బట్టి అభ్యర్థులు ఒక్కో వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల గెలుపు కోసం ఎత్తులతో పాటు పొత్తులను కూడా పెట్టుకున్నారు. కొన్ని చోట్ల బీఆర్ఎస్, బీజేపీ, మరికొన్ని చోట్ల కాంగ్రెస్, బీజేపీ, ఇంకొన్ని చోట్ల కాంగ్రెస్ వామపక్షాలు పరస్పర అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.

### నేడు పోలింగ్ మెటీరియల్ పంపిణీ

ఎన్నికల సిబ్బందికి బుధవారం పోలింగ్ మెటీరియల్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయా మండల కేంద్రాల్లో ఉదయం నుంచే బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయనున్నారు. పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ ఇప్పటికే పూర్తయింది. మొదటి విడత పోలింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది ర్యాండమైజేషన్ సైతం పూర్తిచేశారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్న సిబ్బంది అదే రోజు రాత్రి తమకు కేటాయించిన గ్రామ పంచాయతీకి బయలుదేరి వెళతారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అదేరోజు ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల పరిశీలకుడు, కలెక్టర్ ప్రిసైడింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ నిర్వహణకు 658 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### భారీ భద్రత

మొదటి విడత పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, పగడ్బందీగా నిర్వహించేందుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద తగినంత పోలీసు సిబ్బందిని నియమిస్తున్నారు. తొలి విడత ఎన్నికల ప్రచారం ముగియగానే మంగళవారం సాయంత్రం నుంచి మద్యం దుకాణాలు బంద్ అయ్యాయి. ఈనెల 11న ఉదయం 2 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్, ఆ తర్వాత ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి తర్వాత సాయంత్రం 6 గంటల తర్వాత తిరిగి మద్యం షాపులను తెరుస్తారు.


ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్నయెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : హన్మకొండ
Hanamkonda ACO - 9985410935,
Hasanparthy SR - 8519926489,
Hanamkonda - 9704361601
Parkal SR- 7396327489,
Kazipet SR - 8247285199, ACM - 9985411664


## రోగులకు సేవలందించడంలో వైద్య సిబ్బంది పాత్ర కీలకం

వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారి అప్పయ్య

హసన్‌పర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోగులకు సేవలందించడంలో వైద్య సిబ్బంది పాత్ర కీలకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య అన్నారు. మండలంలోని సిద్ధాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లినిక్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 9 ఆరోగ్య మహిళా క్లినిక్‌ల ద్వారా రెఫర చేసిన మహిళలకు సంబంధిత సిబ్బంది తగిన విధంగా పర్యవేక్షణ చేసి సేవలు అందించాలన్నారు. ఈ యేడు ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 13,315 మంది మహిళలను పరీక్షించి అవసరమైన వారికి తగిన చికిత్సలు అందించామన్నారు. వీరిలో ఉన్నత సేవల కోసం 779 మందిని రెఫర్ చేశామన్నారు. అందులో 646 మంది వెళ్లగా మిగిలిన వారి వివరాలను సేకరించి త్వరలో వారికి కూడా మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ యేడు 9 ఆరోగ్య మహిళా క్లినిక్‌లలో 2413 మంది మహిళలకు 17058 రకాల ఇన్వెస్టిగేషన్స్ నిర్వహించామన్నారు.

అనంతరం పీహెచ్‌సీలో నిర్వహించిన మహిళా క్లినిక్ రిపోర్టును ఆయన పరిశీలించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రతీ మంగళవారం నిర్వహించిన 32 మహిళా ఆరోగ్య క్లినిక్‌లలో 1602 మంది మహిళలను స్క్రీనింగ్ చేసి అవసరమైన వారికి చికిత్స అందించి 52 మందిని మెరుగైన చికిత్స, ఇతర పరీక్షల నిమిత్తం రెఫర్ చేశామని తెలిపారు. వీరిలో ముగ్గురు మహిళలకు డీఎంహెచ్‌ఓ ఫోన్ చేసి ఎందుకు వెళ్లలేదని ఆరా తీయగా వీలుకాలేదని తెలిపారు. ఏఎన్ఎం, ఆశలు వారి వద్దకు వెళ్లి ఎందుకు సేవలు అందించలేదని ప్రశ్నించారు. వారి సమాధానాలకు సంతృప్తి చెందని డీఎంహెచ్‌వో సిబ్బందిని మందలించి ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ క్లినిక్‌లో డాక్టర్లు భజన్‌లాల్, రవళిలు పాల్గొన్నారు.



ఆస్పత్రికి వచ్చిన వారితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

manepally Jewellers Pvt. Ltd. trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP Ph: 99120 10888



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,30,090 | 1,19,250 ▼ | 1,99,000 ▲ |
| విజయవాడ | 1,32,000 ▲ | 1,23,000 ▲ | 1,84,700 ▲ |
| విశాఖపట్నం | 1,32,120 ▼ | 1,19,550 ▲ | 1,99,000 ▲ |
| రాజమండ్రి | 1,29,440 ▼ | 1,18,650 ▼ | 1,84,000 ▲ |
| ప్రొద్దుటూరు | 1,27,300 ▼ | 1,17,120 ▼ | 1,76,000 ▼ |
| ముంబై | 1,27,970 ▼ | 1,17,220 ▼ | 1,78,890 ▼ |

# ఏటా రూ.1.80 లక్షల కోట్ల ఐపీఓలు

## ఈ ఏడాది రూ.2.07 లక్షల కోట్ల సమీకరణ ● జేపీ మోర్గాన్ నివేదిక




ముంబై: భారత్‌లో ఏటా ఐపీఓల ద్వారా 2,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.80 లక్షల కోట్లు) సమీకరణ సాధారణంగా మారిందని అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం జేపీ మోర్గాన్ తాజా నివేదిక పేర్కొంది. మరి కొన్నేళ్లపాటు వార్షిక ఐపీఓల నిధుల సమీకరణకు ఇది ప్రామాణిక స్థాయి కానుందని ఈ సంస్థలో ఈక్విటీ మార్కెట్స్ అధిపతి అభినవ్ భారతి మంగళవారం అన్నారు. ఈ ఏడాదిలో కంపెనీల ఆఫరింగ్‌ల విలువ ఇప్పటికే 2,100 కోట్ల డాలర్లకు (సుమారు రూ.1.89 లక్షల కోట్లు) చేరిందని, ఇది గత ఏడాది సాధించిన స్థాయని సంస్థ ఆ నివేదికలో ప్రస్తావించింది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ రూ.10,000 కోట్ల భారీ ఆఫరింగ్ ఈ నెలలోనే పూర్తి కానుంది. వచ్చే 2-3 వారాల్లో మరిన్ని బడా కంపెనీలు ఆఫరింగ్‌కు రానున్నాయి. కాబట్టి, 2025 చివరినాటికి ఐపీఓల మొత్తం విలువ 2,300 కోట్ల డాలర్లకు (రూ.2.07 లక్షల కోట్లు) చేరుకోవచ్చని జేపీ మోర్గాన్ నివేదిక అంచనా వేసింది. అభినవ్ భారతి ఇంకా ఏమన్నారంటే..

- ఐపీఓకు వస్తున్న కంపెనీల్లో దాదాపు 20 శాతం కన్స్యూమర్ టెక్నాలజీ, ఆధునిక వ్యాపార కంపెనీలే. వచ్చే ఐదేళ్లలో ఈ వాటా 30 శాతానికి మించవచ్చు.
- ప్రస్తుతం మార్కెట్లో వేల కోట్ల విలువ చేస్తున్న కనీసం 20 స్టార్టప్‌లు సమీప భవిష్యత్‌లో ఐపీఓకు వచ్చేందుకు సన్నద్ధమవుతున్నాయి.
- 4-5 కంపెనీలు ఐపీఓ ద్వారా 100 కోట్ల డాలర్లకు (రూ.9,000 కోట్లు) పైగా నిధుల సమీకరణకు సిద్ధమవుతున్నాయి. ఈ కంపెనీలన్నీ కలిసి మార్కెట్ నుంచి 800 కోట్ల డాలర్ల వరకు నిధులను సమీకరించే అవకాశాలున్నాయి.

### ఐదు ఇష్యూలకు సెబీ ఆమోదం

సప్లై చెయిన్ అసెట్ పూలింగ్ కంపెనీ లీప్ ఇండియా, ఎల్డోరాడో అగ్రిటెక్ సహా ఐదు కంపెనీల ఐపీఓ ప్రతిపాదనలకు సెబీ ఆమోదం తెలిపింది. మోల్బియో డయాగ్నోస్టిక్స్, క్యాటరింగ్/ఫుడ్ రిటైలింగ్ చెయిన్ కంపెనీ ఫుడ్‌లింక్ ఎఫ్ అండ్ బీ హోల్డింగ్స్, వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ సొల్యూషన్స్ కంపెనీ టెక్నోక్రాఫ్ట్ వెంచర్స్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. కాగా, ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ, స్కై అల్లాయ్స్ అండ్ పవర్ కంపెనీలు ఐపీఓ పత్రాలను ఉపసంహరించుకున్నాయి.

- పరిశ్రమలకు ఆవిరి, గ్యాస్ సరఫరా చేసే స్టీమ్‌హౌస్ ఇండియా సెబీకి సవీకరించిన ఐపీఓ ముసాయిదా పత్రాలను సమర్పించింది. ఇష్యూ ద్వారా కంపెనీ రూ.425 కోట్లు సమీకరించాలనుకుంటోంది.
- సిటియస్ ట్రాన్స్‌నెట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ ఐపీఓ ద్వారా రూ.1,340 కోట్ల వరకు నిధుల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది.

## ఫోర్బ్స్ అండర్ -30లో ఆర్కిన్ గుప్తా



న్యూఢిల్లీ: ఆర్థిక ఆవిష్కరణల్లో 30 ఏళ్లలోపు విజయ సాధకులకు సంబంధించి ఫోర్బ్స్ విడుదల చేసిన వార్షిక జాబితాలో భారత్‌కు చెందిన ఆర్కిన్ గుప్తాకు స్థానం లభించింది. డేటా ఆధారిత పెట్టుబడి ఫ్రేమ్‌వర్క్‌ల అభివృద్ధిలో తన కృషితోపాటు ఆర్థిక ఉత్పత్తుల సృష్టిలో నాయకత్వ పాత్ర పోషించినందుకుగాను గుప్తాను ఈ జాబితాకు ఎంపిక చేసినట్లు ఫోర్బ్స్ పేర్కొంది. పలు ఫైనాన్షియల్ టెక్నాలజీ (ఫిన్‌టెక్) కంపెనీలతో కలిసి పనిచేస్తున్న గుప్తా.. తనకు దక్కిన ఈ గుర్తింపు ఆర్థిక సేవల రంగ నిర్ణయాల్లో సాంకేతికత, అనలిటిక్స్‌కు పెరుగుతున్న ప్రాముఖ్యతను నిదర్శనమని అన్నారు.

## శాలరీ సే భాగస్వామ్యంలో సీయూబీ రుపే క్రెడిట్ కార్డు

హైదరాబాద్: ప్రైవేటు రంగంలోని సిటీ యూనియన్ బ్యాంకు వేతన ఆధారిత ఆర్థిక సంక్షేమ వేదిక శాలరీ సే భాగస్వామ్యంలో లెవెల్ అప్ రుపే క్రెడిట్ కార్డును విడుదల చేసింది. ప్రత్యేకంగా వేతనజీవులను ఉద్దేశించి దేశంలో జారీ అయిన తొలి క్రెడిట్ కార్డు ఇదే. ఉద్యోగాల్లోని వృత్తి నిపుణుల వ్యయ ధోరణుల ఆధారంగా వారికి రివార్డులు అందచేస్తారు. రోజువారీ యూపీఐ చెల్లింపులు, ఆన్‌లైన్ లావాదేవీలు, నెలవారీ నిత్యావసర బిల్లులు, ఇన్-స్టోర్ కొనుగోళ్ల రివార్డుల మదింపునకు పరిగణనలోకి వస్తాయి.

## కార్వీ ఇన్వెస్టర్ల క్లెయిమ్‌లకు వచ్చే మార్చి 31 వరకు గడువు

హైదరాబాద్‌కు చెందిన దివాలా బ్రోకింగ్ కంపెనీ కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) ఇన్వెస్టర్లు తమకు సంస్థ నుంచి రావాల్సిన బకాయిలను క్లెయిమ్ చేసుకునేందుకు గడువును వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు సెబీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం గతంలో నిర్దేశించిన గడువు ఈ నెల 31తో ముగియనుంది. కార్వీ బ్రోకింగ్ 95,000 మంది క్లయింట్లకు చెందిన రూ.2,300 కోట్ల విలువైన షేర్లను సొంత అవసరాలకు తాకట్టు పెట్టుకున్న కుంభకోణం 2019లో వెలుగు చూసింది. 2020 నవంబరు 23న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కేఎస్‌బీఎల్‌ను డిఫాల్టర్‌గా ప్రకటించింది.

## రెండో రోజూ నష్టాల్లోనే..

● సెన్సెక్స్ 436 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. మంగళవారం ట్రేడింగ్ తొలి గంటలో 720 పాయింట్ల వరకు క్షీణించిన సెన్సెక్స్.. మళ్లీ కాస్త కోలుకుని 436.41 పాయింట్ల నష్టంతో దాదాపు రెండు వారాల కనిష్ఠ స్థాయి 84,666.28 వద్ద ముగిసింది. నిఫ్టీ 120.90 పాయింట్లు కోల్పోయి 25,839.65 వద్దకు జారుకుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లపై నిర్ణయాన్ని బుధవారం ప్రకటించనున్న నేపథ్యంలో అప్రమత్తమైన ఈక్విటీ మదుపరులు ప్రైవేట్ బ్యాంకింగ్, ఆయిల్, ఐటీ రంగ షేర్లలో లాభాల స్వీకరణకు దిగడం ఇందుకు కారణం.

- డాలర్‌తో రూపాయి మారకం విలువ 18 పైసలు పెరిగి రూ.89.87 వద్ద ముగిసింది.
- ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర రూ.4,500 తగ్గుదలతో రూ.1,80,500కు దిగివచ్చింది.

## నేడే నెఫ్రోప్లస్ ఐపీఓ

డయాలసిస్ సేవల రంగంలోని నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ మంగళవారం యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.260 కోట్లు సేకరించింది. ఈ కంపెనీ తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) బుధవారం మార్కెట్లోకి రానుంది. ఎస్‌బీఐ ఎంఎఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ సహా 14 కంపెనీలకు ఒక్కోటి రూ.460 ధరకు 56.58 లక్షల షేర్లను కేటాయించినట్టు బీఎస్ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన సర్క్యులర్ తెలిపింది. రూ.871 కోట్ల పరిమాణం గల ఈ ఐపీఓ శుక్రవారంతో ముగుస్తుంది. షేరు ధర శ్రేణిని కంపెనీ రూ.438-460గా నిర్ణయించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 10వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 651 | విజయవాడ | 670 |
| వరంగల్ | 653 | గోదావరి | 650 |
| చిత్తూరు | 663 | విశాఖపట్నం | 640 |
| | | డజను గుడ్లు రూ. | 90 |

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 129 | విజయవాడ | 130 |
| వరంగల్ | 129 | గుంటూరు | 135 |
| కరీంనగర్ | 129 | ఒంగోలు | 135 |
| మహబూబ్‌నగర్ | 129 | చిత్తూరు | 127 |
| కర్నూలు | 129 | నెల్లూరు | 132 |
| విశాఖపట్నం | 126 | అనంతపురం | 132 |
| గోదావరి | 130 | | |

## రెపో కోత ప్రయోజనం కస్టమర్లకు అందించండి

### బ్యాంకర్లతో ఆర్‌బీఐ గవర్నర్



ముంబై: దేశంలో వృద్ధికి ఉత్తేజం కల్పించడం కోసం రెపో రేటు కోత ప్రయోజనాన్ని కస్టమర్లకు అందించాలని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బ్యాంకులకు సూచించారు. మంగళవారం ఆయన ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకుల ఎండీ, సీఈఓలతో సమావేశమైన సందర్భంగా ఈ విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పలు విడతల్లో రెపోరేటును ఆర్‌బీఐ 1.25% మేరకు తగ్గించింది. దాంతో ప్రస్తుతం రెపోరేటు 5.25 శాతానికి దిగి వచ్చింది. ఈ ఏడాది దేశంలో బ్యాంకింగ్ రంగ స్వస్థత, కార్యకలాపాలు నిలకడగా మెరుగయ్యాయని అన్నారు. అయినప్పటికీ అవి నిర్లక్ష్య వైఖరి వీడి ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపు ఇచ్చారు. రెపో కోతతో పాటు టెక్నాలజీని విస్తృతంగా వినియోగించడం ద్వారా మధ్యంతర వ్యయాలను తగ్గించి సామర్థ్యాలు పెంచుకోవడం, సుస్థిర వృద్ధికి మద్దతు ఇవ్వడం సాధ్యపడుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే బ్యాంకులు కస్టమర్ సేవలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలంటూ ఫిర్యాదులను తగ్గించి అంతర్గత వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవడంపై దృష్టి సారించాలని మల్హోత్రా సూచించారు.

## 2035కి ఎంఎఫ్ ఆస్తులు రూ.300 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: రాబోయే దశాబ్ది కాలంలో మ్యూచువల్ ఫండ్ పరిశ్రమకు అద్భుతమైన వృద్ధి సాధించనుంది. 2035 ఆర్థిక సంవత్సరం నాటికి ఎంఎఫ్ సంస్థల నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎమ్) రూ.300 లక్షల కోట్లు దాటవచ్చునని కన్సల్టింగ్ సంస్థ బెయిన్ అండ్ కంపెనీ, ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ గ్రో సంయుక్త నివేదికలో వెల్లడించాయి. ఇందులో ఈక్విటీ హోల్డింగ్స్ విలువ ఒక్కటే రూ. 250 లక్షల కోట్లకు చేరుకోవచ్చని ఆ నివేదికలో స్పష్టం చేశారు. పెరుగుతున్న రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం, వేగంగా డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ, పారదర్శకమైన నియంత్రణలు ఈ భారీ వృద్ధికి దోహదపడనున్నట్లు 'హౌ ఇండియా ఇన్వెస్ట్' పేరు తో విడుదల చేసిన ఆ నివేదికలో తెలిపారు. డెరివేటివ్ మార్కెట్‌లో స్పెక్యులేషన్‌ను తగ్గించేందుకు సెబీ తీసుకున్న కఠిన చర్యలతో రిటైల్ పెట్టుబడుదారులు స్థిరమైన ఈక్విటీలవైపు మళ్లుతున్నారని పేర్కొన్నారు. రాబోయే సంవత్సరాల్లో డిజిటల్ అవగాహనతో 9కోట్ల కొత్త రిటైల్ ఇన్వెస్టర్లు మార్కెట్లోకి అడుగుపెట్టనున్నారని, ఈ పెట్టుబడుల్లో చిన్న మొత్తాలే ప్రధానంగా ఉండొచ్చని అంచనా.

## ఆశాజనకంగా కొలువుల మార్కెట్

● క్యూ1లో 52 శాతం పెరిగే అవకాశం

న్యూఢిల్లీ: జీడీపీ జోరు ప్రభావం దేశంలో కొలువుల మార్కెట్‌పై కనిపిస్తోంది. వచ్చే ఏడాది జనవరి-మార్చి మధ్య కంపెనీలు పెద్ద ఎత్తున నియామకాలకు సిద్ధమవుతున్నాయి. దీంతో ఈ డిసెంబరుతో ముగిసే త్రైమాసికంలో 27 శాతంగా ఉండే నికర నియామకాలు మార్చి చివరికి 52 శాతానికి చేరనున్నట్టు మాన్‌పవర్ గ్రూప్ ఎంప్లాయ్‌మెంట్ ఔట్‌లుక్ నివేదికలో తెలిపింది. ఈ ఏడాది తొలి త్రైమాసికంతో పోల్చినా ఇది 30% ఎక్కువ. ఈ నివేదిక ప్రకారం వచ్చే మూడు నెలల్లో బ్రెజిల్ (54%) తర్వాత మన దేశంలోనే అత్యధిక నికర నియామకాలు పెరగనున్నాయి.

### నివేదిక ఇతర ప్రధాన అంశాలు

- అంచనాలకు మించి పెరుగుతున్న భారత జీడీపీ వృద్ధిరేటు.
- చక్కటి వర్షాలతో పుంజుకున్న గ్రామీణ డిమాండ్.
- తగ్గిన ముడి చమురు ధరలతో అదుపులోకి వచ్చిన ద్రవ్యోల్బణం.
- పోటీ మార్కెట్‌లో నెగ్గేందుకు వీలుగా నైపుణ్యాలు, టెక్నాలజీలపై పెట్టుబడులు పెంచుతున్న కంపెనీలు.
- ఫైనాన్స్, బీమా రంగాల్లో అత్యధిక (61%) నికర నియామకాలు.
- నియామకాలకు దోహదం చేయనున్న కంపెనీల విస్తరణ, టెక్ అడ్వాన్స్‌మెంట్‌లు.
- నైపుణ్యాలున్న అభ్యర్థులకు కొలువులే కొలువులు.

# వచ్చాడు.. గెలిపించాడు!

## హార్దిక్ ఆల్‌రౌండ్ షో

### సఫారీలు 74 రన్స్‌కే ఆలౌట్

### తొలి టీ20లో భారత్ ఘన విజయం

కటక్: టీ20 ప్రపంచకప్ సన్నాహకాలను డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు ఘనంగా ఆరంభించింది. గాయంతో సుదీర్ఘ బ్రేక్ తర్వాత బరిలోకి దిగిన హార్దిక్ పాండ్యా (28 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 59 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో చెలరేగగా.. ఆ తర్వాత బౌలర్లు మూకుమ్మడిగా దక్షిణాఫ్రికాపై విరుచుకుపడ్డారు. దీంతో మంగళవారం జరిగిన ఈ తొలి టీ20లో సూర్య సేన 101 పరుగులతో భారీ విజయం అందుకుంది. తద్వారా ఐదు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 175 పరుగులు చేసింది. తిలక్ (26), అక్షర్ (23) పర్వాలేదనిపించారు. పేసర్లు ఎన్‌గిడికి 3, సిపమ్లాకు 2 వికెట్లు లభించాయి. ఛేదనలో సౌతాఫ్రికా 12.3 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. బ్రెవిస్ (22) టాప్ స్కోరర్. అర్ష్‌దీప్, బుమ్రా, వరుణ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హార్దిక్ పాండ్యా నిలిచాడు.

**వికెట్ల జాతర:** లక్ష్య ఛేదనలో సఫారీలు తొలి ఓవర్ నుంచే తడబడ్డారు. భారత బౌలర్ల సమష్టి ప్రదర్శన ముందు నిలవలేకపోయారు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోగా.. బ్రెవిస్ ఒక్కడే కాస్త పర్వాలేదనిపించాడు. భారత్ తరఫున బౌలింగ్‌కు దిగిన ఆరుగురు కూడా వికెట్లు తీశారు. 50 పరుగులకే సగం జట్టు పెవిలియన్‌కు చేరడంతో దక్షిణాఫ్రికా మరిక కోలుకోలేకపోయింది. పేసర్ అర్ష్‌దీప్ ఇన్నింగ్స్ రెండో బంతికే డికాక్ (0) వికెట్ తీయగా, పవర్‌ప్లేలో స్టబ్స్ (14), మార్‌క్రమ్ (14) కూడా వెనుదిరిగారు. ఈ దశలో బ్రెవిస్‌తో పాటు యాన్సెన్ (12) ఎదురుదాడికి దిగే ప్రయత్నం చేసినా అప్పటికే మ్యాచ్ చేజారింది. కేవలం ఆరు పరుగుల వ్యవధిలోనే చివరి ఐదు వికెట్లు కోల్పోయిన సౌతాఫ్రికా కనీసం వంద పరుగులైనా చేయలేక ఆటను ముగించింది.

**హార్దిక్ అదుర్స్:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌లో హార్దిక్ ధనాధన్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. మ్యాచ్ ప్రాక్టీస్ పెద్దగా లేకపోయినా అదిరే స్ట్రోక్‌ప్లేతో సఫారీ బౌలర్లను సునాయాసంగా ఆడేశాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా తను మాత్రం ఎడాపెడా బౌండరీలతో ఆఖరి ఆరు ఓవర్లలో 71 పరుగులు అందించి భారీ స్కోరుకు తోడ్పడ్డాడు. పేసర్ ఎన్‌గిడి తొలి ఓవర్‌లో ఓపెనర్ గిల్ (4), మూడో ఓవర్‌లో కెప్టెన్ సూర్య (11)ను అవుట్ చేయగా 17 రన్స్‌కే జట్టు రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో మరో ఓపెనర్ అభిషేక్ (17)-తిలక్ జోడీ మూడో వికెట్‌కు 31 పరుగులు జోడించింది. భారీ షాట్లు ఆడలేకపోయిన అభిషేక్ ఏడో ఓవర్‌లో వెనుదిరిగాడు. అయితే క్రీజులో ఇద్దరు ఎడమచేతి బ్యాటర్లను ఉంచాలనే లక్ష్యంతో హార్దిక్‌కన్నా ముందు అక్షర్‌ను పంపినా తను వేగం చూపలేదు. నిదానంగా ఆడిన తిలక్‌ను 12వ ఓవర్‌లో ఎన్‌గిడి అవుట్ చేశాడు. అప్పటికి స్కోరు 78/4. ఈ పరిస్థితిలో 150 కూడా కష్టమే అనిపించినా హార్దిక్ రాకతో సీన్ మారింది. తానెదుర్కొన్న తొలి నాలుగు బంతుల్లోనే రెండు సిక్సర్లు బాది స్టేడియంలో జోష్ నింపాడు. అక్షర్ 14వ ఓవర్‌లో వెనుదిరగ్గా, అటు పాండ్యా మాత్రం ధాటిని ఆపలేదు. నోకియా ఓవర్‌లో రెండు ఫోర్లు బాదగా, అటు దూబే (11) సైతం ఎన్‌గిడి ఓవర్‌లో మరో రెండు ఫోర్లతో సహకరించాడు. ఐదో వికెట్‌కు వీరి మధ్య 33 పరుగులు జత చేరాయి. 19వ ఓవర్‌లో హార్దిక్ 6,4.. జితేశ్ (10 నాటౌట్) 6తో 18 రన్స్ వచ్చాయి. ఇక ఆఖరి ఓవర్‌లో 6,4తో హార్దిక్ 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసి స్కోరును 170 దాటించాడు.

**1** మూడు ఫార్మాట్లలోనూ వంద వికెట్లు పూర్తి చేసిన ఏకైక భారత బౌలర్‌గా బుమ్రా. ఓవరాల్‌గా ఐదో బౌలర్. అలాగే అర్ష్‌దీప్ తర్వాత టీ20ల్లో 100+ వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు.

భారత్ తరఫున టీ20ల్లో వేగంగా వెయ్యి పరుగులు పూర్తి చేసిన యంగెస్ట్ బ్యాటర్ (23 ఏళ్లు)గా తిలక్ వర్మ. అభిషేక్ (25)ను అధిగమించాడు.

టీ20ల్లో తమ అత్యల్ప స్కోరు (74) నమోదు చేసిన దక్షిణాఫ్రికా.

**4** టీ20ల్లో ఎక్కువ సిక్సర్లు (100) బాదిన నాలుగో భారత బ్యాటర్‌గా హార్దిక్. రోహిత్ (205), సూర్య (155), విరాట్ (124) ముందున్నారు.




### స్కోరుబోర్డు

**భారత్:** అభిషేక్ (సి) యాన్సెన్ (బి) సిపమ్లా 17, గిల్ (సి) యాన్సెన్ (బి) ఎన్‌గిడి 4, సూర్య (సి) మార్‌క్రమ్ (బి) ఎన్‌గిడి 12, తిలక్ (సి) యాన్సెన్ (బి) ఎన్‌గిడి 26, అక్షర్ (సి) ఫెరీరా (బి) సిపమ్లా 23, హార్దిక్ (నాటౌట్) 59, దూబే (బి) ఫెరీరా 11, జితేశ్ (నాటౌట్) 10; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 175/6. వికెట్ల పతనం:** 1-5, 2-17, 3-48, 4-78, 5-104, 6-137. **బౌలింగ్:** ఎన్‌గిడి 4-0-31-3, యాన్సెన్ 4-0-23-0, సిపమ్లా 4-0-38-2, నోకియా 4-0-41-0, కేశవ్ 2-0-25-0, ఫెరీరా 2-0-13-1.

**దక్షిణాఫ్రికా:** డికాక్ (సి) అభిషేక్ (బి) అర్ష్‌దీప్ 0, మార్‌క్రమ్ (బి) అక్షర్ 14, స్టబ్స్ (సి) జితేశ్ (బి) అర్ష్‌దీప్ 14, బ్రెవిస్ (సి) సూర్య (బి) బుమ్రా 22, మిల్లర్ (సి) జితేశ్ (బి) హార్దిక్ 1, ఫెరీరా (సి) జితేశ్ (బి) వరుణ్ 5, యాన్సెన్ (బి) వరుణ్ 12, కేశవ్ (సి) జితేశ్ (బి) బుమ్రా 0, నోకియా (బి) అక్షర్ 1, సిపమ్లా (సి) అభిషేక్ (బి) దూబే 2, ఎన్‌గిడి (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 12.3 ఓవర్లలో 74 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-0, 2-16, 3-40, 4-45, 5-50, 6-68, 7-68, 8-70, 9-72, 10-74. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 2-0-14-2, బుమ్రా 3-0-17-2, వరుణ్ 3-1-19-2, అక్షర్ 2-0-7-2, హార్దిక్ 2-0-16-1, దూబే 0.3-0-1-1.

# స్పోర్ట్స్

# మెస్సీ ర్యాంప్ వాక్..

● సువారెజ్, జాన్ అబ్రహాం కూడా..
● తారాతోరణం కనువిందు






**3 రోజుల్లో.. హైదరాబాద్‌కు**

మూడు రోజుల పర్యటనలో దేశం నలుదిక్కులను మెస్సీ చుట్టేయనున్నాడు. కోల్‌కతాలో తన భారీ విగ్రహాన్ని ఆవిష్కరించనుండగా.. భాగ్యనగరంలో ఫుట్‌బాల్ మ్యాచ్‌తో ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించనున్నాడు. తర్వాతి రోజు ముంబై ఫ్యాషన్ షోలో ర్యాంప్ వాక్..చివరగా ఢిల్లీలో మోదీని కలిసిన అనంతరం గ్రాండ్‌గా భారత్‌కు బై..బై!

**కోల్‌కతా:** భారత పర్యటనలో భాగంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీ ఓ ఫ్యాషన్ షోలో పాల్గొననున్నాడు. స్వచ్ఛంద సంస్థ కోసం విరాళాల సేకరణలో భాగంగా ఆదివారం ముంబైలో ఈ ర్యాంప్ వాక్‌ను ఏర్పాటు చేసినట్టు ప్రమోటర్ దత్తా మంగళవారమిక్కడ తెలిపాడు. ముంబై లెగ్‌ను వాంఖడే స్టేడియంలో 14వ తేదీ సాయంత్రం 5 నుంచి షెడ్యూల్ చేశారు. 45 నిమిషాలపాటు సాగే ఫ్యాషన్ షోలో ఉరుగ్వే మాజీ స్ట్రయికర్ లూయిస్ సువారెజ్, అర్జెంటీనా మిడ్‌ఫీల్డర్ రోడ్రిగో డి పాల్‌తో కలిసి మెస్సీ ర్యాంప్ వాక్ చేయనున్నట్టు దత్తా చెప్పాడు. ప్రముఖ క్రికెటర్లు, మోడల్స్‌తో పాటు బాలీవుడ్ నటులు టైగర్, జాకీ ష్రాఫ్, జాన్ అబ్రహాం కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అంతేకాకుండా స్పానిష్ మ్యూజిక్ షోలో కూడా సువారెజ్ భాగం కానున్నాడు. 2022 వరల్డ్‌కప్‌నకు సంబంధించిన మెస్సీ జ్ఞాపికలను వేలానికి ఉంచే చాన్సుంది.

### 70 అడుగుల విగ్రహావిష్కరణ..

వాస్తవంగా మెస్సీ మూడు రోజుల పర్యటన కోల్‌కతా నుంచి ఆరంభం కానుంది. శుక్రవారం అర్ధరాత్రి అతడు ఇక్కడకు చేరుకోనున్నాడు. శ్రీభూమిలో ఏర్పాటు చేసిన 70 అడుగుల తన విగ్రహాన్ని మెస్సీ ఆవిష్కరించాల్సి ఉంది. కానీ, భద్రతాపరమైన కారణాల రీత్యా హోటల్ నుంచే వర్చువల్‌గా మెగా విగ్రహాన్ని మెస్సీ ఆవిష్కరించనున్నాడు. ఫైబర్ గ్లాస్‌తో నిర్మిస్తున్న ఈ విగ్రహం కోసం దాదాపు రెండు నెలలుగా కార్మికులు శ్రమిస్తున్నారు. శనివారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు అతిథుల మీట్ అండ్ గ్రీట్ జరగనుండగా.. అర్జెంటీనా-భారత్ ఫుడ్‌ఫెస్టివల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. తర్వాత మెస్సీ సాల్ట్ లేక్ స్టేడియం చేరుకోనున్నాడు. ఇక్కడ భారీ చిత్రాన్ని కూడా మెస్సీకి బహూకరించే అవకాశం ఉందని దత్తా చెప్పాడు. ఆ తర్వాత 2 గంటలకు హైదరాబాద్ పయనమవుతాడని తెలిపాడు. సౌత్ టూర్‌లో భాగంగా రాత్రి 7 గంటలకు ఉప్పల్‌లో జరిగే 'గోట్‌కప్'లో మెస్సీ పాల్గొననున్నాడు. 7-7 సెలెబ్రిటీ మ్యాచ్‌లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో కలసి మెస్సీ ఆడనున్నాడు. మెస్సీ రాకను పురస్కరించుకొని సంగీత విభావరిని కూడా ఏర్పాటు చేశారు.

### ఆఖర్లో మోదీని కలసి..

టూర్ ముగింపులో భాగంగా సోమవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని మెస్సీ కలుసుకోనున్నాడు. మినెర్వా అకాడమీ యూత్ టీమ్‌ను కూడా లియోనెల్ సన్మానించనున్నాడు. 9 మంది సభ్యుల సెలెబ్రిటీ మ్యాచ్‌లో కూడా పాల్గొనే చాన్సుంది.

## చెస్ చాంపియన్ ప్రణీత్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రోమ్ సిటీ ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్ టైటిల్‌ను తెలుగు గ్రాండ్‌మాస్టర్ ప్రణీత్ కైవసం చేసుకున్నాడు. ఇటలీలోని రోమ్‌లో జరిగిన ఈ పోటీల్లో తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి ప్రణీత్ ఏడు విజయాలు, రెండు డ్రాలతో 8 పాయింట్లు సాధించి టాప్‌లో నిలిచాడు.

## టీమిండియాలోకి కమలిని, వైష్ణవి

**న్యూఢిల్లీ:** యువ క్రికెటర్లు కమలిని, వైష్ణవి శర్మలకు టీమిండియాలో స్థానం లభించింది. వచ్చే నెలలో శ్రీలంకతో జరిగే ఐదు టీ20ల సిరీస్‌కు మంగళవారం ప్రకటించిన భారత జట్టులో వీరికి చోటు దక్కింది.

**జట్టు:** హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, జెమీమా, షఫాలీ, హర్లీన్, అమన్‌జోత్, అరుంధతి రెడ్డి, క్రాంతి, రేణుక సింగ్, రిచా ఘోష్, కమలిని, శ్రీచరణి, వైష్ణవి.

## మినీ వేలానికి 350 మంది

● డికాక్ మళ్లీ ఐపీఎల్‌లో?
● గ్రీన్ కోసం డిమాండ్



**ముంబై:** ఐపీఎల్ మినీ వేలం కోసం 350 మంది ఆటగాళ్ల జాబితాను బీసీసీఐ సిద్ధం చేసింది. ఈ నెల 16న దుబాయ్‌లో ఈ వేలం జరగనుంది. మొత్తం 1390 మంది క్రికెటర్లు వేలం కోసం పేర్లు నమోదు చేసుకోగా.. 1005 మందికి తగ్గించిన బీసీసీఐ మరింతగా వడపోసి 350కి కుదించింది. వీరిలో 240 మంది భారతీయులు కాగా.. 110 మంది విదేశీ ఆటగాళ్లు. అయితే, రిటైర్మెంట్‌ను వెనక్కితీసుకొని వన్డేలు, టీ20లు ఆడుతున్న దక్షిణాఫ్రికా వికెట్ కీపర్-బ్యాటర్ క్వింటన్ డికాక్ పేరు కూడా వేలానికి రానుండడం విశేషం. తొలుత జాబితాలో అతడి పేరు లేకపోయినా.. ఓ ఫ్రాంచైజీ ఒత్తిడితో చేర్చినట్టు తెలుస్తోంది. డికాక్ కనీసధర రూ. కోటి కాగా.. 2021లో ఐపీఎల్ ఆడిన ఆస్ట్రేలియా బ్యాటర్ స్టీవ్ స్మిత్ పేరు రూ. 2 కోట్ల కేటగిరీలో ఉండడం అందరినీ ఆశ్చర్యపర్చింది. ఈ వేలంద్వారా ఖాళీగా ఉన్న 77 స్థానాలను భర్తీ చేయనుండగా.. అందులో 31 విదేశీ ప్లేయర్ల కోసం ఉద్దేశించినవి. కాగా, కనీస ధర రూ. 2 కోట్ల కేటగిరీలో 40 మంది పేర్లు నమోదు చేసుకోగా.. కోల్‌కతా వదిలేసిన వెంకటేష్ అయ్యర్, రవి బిష్ణోయ్ మాత్రమే ఈ జాబితాలో ఉన్న భారత ప్లేయర్లు. కామెరూన్ గ్రీన్ భారీ ధర పలికే అవకాశం ఉంది. కాగా పృథ్వీ షా మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనుండగా.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆకట్టుకొంటున్న దేశవాళీ ప్లేయర్లు కునాల్ చందేలా, అశోక్ కుమార్‌పై ఫ్రాంచైజీలు ఆసక్తి ప్రదర్శించే అవకాశం ఉంది. లివింగ్ స్టోన్, జేమీ స్మిత్, అట్కిన్సన్, బెన్ డకెట్ ఇలా 21 మంది ఇంగ్లండ్ ఆటగాళ్లు వేలంలో పాల్గొననున్నారు. మాథ్యూ షార్ట్, జోష్ ఇంగ్లిస్, నోకియా, ఎన్‌గిడి, షాయ్ హోప్, రోస్టన్ చేజ్, అల్జారీ జోసెఫ్, హసరంగ, రచిన్ రవీంద్ర లాంటి విదేశీ ప్లేయర్లకు డిమాండ్ నెలకొనే అవకాశం ఉంది. వేలంలో పాల్గొనే ఫ్రాంచైజీల్లో అత్యధికంగా కోల్‌కతా రూ. 64.3 కోట్లు, చెన్నై రూ. 43.4 కోట్లు, సన్‌రైజర్స్ రూ. 25.5 కోట్ల పర్స్ కలిగి ఉన్నాయి.

## ఐటీ విప్లవానికి తెలంగాణ పుట్టినిల్లు

తెలంగాణ రాష్ట్రం భారతదేశ పటంలో ఓ భాగం మాత్రమే కాదు. దేశ ఐటీ విప్లవానికి పుట్టినిల్లుగా ప్రపంచపటం మీద నిలుస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో వచ్చిన ఈ విజన్ డాక్యుమెంట్ రాష్ట్ర అభివృద్ధిని ఐటీ ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి ప్రజల ఆధారిత సాంకేతిక పరిసరాల వైపు తీసుకెళ్తుంది. ఒక కొత్త నిర్మాణాత్మక మార్పు తీసుకు వస్తుంది. రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో ఇది కీలక దశ

- ప్రొఫెసర్ అరవింద్ సుబ్రమణియన్, భారత ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు

## తెలంగాణలో పెట్టుబడులు పెడతాం

నేను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని. మా నాన్న ఆ స్కూల్‌కు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. ఐఐటీ అనంతరం 1972లో కెనడా వెళ్లా. ఆ తర్వాత ఫైర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ ప్రారంభించా. ఒక్క భారత్‌లోనే 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాం. దాన్ని త్వరలోనే 20 బిలియన్ డాలర్లు చేస్తాం. అందులో తెలంగాణ కూడా ఉంటుంది. తెలంగాణ విజన్ 2047లో మూడు ట్రిలియన్ డాలర్ల జీడీపీ సాధన లక్ష్యంగా పెట్టడం ఉత్తేజకరం. ప్రజలకు మంచి విద్య, నాణ్యమైన వైద్యం, పరిశుభ్ర పర్యావరణం అందించడం కోసం ఈ విజన్‌లో నిర్దేశించిన లక్ష్యాలు కూడా ప్రేరణ కల్పించేవే. వాటి అమలు కూడా సాధ్యమే. ఆల్ ది బెస్ట్ టు సీఎం రేవంత్‌రెడ్డి. ఆల్ ది బెస్ట్ టు తెలంగాణ

- ప్రేమ్ వత్స, ఫైర్ ఫాక్స్ ఫైనాన్షియల్ సీఈవో

## ఈ విజన్‌తో పెట్టుబడులే కాదు.. హైక్వాలిటీ ఉద్యోగాలూ వస్తాయి

తెలంగాణ ఒక యంగ్ రాష్ట్రం. టెక్నాలజీ, పాలన, ఇన్‌క్లూజివ్ గ్రోత్‌తో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే ఒక స్థాయికి వచ్చింది. తెలంగాణ విజన్ 2047తో ప్రపంచస్థాయి పెట్టుబడులే కాదు..హై క్వాలిటీ ఉద్యోగాలూ వస్తాయి. తెలంగాణతో ఏఐ, సైబర్ సెక్యూరిటీలో కలిసి పనిచేసి వచ్చే తరాన్ని సిద్ధం చేస్తాం. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బస్సు, గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్ ఇవన్నీ పథకాలు కాదు లైఫ్ లైన్స్. తెలంగాణ, హైదరాబాద్ రూపాంతరం, అభివృద్ధిని నేను చూశా. ఇక్కడ ప్రతిభ కలిగిన మానవ వనరులున్నాయి. మనం కలిసి ఒక ప్రపంచాన్ని సృష్టిద్దాం

- శంతను నారాయణ్, అడోబ్ సీఈవో

## తెలంగాణ విజన్‌లో భాగస్వామిగా ఉంటా

దార్శనికత-విధానాలు-లక్ష్యాల సాధనలో అనేక రాష్ట్రాలతో కలిసి పనిచేస్తున్నా. దేశంలోని అనేక రాష్ట్రాలు ఆయా రంగాల్లో సాధిస్తున్న వృద్ధిలో వ్యత్యాసాలు అక్కడి నాయకత్వ ప్రతిభకు అద్దం పడతాయి. ఏటా జిల్లా స్థాయిలో జరుగుతున్న పని-వాటి ఫలితాల సమాచారం తెప్పించుకుంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. లక్ష్యాలను నిర్దేశించుకోవడం, దానికోసం అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని పనిచేస్తామని విజన్‌లో పేర్కొనడం ఉత్తేజకరం. తెలంగాణ విజన్‌లో భాగస్వామిగా ఉంటాం.

- ప్రొఫెసర్ కార్తీక్ మురళీధరన్

## తెలంగాణ అన్‌బీటబుల్

» ఏటా 8-9 శాతం స్థిరమైన వృద్ధితోనే

3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం సాధ్యం: దువ్వూరి



హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఈజ్ అన్‌స్టాపబుల్ అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని, తాను మాత్రం తెలంగాణ అన్‌బీటబుల్ అంటానని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. పదేళ్ల తర్వాత ప్రపంచంలో ఎక్కడో ఒకరు 'మా రాష్ట్రాన్ని తెలంగాణ మోడల్‌లా మార్చాలి' అని అడుగుతారని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో మంగళవారం ఆయన కీలక ప్రసంగం చేశారు. ప్రస్తుతం తెలంగాణ జీఎస్‌డీపీ సుమారు రూ.16.7లక్షల కోట్లు అంటే సుమారు 250 బిలియన్ డాలర్లు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న విధంగా 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకోవాలంటే వచ్చే 22 ఏళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 15 రెట్లు పెంచాలని తెలిపారు. అది జరగాలంటే ప్రతీ ఏటా 8 నుంచి 9 శాతం స్థిరమైన వృద్ధిని సాధించాలని వివరించారు. దక్షిణ కొరియాలోని 'గ్యోంగ్‌డోంగ్ మోడల్' లాంటి వేగవంతమైన అభివృద్ధిని తెలంగాణ పునరావృతం చేయగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. గత 10 ఏళ్లలో అసాధారణ పురోగతి సాధించిన తెలంగాణ.. ప్రస్తుతం దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా హైదరాబాద్ నగరాన్ని గొప్పగా చెబుతారని, హైదరాబాద్ భారతదేశ ప్రతిరూపమని చెప్పారు. ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో బలంగా ఉన్న తెలంగాణలో తయారీ రంగం, డిజిటల్, ఫిజికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో విస్తరణ అత్యవసరమని దువ్వూరి అభిప్రాయపడ్డారు. దీర్ఘకాలిక ఫలితాలు ఇచ్చే విద్య, నైపుణ్యాలే రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయని పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిడులకు తలొగ్గి స్వల్పకాలిక లక్ష్యాలపై కాక సీఎం రేవంత్ రెడ్డి భవిష్యత్ దిశగా అడుగులు వేస్తారని దువ్వూరి ఆశాభావం వ్యక్తం చేశారు.

# సినీ గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

### పాన్ వరల్డ్ స్థాయికి తెలుగు సినిమా.. రాష్ట్రంలో సినీ స్కిల్స్ వర్సిటీ అవసరం.. 'సినిమా రైజింగ్' సదస్సులో వక్తలు

» తెలంగాణ రైజింగ్ 2047లో సినీ పెద్దల ఆలోచనలు, భాగస్వామ్యాన్ని కోరుతున్నాం

» సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):సినీరంగంలో జపాన్, కొరియాలు ఎదిగిన తీరును స్ఫూర్తిగా తీసుకుని.. తెలంగాణను సినిమా పరిశ్రమకు గ్లోబల్ హబ్‌గా 2047 నాటికి తీర్చిదిద్దడానికి సహకరిస్తామని 'సినిమా రైజింగ్' సదస్సులో పాల్గొన్న సినీ ప్రముఖులు పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దర్శకులు, నిర్మాతలు, నటులు సదస్సులో పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు. భవిష్యత్తులో సినిమా.. స్క్రీన్లు, థియేటర్లు దాటి వర్చువల్ స్థాయికి వెళ్లనుందని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి సినీ నిర్మాణ కేంద్రంగా హైదరాబాద్‌ను మలచుకోవడానికి తమ వంతు సహకరిస్తామని వారు హామీ ఇచ్చారు. ఇక, సినీ పరిశ్రమ విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని.. ఈ సదస్సులో ప్రారంభోపన్యాసం చేసిన మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047లో సినీ రంగ పెద్దల ఆలోచనలు, భాగస్వామ్యాన్ని కోరుతున్నామన్నారు. అన్నపూర్ణ స్టూడియోతో ప్రారంభమైన సినీ రంగ అభివృద్ధి ప్రముఖ నటుడు అజయ్ దేవగన్ ఇక్కడ ప్రపంచస్థాయి స్టూడియో నిర్మించడానికి ముందుకు వచ్చేదాకా సాగిందని గుర్తుచేశారు. కాగా.. సినిమాల నిర్మాణానికి సంబంధించిన అన్ని రకాల పనులూ ఒకేచోట జరిగేలా సహకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సదస్సుకు వ్యాఖ్యాతగా ఉన్న అర్జున్ కపూర్ పేర్కొన్నారు. దాదాపు 50 ఏళ్ల క్రితం తమిళనాడు నుంచి తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు మారిందని.. నాటి నుంచి బాలారిష్టాలు దాటుకుని ప్రపంచస్థాయి సినిమాలను ఇక్కడ నిర్మించుకోగలుగుతున్నామని నిర్మాత డి.సురేష్‌బాబు అన్నారు. "మన సినిమాలు పాన్ ఇండియా నుంచి పాన్ వరల్డ్ స్థాయికి చేరుకున్నాయి, మార్కెట్ కూడా అదే విధంగా పెరిగింది. అందరు ముఖ్యమంత్రులూ ఇక్కడ సినీ పరిశ్రమ స్థిర పడటానికి, మౌలిక వసతుల కల్పనకు సహకరించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు లక్ష్యాలకు అనుగుణంగా సినీ పరిశ్రమ అడుగులు వేయడానికి సిద్ధంగా ఉంది" అని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇక్కడ సినీ రంగ అభివృద్ధికి అన్ని ప్రభుత్వాలూ సహకరించాయని.. నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. కొరియా సినిమా అభివృద్ధిని మనం ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. "30 ఏళ్ల క్రితం అక్కడ కొరియా వాళ్లు నాటిన విత్తనం నేడు ప్రతి ఇంటికీ కొరియన్ సినిమాల రూపంలో చేరింది. మనం కూడా అదే స్థాయికి చేరుకోవాలి" అని ఆయన ఆకాంక్షించారు. ఇక.. సినిమాలు సాంస్కృతిక రాయబారుల వంటివన్న నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి.. సినిమాల ద్వారా వ్యాపార విస్తరణ, ఉత్పత్తుల ప్రచారం, సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పడం లక్ష్యంగా ఉమ్మడి ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. ఉదాహరణకు జపాన్ 30 ఏళ్ల క్రితం తమ సంస్కృతి, ఆహారపుటలవాట్లకు.. ముఖ్యంగా నూడుల్స్‌కు సంబంధించి నిర్మించిన ఒక సినిమా ప్రపంచాన్ని కుదుపు కుదిపిందని గుర్తు చేశారు. "ఈ రోజు ఆ నూడుల్స్ వ్యాపారం 58 వేల కోట్ల రూపాయలకు చేరింది. అందులో కేవలం రూ.7వేల కోట్ల వ్యాపారం జపాన్‌లో జరగ్గా.. మిగతాదంతా ప్రపంచ దేశాల్లో జరిగింది"అని వివరించారు. సినిమా వ్యాపారం ప్రపంచంలో తిరుగులేనిదని.. అయితే, దానికి కావాల్సిన మౌలిక వసతుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన పాలసీని రూపొందించాలని సూచించారు. కాగా.. సినీ పరిశ్రమను భవిష్యత్తు తరాలకు అందించేలా సినీ కళల యూనివర్సిటీ ఏర్పాటు చేసుకోవాలని బాలీవుడ్ రచయిత రాకేశ్ కుమార్ సూచించారు.



సీఎం రేవంత్, భట్టి, శ్రీధర్‌బాబుతో చర్చలు జరుపుతున్న సినీ నటుడు చిరంజీవి, నిర్మాత దిల్ రాజు



సమ్మిట్‌కు హాజరైన రితేశ్ దేశ్‌ముఖ్, జెనీలియా దంపతులు

### స్క్రిప్ట్‌తో వస్తే.. సినిమా పూర్తి చేసుకుని వెళ్లేలా..
## సినీ రంగాన్ని ప్రోత్సహిస్తాం

**చిత్ర పరిశ్రమ ప్రముఖులతో భేటీలో సీఎం రేవంత్**

రాష్ట్రంలో సినీ రంగ అభివృద్ధికి కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలూ కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. స్క్రిప్ట్‌తో వస్తే సినిమా పూర్తిచేసుకుని వెళ్లేలా సినీ రంగాన్ని ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో.. సినీ నటుడు చిరంజీవి, నిర్మాతలు అల్లు అరవింద్, సురేశ్ బాబు, దిల్ రాజు సహా పలువురు సినీ ప్రముఖులు సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... ఫ్యూచర్ సిటీలో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని.. 24 క్రాఫ్ట్‌లో సినిమా అవసరాలకు అనుగుణంగా స్థానికులకు శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సినీ ప్రముఖులకు సూచించారు. ఫ్యూచర్ సిటీలో స్టూడియోల ఏర్పాటుకు తమ వైపు నుంచి అన్ని రకాల సహాయ, సహకారాలూ ఉంటాయని హామీ ఇచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నటులు జెనీలియా, అక్కినేని అమల, బాలీవుడ్, టాలీవుడ్ ప్రముఖులు సీఎంతో సమావేశమైన వారిలో ఉన్నారు.

## సీఎం ఆలోచనలకు మద్దతుగా నిలుస్తాం: చిరంజీవి

ప్రపంచదేశాలకు చెందినవారు హైదరాబాద్‌కు వచ్చి షూటింగ్‌లు జరుపుకొనేలా.. ఇక్కడ సినిమా ఇండస్ట్రీ హబ్‌ను నెలకొల్పాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పాన్ని అభినందిస్తున్నానని సినీ హీరో చిరంజీవి పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో ఆయన ప్రసంగిస్తూ.. సినీ పరిశ్రమ తరఫున ఒక ప్రతినిధిగా తాను ఇక్కడకు వచ్చానన్నారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన కొత్తలో తాను కలిసినప్పుడు హైదరాబాద్‌ను ఫిల్మ్‌హబ్‌గా తీర్చిదిద్దుదామని, ఇతర దేశాలవారు ఇక్కడకు వచ్చి షూటింగ్ జరుపుకొనేలా చేయాలని చెప్పారని గుర్తుచేసుకున్నారు. ఇంత తక్కువ సమయంలోనే అన్ని సెక్టార్లనూ ఫ్యూచర్ సిటీకి ఆహ్వానించడం రేవంత్‌రెడ్డి ఒక్కరికే సాధ్యమైందన్నారు. ప్రపంచానికి హైదరాబాద్ సినిమా హబ్‌గా మార్చేందుకు తనతోపాటు పరిశ్రమలోని వారందరూ ఆయనకు సహకరిస్తారని చెప్పారు. "సల్మాన్‌ఖాన్, అజయ్‌దేవ్‌గణ్‌లు స్మార్ట్, ఫ్యూచరిస్టిక్ స్టూడియోలు ఇక్కడ పెడతామని చెబుతున్నారు. ఇది శుభారంభం. నేను, నాగార్జున, వెంకటేశ్, ఇతర ప్రొడ్యూసర్లు.. అంతా దీనిపై దృష్టిపెడతాం"అని పేర్కొన్నారు. సినీరంగంలో స్థిరపడేలా నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెడితే లక్షలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఇక్కడ స్టూడియోలకు స్థలాలు ఇవ్వడమే కాకుండా.. శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వపరంగా సదస్సు నిర్వహించాలని సూచించారు.

## మలయాళ సినిమాలకు హైదరాబాద్ బ్యాకప్

మలయాళ సినిమా రంగానికి హైదరాబాద్ బ్యాకప్‌గా నిలుస్తోందని.. ఇక్కడ జరిగే సినీ రంగ అభివృద్ధి ప్రణాళికల్లో తాము తప్పనిసరిగా భాగస్వాములం అవుతామని మలయాళ నటుడు, నిర్మాత అసిఫ్ అలీ అన్నారు. ఇక.. సినిమాలకు హద్దులు చెరిగిపోయాయని, తన సినీ ప్రస్థానం హైదరాబాద్ నుంచే ప్రారంభమైందని సదస్సులో పాల్గొన్న బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ అన్నారు. సినీ రంగానికి చెందిన అన్ని విభాగాల్లో కొత్త రక్తానికి అవకాశం ఇచ్చే విధంగా సినీ స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. కాగా.. సినీ రంగంలో మహిళలు పనిచేయడానికి సురక్షిత వాతావరణం ముఖ్యమని ప్రముఖ దర్శక నిర్మాత జోయా అక్తర్ అన్నారు. సినీ రంగ అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికల్లో మహిళా భాగస్వామ్యం పెరగాలని ఆమె ఆకాంక్షించారు. అయితే.. సినీ నిర్మాణంలో మహిళలు తక్కువగా ఉన్నారని.. ప్రముఖ నటి జెనీలియా అన్నారు. ప్రపంచస్థాయి మౌలిక వసతులతో హైదరాబాద్ నగరం సినీ గ్లోబల్ హబ్‌గా మారాలని ఆకాంక్షించారు.

## దేశానికి పామాయిల్ హబ్‌గా తెలంగాణ

» 10 లక్షల ఎకరాల్లో సాగే లక్ష్యం: మంత్రి తుమ్మల

» గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం 3 లక్షల ఎకరాల మేర ఉన్న పామాయిల్ సాగు విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచడమే లక్ష్యమని, దేశానికి పామాయిల్ హబ్‌గా తెలంగాణను తయారు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గోద్రెజ్ కంపెనీ ఎండీ రాకేశ్ స్వామి, గోద్రెజ్ ఆగ్రో వెట్ లిమిటెడ్ సీఈవో సౌగత్ నియోగి, ఆయిల్ పామ్ బిజినెస్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులతో చర్చ సందర్భంగా రాష్ట్రంలో పామాయిల్ సాగు పురోగతిని తుమ్మల వివరించారు. తెలంగాణలో రైతుల సంక్షేమం కోసం రెండేళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేశామని, ఆర్థిక ప్రగతిలో వ్యవసాయ రంగం గ్రోత్ ఇంజిన్‌గా మారుతోందని పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధన, వైవిధ్యం మెరుగుదల, వాతావరణ-స్థితిస్థాపక సాగు పద్ధతులపై దృష్టి సారించేందుకు వీలుగా 5 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు. థాయిలాండ్‌కు చెందిన ఆయిల్‌పామ్ విత్తన ఉత్పత్తి సంస్థ యూనివానిచ్ సహకారంతో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం గోద్రెజ్ ఆగ్రోవెట్ - ఓపీజీ, మలేషియాలోని ఎస్‌డీ గుత్రీ సంస్థ సహకారం కోరుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో వ్యవసాయ ఉత్పాదకతకు మద్దతు, వాతావరణ-స్థితిస్థాపక సంకర జాతుల సృష్టి, వ్యవసాయదారులను మరింత విస్తృతంగా శక్తివంతం చేయడం తమ లక్ష్యమని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు.


# సిల్వర్ ఫిలిగ్రీ.. నకాశీ మాస్క్

**గ్లోబల్ సమ్మిట్‌లో మెరిసిన కళాకృతులు**

**విదేశీ అతిథులకు జ్ఞాపికలుగా అందజేత**



చేర్యాల నకాశీ మాస్క్‌లు



సిల్వర్ ఫిలిగ్రీ బుద్ధుడు

చేర్యాల/కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చిన అతిథులకు తెలంగాణ సాంస్కృతిక కళాకృతులను బహుమతులుగా అందించింది రాష్ట్ర సర్కారు. ప్రసిద్ధి గాంచిన కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ ప్రతిమలు, చేర్యాల నకాశీ మాస్క్‌లను జ్ఞాపికలుగా బహూకరించింది. విదేశీ ప్రతినిధుల కోసం 500 నకాశీ మాస్క్‌లు తయారు చేసి ఇవ్వాలని సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన నకాశీ కళాకారుడు నాగిళ్ల గణేశ్‌ను అధికారులు సంప్రదించారు. ఈ ఆర్డర్ విలువ సుమారు రూ.2.50 లక్షలు. దీంతో గణేశ్ పని మొదలు పెట్టారు. కుటుంబసభ్యులతో పాటు తన వద్ద శిక్షణ పొందుతున్న వారితో కలిపి మొత్తం 15 మంది సుమారు 15 రోజులు రాత్రింబవళ్లు శ్రమించి మాస్క్‌లు తయారు చేశారు. చింతగింజల పొడి, అంబలి, చెక్కపొట్టు, బంక ఇతరత్రా మిశ్రమాలతో మాస్క్‌లు రూపొందించారు. వాటికి రంగులతో సొబగులద్ది, ఫ్రేమ్‌లుగా తీర్చిదిద్దారు. ఆ ఫ్రేమ్‌లలో గ్లోబల్ సమ్మిట్, తెలంగాణ రైజింగ్ లోగోలను ముద్రించారు. మరోవైపు, 60 సిల్వర్ ఫిలిగ్రీ కళాకృతుల కోసం కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ అసోసియేషన్‌కు సర్కారు ఆర్డర్ ఇచ్చింది. ధ్యాన ముద్రలో ఉన్న బుద్ధుడి రూపాన్ని కళాకారులు వెండి తీగలతో తీర్చిదిద్దారు. ఈ ప్రతిమలను 10 రోజుల పాటు 100 మంది కళాకారులు రూపొందించారు. ఒక్కో ప్రతిమకు సుమారు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చయింది. గతంలో ఎన్నో సందర్భాల్లో దేశ విదేశీ ప్రతినిధులు, అతిథులకు నకాశీ మాస్క్‌లు, సిల్వర్ ఫిలిగ్రీ ప్రతిమలను అందజేశారు.

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## పన్నెండున 'అఖండ' ఆగమనం



నందమూరి బాలయ్య అభిమానులకు శుభవార్త. 'అఖండ 2: తాండవం' సినిమా విడుదల తేదీ ఖరారు అయింది. ఈనెల 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈనెల 11న గ్రాండ్ ప్రీమియర్స్ ప్రదర్శించనున్నారు. నిజానికి షెడ్యూల్ ప్రకారం ఈనెల 5నే సినిమా విడుదల కావాల్సి ఉంది. చిత్ర నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ నుంచి తమకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని కోరుతూ ఈరోస్ ఇంటర్నేషనల్ సంస్థ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దాంతో 'అఖండ' విడుదలపై కోర్టు స్టే విధించింది. అనంతరం డిసెంబరు 12, డిసెంబరు 25 లేదా సంక్రాంతికి విడుదల అంటూ రకరకాల ఊహాగానాలు తెరమీదకు వచ్చాయి. అయితే మంగళవారం మధ్యాహ్నం ఈరోస్ ఇంటర్నేషనల్ సంస్థతో సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు 14 రీల్స్ ప్లస్ సంస్థ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. 'అఖండ' ఆగమనానికి అడ్డంకులు తొలగి మార్గం సుగమం అయింది.

## రంపంపం... స్టెప్పేస్తే భూకంపం



పవన్ కల్యాణ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' నుంచి తొలి గీతం 'దేఖ్ లేంగే సాలా' ప్రోమో వచ్చేసింది. ఉర్రూతలూగించే పాటకు పవన్ కల్యాణ్ అదిరిపోయే స్టెప్పులేశారు. రంపంపం...స్టెప్పేస్తే భూకంపం..' అంటూ సాగే ఈ పాటను భాస్కర బట్ల రాశారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చగా విశాల్ దద్లానీ పాడారు. పూర్తి పాట ఈనెల 13న విడుదల కానుంది. 'గబ్బర్ సింగ్' తర్వాత పవన్ కల్యాణ్ - డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రమిది. పవన్ సరసన రాశీ ఖన్నా, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మిస్తున్నారు.

## డార్లింగ్ సేఫ్‌గానే ఉన్నారు

మారుతి



'బాహుబలి: ద ఎపిక్' సినిమా ప్రచారంలో భాగంగా ప్రభాస్ ప్రస్తుతం జపాన్‌లో ఉన్న సంగతి తెలిసిందే. అయితే, జపాన్ ఉత్తర తీరంలో భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.5గా నమోదవ్వడంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఆందోళన చెందుతూ పోస్టులు పెడుతున్నారు. అందులో ఓ అభిమాని 'జపాన్‌లో భూకంపం వచ్చింది. సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మా హీరో ఎక్కడ ఉన్నారు. ఈ రోజు రిటర్న్ అవుతున్నాడు అంట' అని పెట్టిన పోస్టుకు దర్శకుడు మారుతి రిప్లై ఇచ్చారు. 'డార్లింగ్‌తో మాట్లాడాను. ఆయన టోక్యోలో లేరు. మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, ప్రభాస్ క్షేమంగానే ఉన్నారు' అని మారుతి పేర్కొన్నారు. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటించిన హారర్ థ్రిల్లర్ 'రాజాసాబ్' వచ్చే ఏడాది జనవరి 9న విడుదలవుతున్న సంగతి తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ప్రభాస్ ప్రస్తుతం హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న 'ఫౌజీ'తో పాటు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతోన్న 'స్పిరిట్' చిత్రాలు చేస్తున్నారు. వీటి చిత్రీకరణ పూర్తయ్యాక 'కల్కి 2898 ఏడీ', 'సలార్' సీక్వెల్స్ పట్టాలెక్కనున్నట్లు సమాచారం.

## మరో వంద రోజుల్లో...



యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'టాక్సిక్. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ఉపశీర్షిక. వచ్చే ఏడాది మార్చి 19న చిత్రం విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. మరో వంద రోజుల్లో చిత్రం మీ ముందుకు రాబోతోంది అని పేర్కొన్నారు. ఇంగ్లీష్, కన్నడ భాషల్లో ఏకకాలంలో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తెలుగు, హిందీ, మలయాళం తదితర భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. మాన్‌స్టర్ క్రియేషన్స్, కేవీఎన్ ప్రొడక్షన్స్ బేనర్లపై యశ్, వెంకట్ కే నారాయణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అక్షయ్ ఒబెరాయ్, నయనతార, కియారా అడ్వాణీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## కుటుంబంతో కలసి చూసేలా ఉంటుంది



ఈషా రెబ్బ, హర్ష చెముడు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్'. ఆహా ఓటీటీలో ప్రేక్షకాదరణ పొందిన ఈ సిరీస్‌కు కిరణ్ కే కరవల్ల దర్శకత్వంలో ఎస్‌కేఎన్ సీజన్ 2ను నిర్మించారు. ఈ నెల 12 నుంచి స్ట్రీమింగ్ అవుతున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈషారెబ్బ మాట్లాడుతూ 'సీజన్ 1లో నా పాత్రకు కొనసాగింపుగా ఉంటుంది. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని కథను రూపొందించారు. గ్లామర్ డోస్ పెంచకుండా, యూత్‌తో పాటు ఫ్యామిలీ అంతా కలసి చూసేలా సాగుతుంది. తొలి సీజన్‌లో కన్నా హర్ష పాత్రలో మరిన్ని షేడ్స్ ఉంటాయి. రాశీసింగ్ పాత్ర చాలా శక్తిమంతంగా ఉంటుంది. దర్శకుడు' అని అన్నారు. హర్ష చెముడు మాట్లాడుతూ 'సీజన్ 1లో జరిగిన దానికి ప్రతీకారం తీర్చుకునే పాత్రలో కనిపిస్తాను. తొలి సీజన్‌ను తక్కువ బడ్జెట్‌లో తీశారు' అని చెప్పారు.

## సాయంత్రం ఆటతో షురూ



శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నారీ నారీ నడుమ మురారి'. సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే సాధారణంగా సినిమాలు ఉదయం లేదా తెల్లవారుజామున షోలతో ప్రారంభమవుతాయి. కానీ 'నారీ నారీ నడుమ మురారి' చిత్రం మాత్రం సాయంత్రం ఆటతో ప్రారంభమవుతుంది. జనవరి 16న సాయంత్రం 5.49 నిమిషాలకు ప్రీమియర్స్ మొదలవుతాయని మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో శర్వానంద్ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు.

TELANGANA RISING 2047



# డబుల్ రైజింగ్!

## గ్లోబల్ సదస్సులో పెట్టుబడుల వెల్లువ.. 2 రోజుల్లో 5.75 లక్షల కోట్లకు ఎంవోయూలు



హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సులో రెండో రోజు కూడా పెట్టుబడులు వెల్లువెత్తాయి! దేశ, విదేశ కంపెనీలు క్యూ కట్టాయి! రెండు రోజుల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో మొత్తంమీద రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. సదస్సులో తొలిరోజు రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎంవోయూలు కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. రెండో రోజు ఏకంగా రూ.3.32 లక్షల కోట్ల పెట్టుబడుల కోసం ఒప్పందాలు కుదరడం విశేషం. ఈ పెట్టుబడుల్లో సగానికి సగం వాటా హరిత ఇంధనానిదే! గ్రీన్ ఎనర్జీలో ఏకంగా రూ.2.99 లక్షల కోట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు జరిగాయి. వీటి ద్వారా 1,61,250 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ఆయా సంస్థలు ప్రభుత్వానికి నివేదించాయి. రూ.1,76,348 కోట్ల పెట్టుబడులకు 11 సంస్థలు తెలంగాణ జెన్‌కోతో ఒప్పందం చేసుకోగా.. టీజీరెడ్‌కోతో రూ.1,23,350 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు 12 సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అలాగే, ఫార్మా, డేటా పార్కులు, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల్లో వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ముందుకొచ్చాయి. రాష్ట్రంలో ఏకంగా 10,120 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్ కేంద్రాలతోపాటు 3 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్లు పెట్టనున్నారు. ఈ పెట్టుబడులన్నీ కార్యరూపం దాలిస్తే.. తెలంగాణ ముఖ చిత్రం సమూలంగా మారిపోనుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### కంపెనీలు.. పెట్టుబడుల వివరాలివే..!

- ఇన్‌ఫ్రాకీ డీసీ పార్క్ రూ.70 వేల కోట్లతో 150 ఎకరాల్లో 1 గిగావాట్ సామర్థ్యం కలిగిన భారీ డేటా పార్కును అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది.
- జేసీకే ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ రూ.9 వేల కోట్ల పెట్టుబడితో పెద్దస్థాయి డేటా సెంటర్ల నిర్మాణం చేపట్టనుంది. దాంతో 2 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.
- ఏజీపీ గ్రూప్ రూ.6,750 కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది.
- జెన్ టెక్నాలజీ రూ.5 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకుంది.
- కొత్త కార్ల తయారీ కోసం భారత్ గరుడ రూ.2,100 కోట్లతో ఒప్పందం చేసుకుంది.
- కాన్ఫెడరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రైజెస్ (సీఐఎస్ఎ్ఎఈ) రూ.577.11 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. తమ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులతో 2,500 మందికి ఉపాధి లభించనుందని ఆ సంస్థ నివేదించింది.
- టీకాలు, పరిశోధన-అభివృద్ధి, తయారీ సేవల విస్తరణకు బయోలాజికల్ ఈ లిమిటెడ్ (బీఈ) తాజాగా రూ.3,500 కోట్ల పెట్టుబడిని ప్రకటించింది. గత పెట్టుబడితో కలిపి ఇది మొత్తం రూ.4 వేల కోట్లు కానుంది. విస్తరణ ద్వారా 3 వేలకుపైగా ఉద్యోగాలు రాబోతున్నాయి.
- ఫెర్టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.2 వేల కోట్ల పెట్టుబడితో తెలంగాణలో అధునాతన ఆహారం-వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనుంది. దాంతో, 800కు పైగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. స్థిర వ్యవసాయానికి అవసరమైన పోషకాలు, బయో ఉత్ప్రేరకాల తయారీకి ఈ సంస్థ రూ.200 కోట్ల పెట్టుబడి పెట్టనుంది.
- వింటేజ్ కాఫీ అండ్ బేవరేజెస్ లిమిటెడ్ ఫ్రీజ్-డ్రైడ్ కాఫీ ప్లాంట్ స్థాపనకు రూ.1,100 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలో యూనిట్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.
- రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ రూ.1,500 కోట్ల పెట్టుబడితో యూనిట్ ఏర్పాటు చేయనుంది. తద్వారా వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి.
- ఎలక్ట్రానిక్ తయారీ సేవల విస్తరణకు కేన్స్ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్ రూ.1,000 కోట్లకుపైగా పెట్టుబడి ప్రతిపాదించింది.
- ఆర్సీ సీటీ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మూడు విడతల్లో రూ.2,500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 1,600 మందికిపైగా ఉద్యోగాలు లభించనున్నాయి.
- పర్స్యూ గ్రూప్ 50 మెగావాట్ల గ్లోబల్ కెపాసిటీ, ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. దీనిద్వారా 3 వేల మందికి ఉపాధి వచ్చే అవకాశం ఉంది.
- అరబిందో ఫార్మా రూ.2 వేల కోట్లతో విస్తరణ చేపట్టి 3 వేలకిపైగా ఉద్యోగాలు సృష్టించనుంది.
- హెటిరో సంస్థ మందుల తయారీ యూనిట్ల విస్తరణకు రూ.1,800 కోట్ల పెట్టుబడి ప్రకటించింది. దాంతో 9 వేలకిపైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుంది.
- గ్రాన్యూల్స్ ఇండియా రూ.1,200 కోట్ల పెట్టుబడితో 2,500-3 వేల మందికి ఉపాధి ఇవ్వనుంది.
- పరిశోధన, అభివృద్ధి, తయారీ సేవల కోసం భారత్ బయోటెక్ రూ.1,000 కోట్ల పెట్టుబడితో ఆధునిక కేంద్రం ఏర్పాటు చేయనుంది.
- ఆహార-పానీయాల తయారీ విస్తరణకు కేజేఎస్ ఇండియా రూ.650 కోట్ల పెట్టుబడికి ముందుకొచ్చింది. ఈ యూనిట్ ద్వారా 1,551 మందికి ఉపాధి దొరకనుంది.
- గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ రాష్ట్రంలో పాల ఉత్పత్తి విస్తరణకు రూ.150 కోట్ల పెట్టుబడితో 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. దీనిద్వారా 300 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి.ఆక్వెలాన్ నెక్సస్ లిమిటెడ్ తెలంగాణలో క్లీన్ ఎనర్జీ ఆధారంగా 50 మెగావాట్ల నెట్ జీరో ఉద్గారాల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది.
- హైదరాబాద్‌కు చెందిన అంకుర సంస్థ బయోవరం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి డి.శ్రీధర్‌బాబు సమక్షంలో బయోవరం చైర్మన్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, ఎండీ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. 250 కోట్లతో పెట్టుబడి పెట్టనున్నారు.
- వైద్య రంగంలో విప్లవాన్ని సృష్టిస్తున్న విజ్ఞీ హోల్డింగ్ కంపెనీ మల్టీ ఒమిక్స్ ల్యాబ్స్‌తో కలిసి రానున్న పదేళ్లలో రూ.2,500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. మానవ శరీరంలో రాబోయే రుగ్మతలు, ప్రాణాంతక వ్యాధులను పరీక్షలతో ఐదేళ్ల ముందే గుర్తించి.. ముందస్తు చికిత్స తీసుకోవడానికి వీలుగా పరిశోధనలు చేయనుంది.
- టీడబ్ల్యూఐ గ్రూప్ ప్రపంచంలోనే తొలి ప్లగ్-ఇన్ హైబ్రిడ్ మోటార్ బైక్ తయారీ కేంద్రం తెలంగాణలో ఏర్పాటు చేయనుంది. ఇందుకు రూ.1,100 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 500 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.
- మహీంద్రా అండ్ మహీంద్ర గ్రూపు జహీరాబాద్ యూనిట్ విస్తరణకు నాలుగేళ్లలో రూ.500 కోట్లకుపైగా పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది.
- ఇండియా ఎక్స్‌ట్రీమ్ అడ్వెంచర్ గ్రూపు 20 ఎకరాల్లో యూనిట్ ఏర్పాటు చేయనుంది. రూ.500 కోట్ల పెట్టుబడితో ఎక్స్‌ట్రీమ్ స్పోర్ట్స్, అడ్వెంచర్, ఈ-స్పోర్ట్స్ ఎంటర్టైన్‌మెంట్ ఎరీనా ఏర్పాటు చేయనుంది.
- జ్యూరిచ్ ఇన్స్యూరెన్స్ ఇండియాలో తన తొలి గ్లోబల్ కేపబులిటీ సెంటర్ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుంది. మూడేళ్లలో దశలవారీగా విస్తరించనుంది.
- కెనడియన్ ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ తమ తొలి సంస్థను హైదరాబాద్‌లో స్థాపించనుంది. హైదరాబాద్‌ను గ్లోబల్ ఇంజినీరింగ్-సైబర్ హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పేర్కొంది.
- మాక్సిమస్ (అమెరికా) గ్లోబల్ పబ్లిక్ సెక్టార్ టెక్నాలజీ-ఆపరేషన్స్ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది.
- స్పోర్ట్స్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా శాటిలైట్ స్పోర్ట్స్ సిటీని జీఎంఆర్ అభివృద్ధి చేయనుంది.
- అనలాగ్ ఏఐ (అలెక్స్ కిప్‌మాన్) హైదరాబాద్‌లో గ్లోబల్ పరిశోధన, ప్రోటోటైపింగ్ ల్యాబ్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఆల్ట్‌మిన్ బ్యాటరీ ముడి పదార్థాల తయారీ కేంద్రాన్ని ప్రతిపాదించింది.

### తెలంగాణ జెన్‌కోతో ఒప్పందాలు చేసుకున్న సంస్థలు

| సంస్థ | నెలకొల్పే ప్లాంట్ | ఒప్పందం విలువ (రూ.కోట్లలో) | ఉద్యోగాల కల్పన |
|---|---|---|---|
| గ్రీన్‌కో ఎనర్జీ | 3960 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ | 24,000 | 500 |
| గ్రీన్‌కో జీఐపీఎల్ | 950 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ | 5800 | 200 |
| సిద్ధార్థ్ ఇన్‌ఫ్రాటెక్ | 900 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ | 5600 | 200 |
| అస్త్రాగ్రీన్ ఎనర్జీ | 750 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ | 4650 | 150 |
| సెరూలియన్ ఎనర్జీ సొల్యూషన్స్ | 900 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ | 5600 | 200 |
| బీకెఎమ్ ఇన్‌ఫ్రా | 1000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ | 14000 | 1000 |
| ఏకోరెన్ | 1000 మెగావాట్ల పీఎస్‌పీ, 500 మెగావాట్ల ఆర్‌ఈ | 16000 | 5000 |
| మై హోమ్ పవర్ | 750 మెగావాట్ల పీఎస్‌పీ, 500 మెగావాట్ల సోలార్ | 7000 | 12,500 |
| ఏఎంఆర్ ఇండియా | 2 వేల మెగావాట్ల రెన్యూబుల్ ఎనర్జీ | 12,500 | 18000 |
| పీఎఫ్‌సీ | పంప్డ్‌స్టోరేజీ | 50,000 | |
| ఆర్‌ఈసీ | పంప్డ్‌స్టోరేజీ, బీఈఎస్ఎస్ | 31,198 | |

### తెలంగాణ రెడ్‌కోతో ఒప్పందం చేసుకున్న సంస్థలు

| సంస్థ | నెలకొల్పే ప్లాంట్ | ఒప్పందం విలువ (రూ.కోట్లలో) | ఉద్యోగాల కల్పన |
|---|---|---|---|
| ఏఎం గ్రీన్ ఇండియా | ఈ-మెథనాల్ ప్లాంట్ | 8000 | 4000 |
| ఏఎం గ్రీన్ ఇండియా | 2జీ ఈథనాల్ ప్లాంట్ | 10,000 | 35000 |
| ఎస్ఎల్ఆర్ సురభి పవర్ | 1 గిగావాట్ సోలార్, 1.2 గిగావాట్ సోలార్‌సెల్ | 3000 | 1000 |
| అతిరత్ హోల్డింగ్స్ | 25 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ | 4000 | 9000 |
| శ్రీసురాస్ ఇండస్ట్రీస్ | కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్, క్యాప్టివ్ సోలార్ | 3500 | 5000 |
| సోలానిక్స్ పవర్ | సోలార్‌తో500 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ | 2400 | 500 |
| హైజెన్‌కో గ్రీన్ | 1000 టీపీఏ గ్రీన్ హైడ్రోజన్ | 1250 | 850 |
| ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ | వ్యవసాయ వ్యర్థాలతో 1000 మెగావాట్లప్లాంట్ | 1600 | 25000 |
| అస్త్రా గ్రీన్ ఎనర్జీ | 500 మెగావాట్ల క్యాప్టివ్‌ప్లాంట్-బ్యాటరీ ఎనర్జీతో | 5600 | 200-300 |
| యునైటెడ్ టెలికామ్స్ | 200 టీపీడీ బయోగ్యాస్ ప్లాంట్ | 2500 | 16,500 |
| యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ | 2750 మెగావాట్ల రెన్యూబుల్ ఎనర్జీ పార్కులు | 31,500 | 19,750 |
| జీటీపీసీ ట్రేడ్ ఛాంబర్స్ | మినరల్ ప్లాంట్ | 50,000 | 5000 |
| ఆల్ట్‌మిన్ | | 25 | 1500 |
| మొత్తం | | 2,99,698 | 1,61,250 |

### ప్రపంచస్థాయి క్రీడా ఈవెంట్లు



- ప్రపంచవ్యాప్తంగా జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు తెలంగాణ కేంద్ర స్థానం కానుంది. ఇందుకు సహకరించేందుకు ఫీఫా నైపుణ్యాభివృద్ధి పథకం కింద ఫీఫా-ఏఐఎఫ్ఎఫ్ ఫుట్‌బాల్ అకాడమీ (పురుషులు)ని ఏర్పాటు చేస్తారు.
- ఇంటర్నేషనల్ హాకీ విమెన్స్ వరల్డ్ కప్ క్వాలిఫయర్ 2026లో భాగంగా గచ్చిబౌలి స్టేడియంలో 24 మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఇందులో 8 దేశాలు భాగస్వామ్యం కానున్నాయి. తెలంగాణను గ్లోబల్ హాకి హబ్‌గా మార్చేందుకు ఈ పరిణామం ఉపకరించనుంది.
- 18 దేశాలు పాల్గొనే ఏసియా రోయింగ్ చాంపియన్‌షిప్ 2026ను తెలంగాణలో నిర్వహించనున్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్ 2026 ప్రపంచంలోనే అతి పెద్ద చెస్ ఉత్సవం కానుంది.

### పర్యాటక రంగంలోనూ...

- పర్యాటక రంగంలో రూ.7,045 కోట్ల భారీ పెట్టుబడులు వచ్చాయి. వీటితో ప్రత్యక్షంగా 10 వేల మందికి, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభించనుంది.
- ఫుడ్ లింక్ ఎఫ్‌అండ్‌బీ హోల్డింగ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ రూ.3,000 కోట్లు పెట్టుబడులతో ముందుకొచ్చింది.
- గోల్ఫ్ అండ్ రిసార్ట్స్‌ను డ్రీమ్‌వ్యాలీ రూ.1,000 కోట్లతో నిర్మించనుంది.
- సారస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,000 కోట్లు, అట్మాస్ఫియర్ కోర్ హోటల్స్ (మాల్దీవులు) రూ.800 కోట్లు, కేఈఐ గ్రూప్ (కామినేని గ్రూప్) రూ.200 కోట్లు, మల్టీవర్స్ హోటల్స్ రూ.300 కోట్లు, ఫ్యుద్రా ఇండియా (స్పెయిన్) రూ.300 కోట్లు, శ్రీ హవిషా హాస్పిటాలిటీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.300 కోట్లు, రిధిరా గ్రూప్ రూ.120 కోట్లు, సలామ్ నమస్తే దోసా హట్ (ఆస్ట్రేలియా), విశాఖ రిక్రియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.25 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ యానిమేషన్ ఐఫా ఉత్సవం, ఏథెన్స్ ఈవెంట్ల భాగస్వామ్యం ద్వారా రాష్ట్రానికి రూ.550-600 కోట్ల ఆర్థిక లాభం చేకూరనుంది.

### సల్మాన్‌ఖాన్, అజయ్ దేవ్‌గణ్ స్టూడియోలు..


అజయ్ దేవగణ్ ఫిల్మ్ స్టూడియోలో స్టూడియోలు, వీఎఫ్ఎక్స్, వర్క్‌షాప్‌లు వంటి ఫిల్మ్ ఎకోసిస్టమ్‌ను పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేయనున్నారు. సల్మాన్‌ఖాన్ కూడా ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్, స్టూడియో నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు. వాటితో యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ పార్కులు, కమర్షియల్ స్పేస్‌లలో పెట్టుబడులు పెట్టేందుకు బ్లాక్‌స్టోన్ ఆసియా ఆసక్తి చూపింది. సుమధుర గ్రూప్ కొత్త టౌన్‌షిప్, మధ్యతరగతి నివాస సముదాయాలను ప్రతిపాదించింది.

## మూసీ పునర్జీవం విజయవంతమైతే ప్రపంచమే హైదరాబాద్ తరలివస్తుంది

**కేసీఆర్ సర్కార్ కాళేశ్వరం అనవసరం**

**సగం నిధులతో చిన్న ప్రాజెక్టులు చేపడితే వేరుగా తెలంగాణ పరిస్థితి**

**ఆంధ్రజ్యోతితో రాజేంద్ర సింగ్**



హైదరాబాద్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): 'మూసీ పునర్జీవ ప్రాజెక్టు వెనుక ఉన్న ఆశయం ఎంతో గొప్పది. సర్కారు నిర్దేశిత లక్ష్యాల ప్రకారం పూర్తయితే ప్రపంచానికే తలమానికంగా నిలుస్తుంది' అని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్ర సింగ్ పేర్కొన్నారు. రాజస్థాన్‌లో 50 ఏళ్లుగా పూర్తిగా ఎండిపోయిన 23 నదుల పునరుద్ధరణలో కీలకంగా నిలిచారు. రాజేంద్ర సింగ్ ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన మాటల్లోనే.. 'గతంలో హైదరాబాద్‌కు పరిశుద్ధమైన తాగునీరందించిన మూసీ పునర్జీవనం చాలా గొప్ప ఆలోచన. తొలిసారి ఈ ప్రాజెక్టు గురించి విన్నప్పుడు చాలా సంతోషమేసింది. ముఖ్యంగా దేశంలో జల వనరులు చాలా వేగంగా తగ్గుతున్నాయి. పలు దేశాల్లో మూసీ వంటి నదులు ఆయా దేశాల ప్రభుత్వాల చిత్తశుద్ధితో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందాయి. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ ప్రాజెక్టును చేపట్టిన యువ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్నా.. ఆయన అంకిత భావం చూస్తే మూసీ పునర్జీవ ప్రాజెక్టు పూర్తిగా విజయవంతమైతే ప్రపంచంలోని గొప్ప నదుల పునరుద్ధరణ ప్రాజెక్టుల్లో మూసీకి ప్రత్యేక స్థానం దక్కుతుంది. ఈ నదిని తిలకించేందుకు ప్రపంచం తరలి రావడంతో హైదరాబాద్ పర్యాటక కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఈ ప్రాజెక్టు అమలులో నా సహకారం ఉంటుంది. జల సంరక్షణలో తెలంగాణ ఎంతో మెరుగు. భౌగోళిక పరిస్థితుల వల్ల వర్షపాతమూ ఎక్కువే. కాకతీయుల నాటి చెరువులు ఇప్పటికీ సజీవం. చెరువులను కాపాడేందుకు 'హైడ్రా' ప్రారంభం చాలా సంతోషం. రూ. లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన గత కేసీఆర్ సర్కారు అందులో సగం నిధులను చిన్న నీటి వనరుల పునరుద్ధరణకు వినియోగిస్తే తెలంగాణ పరిస్థితి ఇంకోలా ఉండేది. నా దృష్టిలో రూ.లక్ష కోట్ల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం అనవసరం. నీటి సంరక్షణను అన్ని దేశాలు అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తున్నాయి. గత పదేళ్లలో నేను సందర్శించిన 74 దేశాల్లో మాదిరిగా తెలంగాణలోనూ ఆ ప్రయత్నం జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులతోపాటు మూసీ పునర్జీవంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి' అని రాజేంద్ర సింగ్ పేర్కొన్నారు.

## రేవంత్ విజన్‌కు ఫిదా

**సీఎం ముందుచూపు, రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టత చూశాకే స్కిల్స్ వర్సిటీ బాధ్యతలకు ఒప్పుకున్నా**

**ముందు సున్నితంగా తిరస్కరిద్దామనుకున్నా**

**ఆయన మాటలు విన్నాక నో చెప్పలేకపోయా**

**పేదల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్న**

**సీఎం తపన నా మనసును మార్చేసింది**

**ప్రజలే కేంద్రంగా తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్**

**మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా ప్రశంసలు**



హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'సాధారణంగా పాలకులు అంకెల గారడీకి, జీడీపీ లెక్కలకు ప్రాధాన్యం ఇస్తుంటారు. కానీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఆయన విజన్ ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం చుట్టూ ఉంది. సీఎం రేవంత్‌కు ఉన్న స్పష్టత, ముందుచూపు చూసిన తర్వాతే స్కిల్స్ యూనివర్సిటీ బాధ్యతలు తీసుకునేందుకు అంగీకరించాను. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ చూశాను. ఇది ప్రజలు కేంద్రంగా, వారి అభిప్రాయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ఆయా రంగాల నిపుణులను పరిగణనలోకి తీసుకొని తయారైందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా కొనియాడారు. స్కిల్స్ యూనివర్సిటీకి చైర్మన్‌గా ఉండాలని సీఎం రేవంత్ అడిగిన విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. నిజానికి తనకున్న పని ఒత్తిడి, ఇతర బాధ్యతల దృష్ట్యా మొదట సున్నితంగా తిరస్కరిద్దామనుకున్నానని చెప్పారు. అప్పటికే తాను మహీంద్రా యూనివర్సిటీ చైర్మన్‌గా ఉన్నందున తన దృష్టి అంతా దానిపై పెట్టానని, స్కిల్స్ యూనివర్సిటీ పదవి వద్దని చెప్పానని తెలిపారు. అయితే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ అనేది ఒక్క తెలంగాణకే పరిమితం కాదని, ఇండియా భవిష్యత్తు అని సీఎం తనతో చెప్పారన్నారు. రేవంత్ తన విజన్ ఏంటో వివరించారని, ఆయనకు రాష్ట్ర అభివృద్ధిపై ఉన్న స్పష్టత, పేదల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్న తపన తన మనసును మార్చేశాయని ఆనంద్ మహీంద్రా తెలిపారు. సీఎం రేవంత్ మాటలు విన్న తర్వాత నో చెప్పలేకపోయానని చెప్పారు. ప్రభుత్వం ఆవిష్కరించిన విజన్ డాక్యుమెంట్ కేవలం కార్పొరేట్ రాతలను, అంకెలను నమ్ముకుని తయారుచేసింది కాదన్నారు. ఇది ప్రజల కోసం రూపొందించిన బ్లూప్రింట్‌గా కొనియాడారు. స్వల్పకాలిక ప్రయోజనాల కోసం కాకుండా దీర్ఘకాలిక లక్ష్యాలతో ఈ ప్రణాళిక ఉందని ప్రశంసించారు. ప్రజలే కేంద్ర బిందువుగా సాగే ఈ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వామిని కావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు, ప్రభుత్వానికి తమ గ్రూపు తరఫున సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌ను ఆనంద్ మహీంద్రా ప్రశంసించారు. ఆయన 'గౌరవ సభకు నమస్కారం' అంటూ తెలుగులో ప్రసంగం మొదలుపెట్టి ఆకట్టుకున్నారు.

## 1,100 కోట్లతో కాఫీ ప్లాంట్

**ఆంధ్రజ్యోతితో వింటేజ్ కాఫీ ఎండీ బాలకృష్ణ**

**ఫ్రీజ్ కాఫీ ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడి**



హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రూ.1,100 కోట్లతో కాఫీ ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు.. కాఫీ రంగంలో తనదైన ముద్ర వేసిన 'వింటేజ్ కాఫీ' సంస్థ ప్రకటించింది. సంస్థ విస్తరణ ప్రణాళిక గురించి వింటేజ్ కాఫీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) బాలకృష్ణ కీలక విషయాలు వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. దేశ, విదేశీ పెట్టుబడుల విషయంలో గ్లోబల్ సమ్మిట్ మైల్ స్టోన్‌లా నిలుస్తుందని కితాబిచ్చారు. పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ అనువైన ప్రదేశమని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో సానుకూల దృక్పథంతో ఉన్నారని, పరిశ్రమ స్థాపన విషయంలో ఎలాంటి సమస్య వచ్చినా, ఏ సహకారం కావాలన్నా తనను సంప్రదించాలని సూచించారని చెప్పారు. పారిశ్రామికవేత్తలు ఏదైనా ఆలోచన చెబితే సానుకూలంగా తీసుకుంటున్నారని ప్రశంసించారు. సీఎంను కలిశాక పారిశ్రామికవేత్తల్లోనూ నమ్మకం ఏర్పడిందని చెప్పారు.

### ఫోర్త్ సిటీ మంచి ఆలోచన

హైదరాబాద్ మహానగరం ఒకవైపే కాకుండా అన్నివైపులకు విస్తరించేందుకు ఫోర్త్‌సిటీ ఏర్పాటు మంచి ఆలోచన అని బాలకృష్ణ ప్రశంసించారు. త్వరలోనే ఫోర్త్‌సిటీ హైదరాబాద్‌తో కలిసిపోతుందని అభిప్రాయపడ్డారు. 'మేము 25 ఏళ్ల నుంచి కాఫీ రంగంలో ఉన్నాం. తెలంగాణలో రూ.1,100 కోట్ల పెట్టుబడితో ఫ్రీజ్ డ్రైడ్ కాఫీ ప్లాంట్‌ను పెట్టబోతున్నాం. ఈ పద్ధతిలో మైనస్ 55 డిగ్రీల దగ్గర కాఫీ గింజలను ఫ్రీజ్ చేస్తాం. అందులో కాఫీ కంటెంట్ మాత్రమే ఉంచి.. వాటర్ మొత్తాన్ని బయటకు తీస్తాం. దీనివల్ల కాఫీలో ఉన్న అరోమా (సువాసన) బయటకు పోదు. కాఫీలో ఇది సూపర్ ప్రీమియం కాఫీ. ఇలాంటి ప్లాంట్ తెలంగాణలో ఇదే మొదటిది. దేశంలో నాలుగోది' అని వివరించారు.

TELANGANA RISING 2047

# విజన్ డాక్యుమెంట్ మనందరిది

**ఇది కేవలం పత్రం కాదు.. మన భవిష్యత్తుకు ప్రతిజ్ఞ**

**వివిధ వర్గాల జ్ఞానం, ఆశయాల సమష్టి సృష్టి**

గ్లోబల్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో..

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క వెల్లడి

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ రాష్ట్ర ప్రజలందరిది అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. డాక్యుమెంట్ రూపకల్పనలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. మంగళవారం గ్లోబల్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో, అంతకుముందు '3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా.. మూలధనం, ఉత్పత్తి' అనే అంశంపై నిర్వహించిన చర్చా గోష్ఠిలో ఆయన మాట్లాడారు. విజన్ డాక్యుమెంట్ కొంత మంది గదిలో కూర్చుని రూపొందించిందని కాదని, విస్తృతమైన, వైవిధ్యమైన వర్గాల జ్ఞానం, ఆశయాలు కలిసిన సమష్టి సృష్టి అని తెలిపారు. "ఈ పత్రం ఒక శాఖ పనికాదు. ఒక నిపుణుల బృందం రాసింది కాదు. నెలల తరబడి క్షేత్రస్థాయి పర్యటనలు, ప్రజా చర్చలు, స్థానికుల అభిప్రాయాలను సేకరించి రూపొందించిన పత్రం. రైతులు, యువత, వ్యాపారులు, కూలీలు వేలాదిగా తమ భవిష్యత్తుకు సంబంధించి సూచనలు చేశారు" అని డిప్యూటీ సీఎం వివరించారు. '3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా.. మూలధనం, ఉత్పత్తి' అనే అంశంపై చర్చా గోష్ఠిలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. పెట్టుబడులకు ఆవిష్కరణలు తోడైతేనే మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించగలుగుతామన్నారు. రాబోయే 22 ఏళ్లలో ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం 16 రెట్ల ఆర్థిక వృద్ధిని సాధించాల్సి ఉంటుందన్నారు.

**భవిష్యత్తుకు ఒక ప్రతిజ్ఞ..**

'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్ కేవలం ఒక పత్రం కాదని, మన భవిష్యత్తుకు ఒక ప్రతిజ్ఞ అని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేలా విప్లవాత్మక వృద్ధి సాధించాలంటే మన ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక సమీకరణాన్ని మార్చాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకోసం మూలధనం, ఆవిష్కరణల ఆధారంగా ఉత్పాదకతను పెంచాల్సి ఉంటుందన్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ర్యాంకులు పెరిగితే సంతోషించామని, కానీ.. ప్రపంచం చాలా వేగంగా మారిందని తెలిపారు. డీప్‌టెక్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ యుగంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనేది కనీస అర్హత అని, అది ఒక బేస్‌లైన్ మాత్రమేనని అన్నారు. ఆసియాలో ఇన్నోవేషన్ క్యాపిటల్ కావాలంటే 'ఈజ్ ఆఫ్ ఇన్నోవేటింగ్' వైపు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం రెగ్యులేటర్‌గా కాకుండా.. రిస్క్‌ను పంచుకునే క్యాపిటలిస్టుగా, ప్రజల కోసం రివార్డులు పొందే భాగస్వామిగా మారడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఉత్పాదకతలో ఆటోమేషన్‌ను జొప్పిస్తే ఉద్యోగాలు తగ్గిపోతాయన్న భయం ఉందని, దీనిని ఎలా ఎదుర్కోవాలన్నదే సమస్య అని అన్నారు. ఈ చర్చా గోష్ఠిలో సెంటర్ ఫర్ ఎనలైటికల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసన్న తంత్రి, యువ పారిశ్రామికవేత్త పరశురాం, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



గ్లోబల్ సమ్మిట్ చర్చా గోష్ఠిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రసన్న తంత్రి, పరశురాం

## అన్ని రంగాలు ఒకేసారి అభివృద్ధి చెందేలా ప్రణాళిక సిద్ధం

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**తెలంగాణ రోడ్ సెక్టార్ పాలసీని ఆవిష్కరించిన సీఎం రేవంత్**

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి వ్యూహం ఒక్క రంగానికి పరిమితం కాలేదని.. రోడ్లు, రైల్వే, విమానయాన ం, సాంకేతిక, మౌలిక వసతుల కల్పన సహా అన్ని రంగాలు ఒకేసారి అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించిన "కనెక్టెడ్ తెలంగాణ-ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్- అర్బన్ అండ్ రూరల్ కనెక్టివిటీ"పై జరిగిన ప్యానెల్ చర్చలో మంత్రి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రమంతా సమగ్రాభివృద్ధి జరిగేలా అనేక కొత్త సంస్కరణలు, పెద్ద ప్రాజెక్టులు ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా రోడ్ సెక్టార్ పాలసీని తీసుకువచ్చామని.. ఇది 'రైజింగ్ తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్'కు పునాది అని, రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక కేంద్రంగా మార్చడానికి ఇది కీలకమన్నారు. తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు పరిశ్రమలు, సరుకు రవాణా కోసం ప్రత్యేక రైల్వే కారిడార్లు, హై స్పీడ్, బుల్లెట్ రైలు ప్రాజెక్టులు సహా కొత్త రహదారుల ప్రాజెక్టులను ప్రతిపాదిస్తున్నామని, ఈ ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులకు విజ్ఞప్తి చేశారు. చర్చలో మోర్త్ అడిషనల్ డీజీ రాహుల్‌గుప్తా, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) ప్రతినిధి హరిభాస్కర్, లీ అసోసియేషన్ ఛైర్మన్ ఫణిరాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. తెలంగాణ రోడ్ సెక్టార్ పాలసీ డాక్యుమెంట్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా ఆవిష్కరించారు. ఇందులోని అంశాల గురించి సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్త ప్రాజెక్టులు, 2047 నాటికి రాష్ట్రంలో నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న రోడ్లు, అందుకయ్యే ఖర్చు, నిధుల సమీకరణ సహా పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ఆర్ అండ్ బీ పరిధిలో ప్రస్తుతం ఉన్న 46వేల కిలోమీటర్ల రహదారి వ్యవస్థను 2047నాటికి 1,15,000 కిలోమీటర్లకు పెంచడం లక్ష్యమని డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. 2047నాటికి రాష్ట్రంలో 1800 కిలోమీటర్ల ఎక్స్‌ప్రెస్ వేలను నిర్మించాలనుకుంటున్నారు.



గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించిన చర్చలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతరులు

# ప్రతి కుటుంబానికి ఇల్లు

**ఆర్థిక, సామాజిక స్థితిగతులతో నిమిత్తం లేకుండా అందరికీ.. అదే తెలంగాణ విజన్-2047 లక్ష్యం**

- భవిష్యత్ పట్టణీకరణ అవసరాలకు అనుగుణంగా విధాన రూపకల్పన
- గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి వారి ఆదాయ స్థాయి, సామాజిక నేపథ్యం ఎలా ఉన్నా గౌరవప్రదమైన, సురక్షితమైన, స్థిరమైన గృహవసతి కల్పించడమే తెలంగాణ విజన్-2047 లక్ష్యమని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 'అందరికీ అందుబాటు ధరల్లో ఇళ్లు.. దానికోసం పెట్టుబడులు' అంశంపై చర్చ జరిగింది. ఇందులో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... ఇందిరమ్మ పథకం కింద 3.5 లక్షల ఇళ్లు నిర్మాణదశలో ఉన్నాయని వివరించారు. హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ పథకాల ద్వారా మరో లక్ష గృహాలు లబ్ధిదారులకు అందించామని గుర్తు చేశారు. భవిష్యత్ పట్టణీకరణ అవసరాలకు అనుగుణంగా 2047 వరకూ దిశానిర్దేశం చేసే సమగ్ర గృహ విధానం ఆవశ్యకత ఉందన్నారు. ఈ మేరకు తెలంగాణ మోడల్‌ను రూపొందిస్తున్నామని, ఇది గృహ నిర్మాణ కార్యాచరణ మాత్రమే కాకుండా ఆర్థిక, సామాజిక బాధ్యతను ప్రతిబింబించే విధంగా ఉంటుందన్నారు. ఇది మూడు విధాలుగా ఉంటుందని తెలిపారు. కోర్ అర్బన్ (ప్రధాన పట్టణ ప్రాంతాల) జోన్‌లో మురికివాడల పునర్నిర్మాణం, మిక్స్‌డ్ హౌసింగ్, రెంటల్ హౌసింగ్, బ్రౌన్‌ఫీల్డ్ అభివృద్ధి మీద దృష్టి పెడతామన్నారు. పెరీ-అర్బన్ (పట్టణ శివారు) ప్రాంతాల్లో శాటిలైట్ టౌన్‌షిప్‌లు, గ్రీన్‌ఫీల్డ్ కాలనీలు, వాక్-టు-వర్క్ ఆధారిత గృహ నమూనాలు అమలు చేస్తామన్నారు. ఈ రెండింటికి వెలుపల ఉండే ప్రాంతాల్లో చిన్న, మధ్య తరహా పట్టణాల అభివృద్ధిని పరిశ్రమలు, లాజిస్టిక్ కారిడార్‌లు, పారిశ్రామిక వర్క్‌ఫోర్స్ అవసరాలతో అనుసంధానించి కార్మికులకు రెంటల్, వర్కర్ హౌసింగ్ విధానాలు అమలు చేయనున్నట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. ప్రస్తుత సమ్మిట్‌ను చర్చల వరకే పరిమితం చేయకుండా.. విధాన ప్రకటనలు, అమలు మార్గదర్శకాలు, నమూనా ప్రాజెక్టులు, బడ్జెట్ కేటాయింపుల రూపంలో నేరుగా అమల్లోకి తీసుకురావడమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. కాగా, ఇదే చర్చలో పలువురు ఇతరులు పాల్గొన్నారు. ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ పీఎస్ఎన్ రావు మాట్లాడుతూ లగ్జరీ హౌసింగ్ డిమాండ్ తగ్గుముఖం పట్టిందని, భవిష్యత్తులో డెవలపర్లు చిన్న యూనిట్లు, ఒక్క గది గృహాలు నిర్మించాల్సి ఉంటుందన్నారు. ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి అభిజిత్ శంకర్ మాట్లాడుతూ.. నగర శివార్లలో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తే ప్రైవేటు రంగం ముందుకు వచ్చి నిర్మాణాలు చేపడుతుందని సూచించారు. ఇల్లు కొనుగోలు కోసం ఒక కుటుంబం చెల్లించాల్సిన ఈఎంఐ.. ఆ కుటుంబ ఆదాయంలో 40 శాతంలోపు ఉన్నప్పుడు మాత్రమే అది అందుబాటు ధరలో ఉన్న ఇల్లు అవుతుందని చెప్పారు. క్రెడాయ్ ప్రెసిడెంట్ జి.రాంరెడ్డి మాట్లాడుతూ.. పీపీపీ మోడల్‌లో ప్రభుత్వం భూములను అందిస్తే.. మధ్యతరగతికి ఇళ్లను నిర్మించడానికి డెవలపర్లు ముందుకొస్తారన్నారు.



అనిల్‌కుంబ్లేను సన్మానిస్తున్న మంత్రి శ్రీహరి, చిత్రంలో జయేశ్‌రంజన్, శివసేనారెడ్డి, పీవీ సింధు, ఏటీ రాయుడు, గుత్తా జ్వాల

## 2036 ఒలింపిక్స్‌లో పతకాల సాధనే లక్ష్యం

- వెయ్యి ఎకరాల్లో శాటిలైట్ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు
- ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సదస్సులో మంత్రి శ్రీహరి

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగానే కొత్త క్రీడా పాలసీని ప్రకటించామని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడాకారుల ప్రాతినిధ్యం పెంచడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని తెలిపారు. 2036లో నిర్వహించే ఒలింపిక్స్‌లో ఎక్కువ పతకాలు సాధించడమే ధ్యేయంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సదస్సులో మంత్రి మాట్లాడుతూ క్రీడాకారులు, పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వ పెద్దలను కమిటీ సభ్యులుగా పెట్టి తెలంగాణ స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు చేయడమే కాకుండా నిధుల సమీకరణ కోసం స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అథారిటీల ద్వారా పాఠశాల స్థాయి నుంచే క్రీడా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. వెయ్యి ఎకరాల్లో శాటిలైట్ స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేసి, అంతర్జాతీయ స్థాయి క్రీడలకు హైదరాబాద్‌ను ఆతిథ్య కేంద్రంగా తీర్చిదిద్దనున్నామని చెప్పారు. మంత్రి అజారుద్దీన్, మాజీ క్రికెటర్లు అనిల్ కుంబ్లే, అంబటి తిరుపతి రాయుడు, బాడ్మింటన్ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్, పీవీ సింధు, గుత్తా జ్వాల పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీతో 13 లక్షల ఉద్యోగాలు

**13,500 ఎకరాల్లో నిర్మితమయ్యే ఆ నగరం ఓ ఆర్కిటెక్చరల్ అద్భుతం.. 9 లక్షల మంది జనాభాకు ఆవాసాలు**

- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అనుబంధంగా లైఫ్ సైన్సెస్ వర్సిటీ
- ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు



గ్లోబల్ సమ్మిట్ చర్చలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా నిలిచేలా తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ ఓ ఆర్కిటెక్చరల్ అద్భుతంగా నిలుస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. 13,500 ఎకరాల్లో ఆరు జోన్లుగా ఏర్పాటవ్వనున్న ఫ్యూచర్ సిటీతో 13 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని, ఆ నగరంలో 9 లక్షల మందికి ఆవాసం కల్పించబోతున్నామని తెలిపారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో ఫ్యూచర్ సిటీని కార్బన్ రహిత నగరంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, యాజ్ ఏ మ్యాగ్నెట్ ఫర్ 3 ట్రిలియన్ డాలర్స్ తెలంగాణ' అంశంపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. ఏఐ, హెల్త్ సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్, క్రీడలు, డేటా సెంటర్, అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థలు అనే ఆరో జోన్లుగా ఫ్యూచర్ సిటీ ఉంటుందని వివరించారు. ఆయా రంగాలకు చెందిన పరిశ్రమలు, సంస్థల ఏర్పాటుతో ఫ్యూచర్‌సిటీలో 13 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. 9 లక్షల మంది జనాభా నివాసానికి అనుగుణంగా గృహ నిర్మాణ సంస్థలు నివాస సముదాయాలు అభివృద్ధి చేస్తాయని పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కార్యక్రమాలు మరో నెల రోజుల్లో ప్రారంభవుతాయని ప్రకటించారు. డేటా సెంటర్ల కోసం ఫ్యూచర్ సిటీలో కేటాయించిన 400 ఎకరాల్లో వచ్చే ఫిబ్రవరి నెలాఖరులో నిర్మాణాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ' సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ఈ జీరో కార్బన్ సిటీ ప్రపంచంలోనే ప్రఖ్యాత నగరంగా భాసిల్లుతుంది. ఇక్కడ కురిసే ప్రతీ చినుకు భూమిలో ఇంకిపోయేలా రెయిన్ హార్వెస్టింగ్ జరుగుతుంది. భూగర్భ జలాలకు కొదవ లేకుండా చేస్తాం. ఫ్యూచర్ సిటీలో లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో నూతన పరిశోధనలు, మ్యానుఫ్యాక్చరింగ్ కేంద్రాలు ఉంటాయి" అని శ్రీధర్ బాబు వివరించారు. ఇక, "జీనోమ్ వ్యాలీ బియాండ్ యాక్సిలరేటింగ్ ఇన్నోవేషన్ ఇన్ లైఫ్ సైన్సెస్ ఇండస్ట్రీస్" ప్యానెల్ చర్చలో మాట్లాడుతూ.. లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణను ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అనుబంధంగా లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. లైఫ్ సైన్సెస్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం రూపొందిస్తోన్న లైఫ్ సైన్సెస్ పాలసీ 2.0ను దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆవిష్కరిస్తామని ప్రకటించారు.

## సంక్షేమంలో దేశానికే ఆదర్శం

**ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తున్నాం**

**ప్యానల్ చర్చలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సామాజిక సమతుల్యత పాటిస్తూ అన్ని వర్గాలకు లబ్ధి చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. సంక్షేమ శాఖపై జరిగిన ప్యానల్ చర్చల్లో మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడారు. జనాభాలో 80 శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమం లేకుండా అభివృద్ధి జరగటం అసాధ్యమన్నారు. నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, రిజర్వేషన్ల అమలు, ఉన్నత విద్య, విదేశీ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యను అందిస్తున్నామని తెలిపారు. నాణ్యమైన విద్యతో తెలంగాణ సమాజం మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, తెలంగాణలో ట్రాన్స్‌జెండర్లకు కూడా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రభుత్వం తమ సంక్షేమం కోసం కృషి చేస్తోందని ట్రాన్స్‌జెండర్, హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ రచన అన్నారు.



టూరిజంపై చర్చలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు

## ఎకో టూరిజాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం

- చారిత్రక, పౌరాణిక ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం: మంత్రి సురేఖ

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు ప్రకృతిని కాపాడుతూనే మరోవైపు స్థానిక ప్రజల జీవనోపాధిని పెంచే బాధ్యతాయుత ఎకో టూరిజాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోందని దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ తెలిపారు. సరస్సులు, గడ్డి భూములు, జాతీయ ఉద్యానవనాలు, అమ్రాబాద్ - కవ్వాల్ వంటి ప్రముఖ టైగర్ రిజర్వులతో రాష్ట్రం సహజసిద్ధమైన సంపదను కలిగి ఉందన్నారు. మొత్తం 7,200 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రక్షిత వన్యప్రాంతాలు, సహజసిద్ధమైన ప్రకృతి ఉండడంతో ఎకో టూరిజం అభివృద్ధికి విస్తృతమైన అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 'ఎక్స్‌పీరియన్స్ తెలంగాణ, హెరిటేజ్, కల్చర్, ఫ్యూచర్ రెడీ టూరిజం" అనే అంశంపై జరిగిన చర్చలో మంత్రి సురేఖ మాట్లాడారు. ప్రైవేటు రంగంతో కలిసి కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 13 ఎకో టూరిజం సర్క్యూట్లు ఏర్పాటు చేయగా, రామప్ప-శ్రీశైలం లాంటి వారసత్వ-ఆధ్యాత్మిక కేంద్రాలను ప్రకృతి పర్యాటకంతో అనుసంధానిస్తున్నామన్నారు.

## ఆర్థిక రంగానికి ఊతం పర్యాటకమే: మంత్రి జూపల్లి

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగం కీలకం కానుందని, ఆర్థిక రంగానికి పర్యాటక రంగం ఊతంగా నిలుస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 2047 నాటికి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో పర్యాటక రంగం వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. 'తెలంగాణ అనుభవాలు - వారసత్వం, సంస్కృతి - ఫ్యూచర్ రెడీ టూరిజం' అనే అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో మంత్రి జూపల్లి కీలకోపన్యాసం చేశారు. ప్రపంచవ్యాప్తంగా వనరులు తక్కువగా ఉన్న అనేక దేశాలు పర్యాటకాన్ని ప్రధాన వనరుగా చేసుకొని అద్భుతమైన ఆర్థిక పురోగతి సాధించాయని చెప్పారు. తెలంగాణలోనూ ఈ రంగానికి అపారమైన సామర్థ్యం ఉందని పేర్కొన్నారు.

**పర్యాటకంలో రూ.7.045 కోట్ల పెట్టుబడులు**

తెలంగాణ పర్యాటక రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి పలు కంపెనీలు ముందుకు వచ్చాయి. పర్యాటక రంగంలో 7.045 కోట్లకు పైగా పెట్టుబడులకు అంగీకారం కుదిరింది. సమ్మిట్ ప్రాంగణంలో సీఎం రేవంత్, మంత్రి జూపల్లి సమక్షంలో దేశీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పెట్టుబడులకు సంబంధించి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులతో 40 వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంటుంది. ఇందులో ప్రత్యక్షంగా 10 వేల మందికి, పరోక్షంగా మరో 30 వేల మందికి ఉపాధి లభిస్తుందని ఆశిస్తున్నారు.

## నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యం

- గ్లోబల్ సమ్మిట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్ విజన్-2047లో సంక్షేమశాఖల పై జరిగిన చర్చలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్‌లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. బడుగు, బలహీన దళిత, మైనార్టీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంతో పాటు వారి ఉన్నత విద్య, విదేశీ విద్యకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు.

# నదీ సహజత్వం కాపాడేలా మూసీ పునర్జీవం



మూసీ పునర్జీవమైతే ఇలా ఉంటుంది

- చర్చాగోష్ఠిలో వక్తలు

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నది సహజత్వాన్ని కాపాడేలా మూసీ పునర్జీవం ఉండాలని.. నదీ ప్రవాహానికి స్వేచ్ఛనిస్తేనే నగరానికి శ్వాస తీసుకునే అవకాశం ఉంటుందని మూసీ పునర్జీవన చర్చలో పాల్గొన్న వక్తలు పిలుపునిచ్చారు. పునర్జీవన పనులు కేవలం నిర్మాణాలకే పరిమితం కాకుండా నదీ జీవనం, దాని పరీవాహక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాల పెంపుదలకు దోహద పడటంతోపాటు సంస్కృతీ సంప్రదాయాలు, నాగరికతకు అద్దంపట్టేలా ఉండాలని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవంపై జరిగిన చర్చా కార్యక్రమాన్ని ప్రారంభించిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) ఎండీ నరసింహారెడ్డి.. నదిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేల కుటుంబాల ఉపాధి దెబ్బ తినకుండా పునర్జీవన పనులు, అభివృద్ధి పనులు చేపట్టడానికి అభిప్రాయాలు తెలపాలని నిపుణులను కోరారు. మూసీ పునర్జీవం ప్రాజెక్టు కోసం నదీ కాలుష్యం, వరద తీవ్రతపై అధ్యయనం చేశామని, 55 కి.మీ మేరకు సర్వే చేసి, అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ నదులు, చెరువులు, ఇతర జల వనరుల సంరక్షణకు రాజ్యాంగంలోని 14,15,21 అధికరణాల అమలుకు శ్రద్ధ వహించడం అభినందనీయమన్నారు. మూసీ పునర్జీవ ప్రణాళిక చాలా అద్భుతమన్న రాజేంద్ర సింగ్.. నది పరిశుభ్రంగా ఉండటంతోపాటు ప్రవాహానికి ఆటంకాల్లేకుండా అభివృద్ధి చేస్తే మూసీ నది విజయవంతమైన జీవన వ్యవస్థగా మారుతుందని పేర్కొన్నారు. ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) ప్రతినిధి ఎలెక్సియా మిచెలెస్ మాట్లాడుతూ.. జీవనోపాధులపై ప్రతికూల ప్రభావం పడకుండా.. నగర పురోభివృద్ధికి దోహద పడేలా.. పర్యావరణ, సామాజిక, ఆర్థిక మార్పునకు ప్రతీకగా మూసీ అభివృద్ధి నిలవాలన్నారు. నగరాభివృద్ధి, పర్యావరణ సమతుల్యతలో మూసీ కీలకం కావాలన్న ఎలెక్సియా మిచెలెస్.. 2 దశాబ్దాలుగా వేగంగా జరిగిన హైదరాబాద్ అభివృద్ధి ప్రభావం ఆ నదిపై పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం, వరద, ముంపు తీవ్రత పెరుగుదల, ఘన వ్యర్థాలు, తీరంలో అనధికారిక నిర్మాణాలు నదీ సహజత్వాన్ని దెబ్బ తీశాయన్నారు. చర్చాగోష్ఠిలో పర్యావరణవేత్త తపస్, క్లైమేట్ చేంజ్-డీఆర్‌ఆర్ స్పెషలిస్టు డాక్టర్ శ్రీజా ఎస్ నాయర్, ఫ్లడ్ మేనేజ్‌మెంట్ ప్రముఖుడు అర్జున్ శశిధరన్ తదితర నిపుణులు పాల్గొన్నారు.

- గాంధీ సరోవర్ ఆన్ స్క్రీన్.. వినూత్నంగా ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వం మూసీ పునరుజ్జీవనాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఆ ప్రాజెక్టు పూర్తయ్యాక ఎలా ఉంటుందో ముందే చూపించేలా గ్లోబల్ సమ్మిట్ వేదిక దగ్గర ప్రత్యేక స్క్రీన్‌ను ఏర్పాటు చేసింది. ఆ స్క్రీన్‌పై మూసీ పునరుజ్జీవనం, గాంధీ సరోవర్, రాజేంద్రనగర్ డెవలప్‌మెంట్, ఈస్ట్-వెస్ట్ కారిడార్, మీర్‌అలాం ట్యాంక్ ఏరియా డెవలప్‌మెంట్ చూసేలా వినూత్న ఏర్పాటు చేశారు. ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన ఆ స్క్రీన్ వద్ద ఆయా ప్రాజెక్టుల పేర్లతో కూడిన ప్రత్యేక మ్యాగ్నెటర్‌లను ఉంచారు. వాటిలో చూడాలనుకుంటున్న ప్రాంతానికి సంబంధించిన మ్యాగ్నెటర్‌ను ఆ స్క్రీన్‌పై సూచించిన రింగులో ఉంచగానే దాని వివరాలు అన్నీ వీడియో, ఫొటో రూపంలో వెంటనే దర్శనమిస్తున్నాయి. దాంతో ప్రాంగణానికి వచ్చిన చాలా మంది ఆయా ప్రాంతాలను తిలకించారు.


పేదరికం, జాతి వివక్ష నిర్మూలనకే..

# విజన్ డాక్యుమెంట్

## కుగ్రామం నుంచి వచ్చిన నేను వాటిని దగ్గరగా చూశా

**నాకు ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చిన నిరుపేదలకు న్యాయం చేయాలన్నదే నా నిబద్ధత**

**సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో సీఎం రేవంత్**



సీఎం రేవంత్‌కు విజన్ డాక్యుమెంట్ ప్రతిని అందజేస్తున్న రోబో



హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికం, జాతి వివక్షల నిర్మూలన కోసమే తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. తనకు సీఎంగా అవకాశం ఇచ్చిన నిరుపేదలకు న్యాయం చేయాలన్నదే తన నిబద్ధత అని చెప్పారు. ఈ విజన్ డాక్యుమెంట్‌తో.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని సాధించి, ప్రధాని మోదీ చేపట్టిన వికసిత్ భారత్‌లో ముందుభాగాన నిలవాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో మంగళవారం జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో విజన్ డాక్యుమెంట్‌ను సీఎం ఆవిష్కరించారు. టోనీ బ్లెయిర్, శంతన్ నారాయణ్‌ల దగ్గరి నుంచి ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగస్వాములైన వారందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకొంటున్నానన్నారు. ఈ డాక్యుమెంట్ రూపకల్పనకు.. ఆన్‌లైన్ ద్వారా సుమారు 4 లక్షల మంది తమ సలహాలూ, సూచనలు ఇచ్చారని తెలిపారు. రైతులు, సామాన్యులు, మహిళలు, విద్యార్థులు తదితరులందర్నీ భాగస్వాములను చేసి విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా, ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సినీ హీరో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### ఇంకా ఎదురుచూపులు..

తెలంగాణ ప్రాంత మట్టికి గొప్ప చైతన్యం ఉందని సీఎం రేవంత్ గుర్తుచేశారు. జల్, జంగల్, జమీన్ కోసం కొమురం భీం పోరాటం చేస్తే.. భూమి, భుక్తి, విముక్తి, పేదరిక నిర్మూలన కోసం సాయుధ రైతాంగ పోరాటంలో వేలాది మంది నేలకొరిగిన చరిత్ర ఈ ప్రాంతానికుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజల ఆకాంక్షను సోనియా, మన్మోహన్ సింగ్ నెరవేర్చారని పేర్కొన్నారు. ప్రపంచంలోనే ఉన్నతమైన అభివృద్ధి సాధించగలిగే శక్తి, వనరులు ఉన్నప్పటికీ.. ఆశించిన స్థాయిలో ఈ గడ్డపై ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి జరగలేదన్నారు. ఇప్పటికీ తెలంగాణ ప్రాంతం స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ఎదురుచూస్తూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో.. ప్రధాని మోదీ 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధించడం లక్ష్యంగా పెట్టుకుని వికసిత్ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారని గుర్తు చేసిన సీఎం.. ఆ కార్యక్రమంలో రాష్ట్రం ముందుభాగాన నిలిచి, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధించాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు చెప్పారు. దేశ జీడీపీలో ప్రస్తుతం 5 శాతంగా ఉన్న తెలంగాణ వాటాను.. ఈ విజన్ డాక్యుమెంట్‌తో పది శాతానికి చేర్చాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. ప్రపంచంతో అనుసంధానం కావడానికి మౌలిక వసతులను అభివృద్ధి చేసి పెట్టుబడులను ఆహ్వానించాలనుకుంటున్నట్లు చెప్పారు.

### ఒక్కో స్కూల్‌కూ రూ.200 కోట్లు..

జాతి వివక్ష ఉండకూడదంటున్న ప్రభుత్వాలే.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం వేర్వేరుగా గురుకులాలను, హాస్టళ్లను ఏర్పాటు చేశాయని, అవి వేర్వేరుగా ఉంటే వివక్ష ఎట్లా పోతుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అందుకే అన్ని వర్గాల్లోని అందరు విద్యార్థులూ ఒక్క చోట కలిసి చదివేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక చేశామన్నారు. ఒక్కో స్కూల్ నిర్మాణానికీ రూ.200 కోట్ల దాకా ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ఆ స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకే రూ.20 వేల కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు. సంక్షేమం కోసం చేసే ఖర్చు బాధ్యత అయితే.. విద్యపైన చేసే ఖర్చు భవిష్యత్తుపై పెట్టుబడి అని సీఎం అభివర్ణించారు. ప్రస్తుత విద్యా విధానంలో నాణ్యత, నైపుణ్యాలు లేనందునే యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీలను ప్రారంభించినట్లు చెప్పారు.

### వివక్షను దగ్గర్నుంచి చూశా!

ఒక కుగ్రామంలోని రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను చిన్నతనం నుంచి పేదరికం, వివక్షతలను దగ్గరనుంచి చూశానని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. విద్య, యువతకు ఉపాధి కల్పన ద్వారా పేదరికాన్ని నిర్మూలించాలనుకుంటున్నట్లు చెప్పారు. అలాగే మెరుగైన వైద్యాన్నీ అందివ్వాలనుకుంటున్నామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మనిషి జీవిత కాలం సగటున 32 ఏళ్లుగా ఉంటే.. నెహ్రూ విజన్ ఫలితంగా అది ప్రస్తుతం 73 సంవత్సరాలకు చేరుకుందన్నారు. భవిష్యత్తులో అది వందేళ్లకూ చేరుకుంటుందన్నారు. అభివృద్ధి అన్నది కుగ్రామం వరకూ చేరాలన్నారు. పేదరికం అన్నది కొందరికి ఎక్స్‌కర్షన్ లాంటిదని, పేదలు ఎలా ఉంటారో చూసేందుకు నగరం నుంచి బెంజ్ కారులో వచ్చి చూసి వెళ్లి పోతారని అన్నారు. కానీ చిన్న గ్రామంలో, రైతు కుటుంబంలో పుట్టి... ప్రభుత్వ స్కూల్లో తెలుగు మీడియంలో చదివిన తనకు పేదలకు, నిరుద్యోగులకు ఏం కావాలో, వారు ఎలా ఆలోచిస్తారో తెలుసునన్నారు. ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, బలహీన వర్గాల సమస్యలూ తెలుసునన్నారు. ఆయా వర్గాల వారితో తనకు వ్యక్తిగత సంబంధాలూ ఉన్నాయన్నారు. 2006లో జడ్పీటీసీగా ప్రస్థానాన్ని ప్రారంభించి 17 ఏళ్లలో తెలంగాణ సీఎం అయిన తనకు రాజకీయ వారసత్వం కూడా లేదని గుర్తుచేశారు. రాష్ట్రంలోని నిరుపేదలకు న్యాయం జరగాలన్నదే తన పాలసీ డాక్యుమెంట్ అని చెప్పారు.

# అంచనాలకు మించి సక్సెస్

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం

- ఫ్యూచర్‌సిటీకి విస్తృత ప్రచారం
- సమ్మిట్‌కు 20 రోజుల్లోనే ఏర్పాట్లు
- అబ్బురపరిచిన ముగింపు వేడుకలు
- నేటి నుంచి సామాన్యులకూ ప్రవేశం




హైదరాబాద్/ (ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)/కుందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అంచనాలకు మించి విజయవంతమైంది. మంగళవారం రెండో రోజు కూడా సమ్మిట్ సందడిగా సాగింది. రెండు రోజుల్లో రూ.5 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలు రావడంతో ప్రభుత్వం ఉబ్బితబ్బిబ్బవుతోంది. ఏర్పాట్ల నుంచి నిర్వహణ వరకు సమ్మిట్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఈ సమ్మిట్ కారణంగా మీర్‌ఖాన్‌పేట ప్రాంతంలో ప్రభుత్వం నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీకి కూడా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. తారల తళుకులు.. రెండో రోజు సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలతోపాటు సినీ, క్రీడా రంగ ప్రముఖులు హాజరయ్యారు. మహీంద్రా కంపెనీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా, సినీ ప్రముఖులు చిరంజీవి, అజయ్ దేవగన్, అర్జున్ కపూర్, అల్లు అరవింద్, సురేష్ బాబు, దిల్ రాజు, జెనీలియా, అక్కినేని అమల తదితరులు సందడి చేశారు. అలాగే మంత్రి అజారుద్దీన్‌తోపాటు ప్రముఖ క్రీడాకారులు అనిల్ కుంబ్లే, పుల్లెల గోపీచంద్, పీవీ సింధు, గుత్తా జ్వాల, బోరియా మంజూదార్, అంబటి రాయుడు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం కూడా వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సీఎం సమక్షంలో పలు కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. 'దావోస్ సదస్సు కంటే తెలంగాణ సమ్మిట్ బాగుందని విదేశీ ప్రతినిధులు చెబుతున్నారు.. బీఆర్‌ఎస్ వాళ్లకు ఇంట్లో కూర్చుని ఏడవడం తప్ప మరో దారి లేదు' అని ఎద్దేవా చేశారు.

### 20 రోజుల్లోనే ఏర్పాట్లు

ఎంతో అట్టహాసంగా నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌కు ప్రభుత్వం కేవలం 20 రోజుల్లోనే ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం అధికాలు, సిబ్బంది అహర్నిశలు శ్రమించారు. ముఖ్యంగా టీజీఐఐసీ ఎండీ, ఫ్యూచర్ సిటీ ఎండీ శశంక, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, మూసీ రివర్ ప్రాజెక్టు ఎండీ నరసింహారెడ్డితో పాటు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు సకాలంలో ఏర్పాట్లు పూర్తిచేసేందుకు రాత్రింబవళ్లు కష్టపడ్డారు. గ్లోబల్ సమ్మిట్ ముగింపు వేడుకలను ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించింది. సోమవారం ప్రారంభమైన సమ్మిట్.. మంగళవారం రాత్రి 9 గంటలకు ముగిసింది. ముగింపు వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. ఈ డాక్యుమెంట్ తొలి ప్రతిని సీఎంకు రోబో ఎక్స్‌మ్యాన్ అందివ్వటం విశేషం.

### నేటి నుంచి సామాన్యులకు ఎంట్రీ

బుధవారం నుంచి 13వ తేదీ వరకు సామాన్యులకు కూడా సమ్మిట్ ప్రాంగణంలోకి ప్రవేశం కల్పించనున్నారు. ఇందుకోసం హైదరాబాద్‌లోని చార్‌మినార్, ఎంజీబీఎస్, సికింద్రాబాద్, మెహిదీపట్నం, ఎల్బీనగర్, జేబీఎస్ తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ ఉచిత బస్సులు నడుపనుంది. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 52 బస్సులు నడుపనున్నారు.





భావితరాల కోసం రాబోయే రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని సమగ్రంగా, సమ్మిళితంగా, సుస్థిరంగా అభివృద్ధి చేసే దిశగా 'తెలంగాణ రైజింగ్- 2047 డాక్యుమెంట్'ను రూపొందించారు. రాష్ట్రం మొత్తాన్ని మూడు జోన్లుగా విభజించి, మూడు సూత్రాల ఆధారంగా, పది కీలక వ్యూహాలతో.. నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలు పొందుపరిచారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందించటం ప్రధాన లక్ష్యం. ఈ డాక్యుమెంట్‌ను సీఎం మంగళవారం విడుదల చేశారు.2047 నాటికి సాధించాలనుకుంటున్న లక్ష్యాలను ఈ డాక్యుమెంట్‌లో రాష్ట్రప్రభుత్వం నిర్దేశించుకుంది. డాక్యుమెంట్ తయారీలో సీఎం రేవంత్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మంత్రులు, అన్ని విభాగాల అధికారులు, మేధావులు, నిపుణుల సలహాలు తీసుకున్నారు.. 4 లక్షల మంది ఆకాంక్షలు, అభిప్రాయాలతో ఈ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

# 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం..

## మూడంచెల వ్యూహం





భావితరాల కోసం తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్

### లక్ష్యసాధనకు 3 మూల స్తంభాలు

1. ఆర్థిక అభివృద్ధి
2. సమ్మిళిత అభివృద్ధి
3. సుస్థిర అభివృద్ధి

### 3 వ్యూహాలు

ఆర్థిక అభివృద్ధి - ఆవిష్కరణలు, ఉత్పాదకత ఆధారిత వృద్ధి ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించడం.
సమ్మిళిత అభివృద్ధి: యువత, మహిళలు, రైతులు, అణగారిన వర్గాలతో సహా సమాజంలోని అన్ని వర్గాలకు వృద్ధి ఫలాలు అందేలా చూడటం.
సుస్థిర అభివృద్ధి: అన్ని రంగాలలో సుస్థిరతను తీసుకురావటం, 2047 నాటికి నెట్-జీరో ఉద్గారాల లక్ష్యాన్ని సాధించడం.

### 3 ఉత్ప్రేరకాలు

1. సాంకేతికత... ఆవిష్కరణ: పాలన, పరిశ్రమలు, సేవలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం.
2. సమర్థవంతమైన ఆర్థిక వనరులు: పెట్టుబడులను ఆకర్షించడానికి, ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడానికి వినూత్న ఆర్థిక నమూనాలను రూపొందించడం.
3. సుపరిపాలన: పారదర్శక, జవాబుదారీ, పౌర-కేంద్రీకృత పాలనను అందించడం.

### మూడంచెల వ్యూహం

అభివృద్ధి ప్రామాణికంగా తెలంగాణను మూడు జోన్‌లుగా విభజించటం

**1** కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్): 160 కి.మీ.ల ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న హైదరాబాద్ సిటీ ప్రాంతం. సేవల విస్తరణకు ప్రాధాన్యం. నెట్-జీరో సిటీగా, ప్రపంచ స్థాయి నాలెడ్జ్ ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి.

**2** పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్): ఓఆర్‌ఆర్‌కు, 360 కి.మీ.ల పరిధి ఉన్న ప్రాంతీయ రింగ్ రోడ్‌కు మధ్య ఉన్న జోన్. తయారీ రంగానికి కేంద్రంగా ఉంటుంది. పారిశ్రామిక క్లస్టర్లు, లాజిస్టిక్స్ హబ్‌ల ఏర్పాటు.

**3** రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్): ప్రాంతీయ రింగ్ రోడ్ దాటి, రాష్ట్ర సరిహద్దుల వరకు విస్తరించి ఉన్న ప్రాంతం. వ్యవసాయం, హరిత ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యం.




### 10 కీలక వ్యూహాలు

ఈ లక్ష్యాలను సాధించడానికి 10 కీలక వ్యూహాలను డాక్యుమెంట్‌లో పొందుపరిచారు.

1. మూడు జోన్లుగా రాష్ట్రం: అభివృద్ధికి నమూనా.
2. విచక్షణ నుండి విధానానికి: పెట్టుబడుల ఆకర్షణ, పాలనలో పారదర్శకత. విధానపరమైన నిర్ణయాలను ప్రోత్సహించడం.
3. గేమ్-ఛేంజర్ ప్రాజెక్టులు: భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, డ్రై పోర్ట్, బందర్ పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే, రీజినల్ రింగ్ రోడ్, రింగ్ రైలు, బుల్లెట్ రైలు కారిడార్లు తదితర ప్రాజెక్టులు.
4. సమర్థ పాలన: డిజిటల్ గవర్నమెంట్ వంటి కార్యక్రమాలతో పాలనా సామర్థ్యాన్ని పెంచడం.
5. నాలెడ్జ్ హబ్: ప్రపంచస్థాయి విద్యా, పరిశోధన సంస్థలను ఆకర్షించడం.
6. సుస్థిర సంక్షేమం: మహిళలు, రైతులు, యువతపై ప్రత్యేక దృష్టి. ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, అందరికీ సమాన అవకాశాలు.
7. అభివృద్ధి నిధులు: మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం.
8. పర్యావరణం, సుస్థిరత: వాతావరణ మార్పులతో వాటిల్లే నష్టాలను తగ్గించడం. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం.
9. సంస్కృతి: రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని, కళలు, పర్యాటకాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించడం.
10. ప్రజల యొక్క, ప్రజల కోసం, ప్రజలతో: పాలనలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంపొందించటం, వారి ఆకాంక్షలను ప్రతిబింబించే విధానాలు రూపొందించడం.

### ఐటీ సేవల రంగమే ఊతం

'తెలంగాణ రైజింగ్-2047' డాక్యుమెంట్‌లో నిర్దేశించుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) వంటి సేవారంగమే ఊతమివ్వనుంది. ఈ ఒక్క రంగం నుంచే 1.95 ట్రిలియన్ డాలర్ల స్థూల విలువ జోడింపు (జీవీఏ) ఉంటుందని ప్రభుత్వం ఆశిస్తోంది. తర్వాతి స్థానంలో ఉన్న పారిశ్రామిక రంగం నుంచి 0.5 ట్రిలియన్ డాలర్ల జీవీఏ, వ్యవసాయ రంగం నుంచి 0.33 ట్రిలియన్ డాలర్ల జీవీఏ నమోదు కానుందని అంచనా. మిగతా 0.22 ట్రిలియన్ డాలర్లు పన్నులు, సబ్సిడీల నుంచి సమకూరనున్నాయని ప్రభుత్వం తన డాక్యుమెంట్‌లో వెల్లడించింది. సేవారంగంలో స్టార్టప్‌లు, పరిశోధన సంస్థలకు ఊతమివ్వడం, ఫ్రాంటియర్ టెక్నాలజీని వినియోగించడం, ఎగుమతులకు కొత్త మార్కెట్లను సృష్టించుకోవడం ద్వారా జీఎస్‌డీపీకి దీని ద్వారా ఊతమివ్వాలనుకుంటున్నట్లు తెలిపింది.



# డ్రోన్లతో గిన్నిస్ రికార్డు రైజింగ్

## 3వేల డ్రోన్లతో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్.. జాయిన్ ది రైజ్' నినాదం ప్రదర్శన

**ఆకట్టుకున్న వివిధ సంక్షేమ పథకాల ఆకృతులు.. ఘనంగా సదస్సు ముగింపు కార్యక్రమం**









హైదరాబాద్/రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ సదస్సు ముగింపు కార్యక్రమంలో భారీ డ్రోన్‌షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 3 వేల డ్రోన్లను ఉపయోగించి.. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్.. జాయిన్ ది రైజ్' నినాదం, దానిపైన పెద్దగా ఒకటి అంకె, దాని మధ్యలో తెలంగాణ మ్యాప్‌తో చేసిన డ్రోన్ విన్యాసం.. 'తెలంగాణ ఈజ్ రైజింగ్.. కమ్.. జాయిన్ ది రైజ్' సుదీర్ఘ వాక్యం గిన్నిస్‌బుక్ రికార్డులు బద్దలు కొట్టాయి. గతంలో అబుధాబిలో 2,131 డ్రోన్లతో సుదీర్ఘ వాక్యాన్ని ప్రదర్శించిన రికార్డు ఉండగా.. ఇప్పుడు తెలంగాణ రైజింగ్ షో దాన్ని బద్దలు కొట్టింది. గిన్నిస్ బుక్ ప్రతినిధుల నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రికార్డు ధ్రువపత్రాన్ని అందుకున్నారు. ఇక తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, నిర్దేశించుకున్న లక్ష్యాలను ప్రతిబింబించేలా చేసిన డ్రోన్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ షో అనంతరం బాణసంచా ప్రదర్శన అలరించింది. బాణసంచా మెరుపులతో సదస్సు ప్రాంగణం కాంతులీనింది. సదస్సు ప్రాంగణం సమీపంలోని బేగరికంచ, మీర్‌ఖాన్‌పేట గ్రామాల ప్రజలు కూడా అక్కడి నుంచే డ్రోన్ షో, బాణసంచా కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ఇక సదస్సు ముగింపు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను బాగా ఆకట్టుకున్నాయి.గ్లోబల్ సదస్సుకు దారితీసే మార్గాల్లో, సదస్సు వద్ద భద్రత, ట్రాఫిక్ చర్యలను పకడ్బందీగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు శ్రీశైలం హైవే వేలాది వాహనాలతో కిక్కిరిసింది.







## ప్రమాదంపై దర్యాప్తు జరపడం లేదెందుకు?

» ఏమైనా ఒత్తిళ్లు ఉన్నాయా? 12 శాఖలు తనిఖీలు చేశాయా?

» 'సిగాచి'పై అధికారులను సూటిగా ప్రశ్నించిన ధర్మాసనం

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిగాచీ పరిశ్రమ పేలుడు దుర్ఘటనపై దర్యాప్తు జరుగుతున్న తీరు సక్రమంగా లేదంటూ హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అధికారులపై ప్రశ్నల బాణాలు సంధించింది. ఈ ఘటనపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేయాలని కోరుతూ రిటైర్డ్ సైంటిస్ట్ కలపల బాబూరావు దాఖలు చేసిన పిల్‌పై మంగళవారం చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం, దర్యాప్తు అధికారుల తరఫున ఏఏజీ తేరా రజనీకాంత్ రెడ్డి వాదిస్తూ విచారణలో భాగంగా మొత్తం 283 మందిని ప్రశ్నించినట్లు, ప్రభుత్వం తరఫున రూ. 23 కోట్ల పరిహారం చెల్లించినట్లు తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ సిగాచీ రెడ్ కేటగిరీ పరిధిలో ఉన్న పరిశ్రమ కాబట్టి 12 శాఖల అధికారులు నిర్ణీత వ్యవధిలో తనిఖీ చేయాల్సి ఉందని, అది జరిగిందా అని ప్రశ్నించింది. దీనికి దర్యాప్తు అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు సరిగ్గా సంసిద్ధమై రాలేదు. మీపై ఏమైనా ఒత్తిళ్లు ఉన్నాయా? ఉంటే మీకంటే ఉన్నతాధికారులతో దర్యాప్తునకు ఆదేశిస్తాం. లేదంటే కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తునకు ఆదేశించాల్సి ఉంటుంది. ప్రైవేటు పరిశ్రమల యాజమాన్యాల బలం రోజురోజుకూ పెరిగిపోతోంది. కాంట్రాక్టు కార్మికుల గొంతు లేకుండా పోతోంది. నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప మిగతా వారికి గుణపాఠం రాదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఒక్కో మృతుని కుటుంబానికి సిగాచీ యాజమాన్యం ఇస్తానన్న రూ.కోటి పరిహారం ఏమైందని ధర్మాసనం ప్రశ్నించగా సమాధానం ఇచ్చేందుకు మరింత సమయం ఇవ్వాలని పరిశ్రమ తరఫు హాజరైన న్యాయవాది అశోక్‌రెడ్డి కోరారు. ఈ కేసులో కోర్టుకు సహాయం చేసేందుకు అమికస్‌క్యూరీ (కోర్టు సహాయకుడు)గా డొమినిక్ ఫెర్నాండెజ్ అనే న్యాయవాదిని నియమించింది. పూర్తి వివరాలతో మళ్లీ రావాలని ఆదేశిస్తూ విచారణను 30కి వాయిదా వేసింది.

## జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను గెలిపించండి

» బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల నుంచి పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బీసీలను మోసం చేసిన పార్టీలకు బుద్ధి చెప్పాలంటే, బీసీలంతా ఐక్యమై సర్పంచ్ సీట్లను అత్యధికంగా గెలిపించి తమ రాజకీయ చైతన్యాన్ని చాటి చెప్పాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో 9 ద్వారా బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే, రాష్ట్రవ్యాప్తంగా వారికి 5,380 సర్పంచ్ స్థానాలు దక్కేవని, కానీ జీవో 46 ద్వారా బీసీ రిజర్వేషన్లను 17 శాతానికి తగ్గించడంతో బీసీలకు రావాల్సిన సుమారు 3,400 రిజర్వు స్థానాలు జనరల్ స్థానాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల తలరాతలు మారాలంటే 'ఓటు మనదే.. సీటు మనదే' స్ఫూర్తితో బీసీలకు ఓటు వేయాలని కోరారు.

## 'గుడ్ షెపర్డ్' నిర్వాహకుల ఆస్తులు ఈడీ జప్తు

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై గుడ్‌షెపర్డ్ స్కూళ్లను నిర్వహిస్తున్న డాక్టర్ జోసెఫ్ డిసౌజా, ఆయన కుమారుడు జోష్ లారెన్స్‌ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. చిన్నారులు, జోగినిలు, దళితుల సంక్షేమం కోసం అందిన కోట్లాది రూపాయల నిధులను దుర్వినియోగం చేసినట్టు తొలుత సీబీఐ కేసు నమోదు చేసింది. దాంతో మనీలాండరింగ్ జరిగిందన్న కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. వారికి హైదరాబాద్‌లో ఉన్న రూ.3.58కోట్ల ఆస్తులను జప్తు చేసింది. వీటి విలువ మార్కెట్‌లో రూ.15కోట్ల వరకు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

## అమెరికాకు వెళ్లే విమానాలను పేల్చేస్తాం

» శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బెదిరింపు మెయిల్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు దుండగుల నుంచి మరో బెదిరింపు వచ్చింది. తమకు ఒక మిలియన్ డాలర్లు(సుమారు రూ.10 కోట్లు) ఇవ్వాలని.. లేకుంటే అమెరికాకు వెళ్లే అన్ని విమానాలను పేల్చేస్తామని జీఎంఆర్ కస్టమర్ సపోర్ట్ కేర్‌కు మంగళవారం సాయంత్రం 5.44గంటలకు మెయిల్ వచ్చింది. "యునైటెడ్ స్టేట్స్‌కు వెళ్లే అన్ని విమానాల్లో బాంబులను అమర్చాం. టేకాఫ్ తీసుకున్న 10 నిమిషాల్లో పేల్చేస్తాం. అలా చేయొద్దంటే ఒక మిలియన్ డాలర్లు ఇవ్వాలి" అని ఆ సందేశంలో ఉంది. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు.. అమెరికాకు వెళ్లే అన్ని విమానాలను బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీ చేశాయి. ఈ సోదాల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు దొరకలేదు. అత్యధికంగా శంషాబాద్ విమానాశ్రయానికి నవంబరు, డిసెంబరులో దాదాపు 23 సార్లు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.

## సికింద్రాబాద్-లాలాగూడ మధ్య ట్రాఫిక్ బ్లాక్

» ఈ నెల 19 నుంచి 21 వరకు పలు రైళ్ల దారి మళ్లింపు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-లాలాగూడ మధ్య రైల్వేట్రాక్ అభివృద్ధి పనుల కారణంగా.. ఈ నెల 19నుంచి 21వరకు రైల్వే అధికారులు ట్రాఫిక్ బ్లాక్‌ను ప్రకటించారు. దీంతో సికింద్రాబాద్ నుంచి నడిచే పలు రైళ్లు చర్లపల్లి నుంచే నడవనున్నాయి. వికారాబాద్ వైపు వెళ్లాల్సిన రైళ్లను చర్లపల్లి, సనత్ నగర్, లింగంపల్లి మార్గంలో అధికారులు దారి మళ్లించనున్నారు.

### తిరుపతి- చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి తిరుపతి, పండర్‌పూర్‌కు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసింది. డిసెంబర్ 16నుంచి 30 వరకు తిరుపతి-చర్లపల్లి, డిసెంబర్ 19 నుంచి జనవరి 2 వరకు చర్లపల్లి- తిరుపతి, డిసెంబర్ 21 నుంచి జనవరి 4 వరకు పండర్‌పూర్-తిరుపతి మధ్య రైళ్లు నడుపనున్నట్టు తెలిపింది.

## తిరుపతి నుంచి షిర్డీకి వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన తిరుపతి-షిర్డీను కలుపుతూ దక్షిణ మధ్యరైల్వే ప్రవేశపెట్టిన కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం ప్రారంభమైంది. రైల్వేశాఖ సహాయమంత్రి సోమన్న ఈ సేవలను ప్రారంభించారు. ఈ రైలు ప్రతి ఆదివారం ఉదయం 4గంటలకు తిరుపతిలో ప్రారంభమై, మధ్యాహ్నం 3.50 గంటలకు సికింద్రాబాద్‌కు, సోమవారం 10.45గంటలకు సాయినగర్ షిరిడీకి చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. తిరుగు ప్రయాణం ప్రతి బుధవారం షిరిడీలో మొదలై శుక్రవారం తెల్లవారుజామున తిరుపతికి చేరుకుంటుంది.

## కాన్వాయ్‌లో జామర్ కారుకు తప్పిన ప్రమాదం

» ఓఆర్ఆర్ ఎగ్జిట్17 వద్ద వెళ్తుండగా పేలిన కారు టైరు

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌లోని జామర్ కారుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ కారు వెనుక భాగంలో కుడి వైపున ఉన్న టైరు రన్నింగ్‌లో ఉండగా ఒక్కసారిగా పేలిపోయింది. అయితే డ్రైవర్ కారును చాకచక్యంగా నియంత్రించి పక్కకు తీసి ఆపడంతో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)లోని ఎగ్జిట్ 17 వద్ద సీఎం కాన్వాయ్ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని పోలీసు అధికారులు తెలిపారు. వెంటనే రంగంలోకి దిగిన ట్రాఫిక్ ఎమర్జెన్సీ బృందం ఆ కారు టైరు మార్చి కొద్ది సేపట్లోనే సీఎం కాన్వాయ్‌లో చేర్చారు.

## సీఎంవో, లోక్ భవన్‌కు బాంబు బెదిరింపులు

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీఎంవో, లోక్‌భవన్‌ను బాంబులతో పేల్చివేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తి ఈ-మెయిల్ చేయడంతో మంగళవారం ఉదయం పోలీసులు అప్రమత్తమయ్యారు. సీఎంవో, గవర్నర్ కార్యాలయానికి వాసుకీ ఖాన్ అనే వ్యక్తిపేరిట వచ్చిన ఈ-మెయిల్‌లో బాంబులు అమర్చామని, ఏ క్షణంలోనైనా పేల్చివేస్తామని హెచ్చరించడంతో పంజాగుట్ట పోలీసులు బాంబ్ స్క్వాడ్‌తో రంగంలో దిగారు. లోక్‌భవన్‌లోని సిబ్బందిని బయటకు పంపించి అనువణువు తనిఖీ చేశారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని తేల్చారు. ఈ-మెయిల్ పంపిన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని పంజాగుట్ట పోలీసులు తెలిపారు.

# మార్చి 14 నుంచి పదో తరగతి పరీక్షలు

» 6 పరీక్షలు.. నెల పాటు నిర్వహణ

» షెడ్యూల్ విడుదల చేసిన బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్



హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పదో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 14వ తేదీ నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మంగళవారం పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. గత పరీక్షలకన్నా భిన్నంగా ఈసారి ప్రధాన పరీక్షలను నెల రోజుల పాటు నిర్వహించనున్నారు. ప్రథమ భాష పరీక్ష మార్చి 14న ప్రారంభం కానుండగా.. చివరి పరీక్ష సాంఘిక శాస్త్రం ఏప్రిల్ 13న నిర్వహించనున్నారు. గత ఏడాది నిర్వహించిన విధంగానే ఈసారి కూడా ఒక్కో సబ్జెక్టుకు ఒకటి చొప్పున ఆరు పరీక్షలను మాత్రమే నిర్వహించనున్నారు. సీబీఎస్ఈ తరహాలో పరీక్షకు పరీక్షకు మధ్య విరామం ఇస్తూ విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చేయడం ఈ నూతన విధానం లక్ష్యమని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే కొత్త విధానాన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. నెల రోజుల పాటు పరీక్షల నిర్వహణతో విద్యార్థులపై మానసిక భారం ఎక్కు వగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

| తేదీ | పరీక్ష |
|---|---|
| మార్చి 14 (శనివారం) | ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్-ఏ) |
| మార్చి 18 (బుధవారం) | సెకండ్ లాంగ్వేజ్ |
| మార్చి 23 (సోమవారం) | థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లిష్) |
| మార్చి 28 (శనివారం) | గణితం |
| ఏప్రిల్ 2 (గురువారం) | సైన్స్ పార్ట్-1 భౌతికశాస్త్రం |
| ఏప్రిల్ 7 (మంగళవారం) | సైన్స్ పార్ట్-2 బయోలాజికల్ సైన్స్ |
| ఏప్రిల్ 13 (సోమవారం) | సాంఘిక శాస్త్రం |
| ఏప్రిల్ 15 (బుధవారం) | ఓరియంటల్ ఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 |
| ఏప్రిల్ 16 (గురువారం) | ఓరియంటల్ ఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 |

# డిసెంబరు 9.. రాష్ట్రానికి పర్వదినం

## రాష్ట్రం ఉన్నంత వరకు తెలంగాణ తల్లి అవతరణ, సోనియా జన్మ దినోత్సవం జరుపుకుంటాం

» ఇచ్చిన మాటకు కట్టుబడిన గొప్ప నాయకురాలు సోనియా: రేవంత్

» వర్చువల్‌గా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణ

» తెలంగాణ ప్రదాత సోనియా: మహేశ్

హైదరాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఉన్నంతవరకు డిసెంబరు 9న తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాన్ని, తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్షను నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదినోత్సవాన్ని జరుపుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో సోనియా గాంధీ స్ఫూర్తి, మన్మోహన్ సింగ్ విజన్‌ను ప్రస్ఫుటంగా అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాలను మంగళవారం ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్ వేదిక నుంచి సీఎం వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ డిసెంబరు 9, 2009న యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ నేతృత్వంలో ప్రధాని మన్మోహన్ సింగ్ తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారంటూ అప్పటి హోం శాఖ మంత్రి చిదంబరం ప్రకటించారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్షను ప్రతిబింబిస్తూ తీసుకున్న నిర్ణయం, ప్రకటన ఈ ప్రాంత ప్రజలకు సంతోషం ఇవ్వడమే కాకుండా ఆత్మగౌరవాన్నీ నిలబెట్టిందన్నారు. డిసెంబరు 9కి ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన ప్రజా ప్రభుత్వం.. ఆ పర్వదినాన్ని తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవంగా జరుపుకోవాలని అధికారికంగా నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.సోనియా గాంధీ జన్మదినం కూడా డిసెంబరు 9 కావడం సంతోషం కలిగించే విషయమన్నారు. గత ఏడాది డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఆవిష్కరించి పరిపాలనలో ఒక స్ఫూర్తిని తీసుకొచ్చామని చెప్పారు. ఈ ఏడాది అన్ని కలెక్టరేట్లలోనూ తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించుకున్నామన్నారు. దినచర్య ప్రారంభం కాగానే తెలంగాణ తల్లి ఆశీర్వాదం, స్ఫూర్తినీ తీసుకుని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమల్లో ముందుకు వెళ్లాలన్నదే సంకల్పమని తెలిపారు. కరీంనగర్ గడ్డపై 2004లో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడిన సోనియా గాంధీ ఎన్ని ఒడిదుడుకులు, అవాంతరాలు ఎదురైనా అధిగమించి రాష్ట్ర ఏర్పాటులో సంపూర్ణంగా సహకరించారని చెప్పారు. స్వరాష్ట్రం ఏర్పాటు కల నిజమైన తెలంగాణను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కాగా, సోనియా గాంధీ పట్టుదల, కృషి వల్లే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆనాడు ఆమె తలుచుకోకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఉండేదే కాదన్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మహేశ్ గౌడ్ భారీ కేక్‌ను కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ తల్లి.. తెలంగాణ ప్రదాత సోనియా గాంధీ అని కొనియాడారు. యూపీఏ చైర్‌పర్సన్ హోదాలో ఆమె మెజారిటీ ఎంపీలను ఒప్పించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను సాకారం చేశారన్నారు. తెలంగాణ యువత ఆత్మబలిదానాలతో చలించిన ఆమె.. సమస్యను అర్థం చేసుకుని రాష్ట్రం ఇచ్చారని చెప్పారు. కాగా, సోనియా గాంధీ జన్మదినం పురస్కరించుకుని మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే వినోద్‌కుమార్ తదితరులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మినిస్టర్స్ క్వార్టర్స్‌లో పనిచేస్తున్న సిబ్బందికి చీరలు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు.



భూపాలపల్లి కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం

### బీఆర్ఎస్ ఖేల్ ఖతం.. దుకాణం బంద్: మహేశ్ గౌడ్

రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఖేల్ ఖతం, దుకాణం బంద్ అయిందని, ఆ పార్టీ నేతల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. వాస్తవ పరిస్థితులు తెలిసే కేసీఆర్ బయటకు రావట్లేదని చెప్పారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించుకున్నామన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో ఊహించని విధంగా పెట్టుబడులు రావడం శుభపరిణామమని అన్నారు. కాగా, జిల్లా కాంగ్రెస్ కమిటీల (డీసీసీలు) కొత్త అధ్యక్షులు 6 నెలల్లో తమను తాము నిరూపించుకోవాలన్నారు. డీసీసీ అధ్యక్షులు, అనుంధ సంఘాల చైర్మన్లతో జూమ్ ద్వారా సమావేశమైన ఆయన.. జిల్లాల్లో అందరినీ కలుపుకొని పోవాలని సూచించారు.

# నువ్వు జైలుకు ఎందుకెళ్లావ్?

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. తమపై ఆరోపణలు చేసే కవిత.. జైలుకు ఎందుకు వెళ్లారో చెప్పాలన్నారు. ఆమె ఇంట్లో కుక్క పేరు కూడా విస్కీ అని పెట్టుకున్నారని తెలిపారు. "తెలంగాణ నుంచి ఢిల్లీ వరకు నీ అవినీతి భాగోతం నాకు తెలుసు. ఢిల్లీలో కేజ్రీవాల్‌ను నాశనం చేశావు. ఇప్పుడు కేసీఆర్‌ను, కేటీఆర్‌ను, బీఆర్ఎస్‌ను నాశనం చేయాలని చూస్తున్నావు. పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు దోచుకుతిన్నావు. రూ.1000కోట్ల భూకుంభకోణం చేశావు. అప్పుడు తండ్రి పేరు చెప్పుకొని, ఇప్పుడు రేవంత్‌ను అడ్డం పెట్టుకొని దందా కొనసాగిస్తున్నావు. నీ భర్తకు హైదరాబాద్‌లో ఆస్తులు ఎక్కడివి? బాలానగర్ ఐడీపీఎల్‌లో సర్వే నంబర్ 21, 22లో 36ఎకరాల భూమి నీ భర్త పేరిట ఎలా వచ్చింది?"అని కృష్ణారావు ధ్వజమెత్తారు. బతుకమ్మ పేరిట కవిత కోట్లాది రూపాయల విరాళాలు వసూలు చేశారని ఆరోపించారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి కూడా లేనంత పెద్ద ఇల్లు ఆమెకు ఉందన్నారు. బెదిరించి డబ్బులు వసూలు చేయడం కవితకు అలవాటు అని, ఈనాలుగు రోజుల్లో ఎవరెవరికి ఫోన్లు చేశారో తనకు తెలుసుని చెప్పారు. "తెలంగాణలో తిరిగే హక్కు నీకెక్కడిది? నువ్వు ఏ పార్టీ కోసం పనిచేస్తున్నావో ప్రజలు గమనిస్తున్నారు. మేం టీడీపీ నుంచి గెలిచాం. నువ్వు అనుకునే పార్టీ నుంచి కాదు. పదేళ్లలో నేనేం చేశానో కూకట్‌పల్లి ప్రజలకు తెలుసు. నీ ముఖానికేం తెలుసు? నీలాంటి కుక్కలు చాలా మొరుగుతుంటాయి. మరోసారి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నీ చిట్టా విప్పుతా. నీవల్ల ఎంత మంది బలయ్యారో బయటపెడతా"అని హెచ్చరించారు.

### అధికారం కోల్పోయాక దీక్షాదివస్, విజయ్ దివస్‌లు: కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విజయ్ దివస్ నిర్వహించడంపై జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శలు చేశారు. "అధికారం కోల్పోయాక దీక్షాదివస్‌లు, విజయ్ దివస్‌లు! ఇది ఉద్యమాల గడ్డ. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు' అంటూ 'ఎక్స్'లో కవిత పోస్ట్ చేశారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ.. అధికారం పోయాక అన్నీ గుర్తుకొస్తాయని వ్యాఖ్యానిస్తున్నారు.

## పంట దగ్ధమవుతదన్న భయంతో ఆగిన రైతు గుండె

**ములుగు జిల్లా వాజేడు మండలంలో ఘటన**

వాజేడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇరుగు పొరుగు రైతులు తమ పొలాల్లోని ఎండు గడ్డిని దగ్ధం చేసేందుకు పెట్టిన నిప్పు తన వరి కుప్పకు ఎక్కడ వ్యాపిస్తుందోనని భయాందోళనకు గురైన రైతు గుండెపోటుతో మరణించిన ఘటన ములుగు జిల్లా వాజేడు మండలం ఏడ్జర్లపల్లిలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన రామెళ్ల నారాయణ(55) ఇటీవలే తన ఎకరం పొలంలో వరి కోసి కుప్ప నూర్చాడు.ఇరుగు పొరుగు రైతులు తమ పొలాల్లో ఎండు గడ్డికి పెట్టిన నిప్పు కాస్తా.. నారాయణ వరి కుప్ప సమీపానికి చేరుకుంది. అప్పటి దాక మిర్చితోటలో పని చేసుకుంటున్న నారాయణ ఉరుకులు పరుగుల మీద అక్కడికి చేరుకుని మంటలార్పేందుకు ప్రయత్నిస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు అతడ్ని వెంకటాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే గుండెపోటుతో మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, నలుగురు సంతానం ఉన్నారు.

## వెండితెర వైభవం పేరిట సిలికానాంధ్ర తెలుగు లఘుచిత్రాల పోటీ

(డల్లాస్ నుంచి కిలారు గోకుల్ కృష్ణ)

వచ్చే ఏడాది ఆగస్టు 7,8,9 తేదీల్లో కాలిఫోర్నియాలో నిర్వహించనున్న సిలికానాంధ్ర సంస్థ రజతోత్సవాన్ని పురస్కరించుకొని 'అంతర్జాతీయ వెండితెర వైభవం' పేరిట తెలుగు లఘుచిత్రాల పోటీ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఈ పోటీలో పాల్గొనేందుకు నమోదు చేసుకోవొచ్చునని పేర్కొన్నారు. జూన్ 15న విజేతలను ప్రకటించి రజతోత్సవ వేదికపై బహుమతులను అందజేస్తామని వెల్లడించారు. ప్రథమ బహుమతి వెయ్యి డాలర్లు, రెండో బహుమతి 500డాలర్లు అందజేస్తారు. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా పోటీలో పాల్గొనవచ్చునని నిర్వాహకులు తెలిపారు. సమాచారం కోసం shortfilmfestival@SILICONANDHRA.ORG మెయిల్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంటెలిజెన్స్ మాజీచీఫ్ ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు బుధవారానికి వాయిదా వేసింది. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన ప్రభాకర్ రావును.. ప్రధాన నిందితుడిగా ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్) పేర్కొన్న విషయం తెలిసిందే. అమెరికాలో ఉన్న ప్రభాకర్‌రావకు సుప్రీం మధ్యంతర రక్షణ కల్పించడంతో ఆయన దేశానికి వచ్చి సిట్ విచారణకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభాకర్ రావు వేసిన మధ్యంతర పిటిషన్ మంగళవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ మహదేవన్ ధర్మాసనం ఎదుట మరోసారి విచారణకు వచ్చింది. అయితే, తెలంగాణ ప్రభుత్వం తరఫు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసు విచారణను ఒక్కరోజుకు(బుధవారం) వాయిదా వేయాలని కోరారు. ఈ విజ్ఞప్తిని కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

# న్యాయ చిక్కులే సమస్య

» ఎఫ్‌డీఐల రాకకు ఇవే అడ్డంకులు

» 'స్టెరిలైట్' ఎండీ అంకిత్ అగర్వాల్

» ప్రతిభకు భారత్ గ్లోబల్ లీడర్

» సింగపూర్ ఏజీఐడీసీ సీఈవో హోలాండ్

» 'పెట్టుబడులు, అభివృద్ధి'పై ప్యానల్ చర్చ

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) రావాలంటే... ప్రభుత్వాలు న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని స్టెరిలైట్ ఇండస్ట్రీస్ ఎండీ అంకిత్ అగర్వాల్ సూచించారు. ప్రస్తుతం పరిశ్రమలకు అనుమతులు, ఇతర వివాదాల పరిష్కారంలోనే ఎక్కువ కాలం గడిచిపోతోందని అన్నారు. అందుకే ప్రపంచ స్థాయి సంస్థలు భారత్‌కు రావాలంటే ఆలోచిస్తున్నాయని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా 'పెట్టుబడులు, అభివృద్ధి: పెట్టుబడి మార్గాలు, ఆర్థిక వ్యవస్థ వ్యూహం, ప్రధాన రంగాలు' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన చర్చా గోష్టిలో ఆయన పాల్గొన్నారు. డెలాయిట్ సౌత్ ఏషియా జీసీసీ ఇండస్ట్రీ భాగస్వామి రోహన్ లోబో వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో అంకిత్ అగర్వాల్ మాట్లాడుతూ... భారత్ ఐటీ పరిశ్రమపైనే ఆధారపడకుండా... తయారీ రంగంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు.

ఏ రంగంలోనైనా ప్రతిభలో భారత్ గ్లోబల్ లీడర్ అని, ఇలాంటి మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాల సింగపూర్ ఏజీఐడీసీ సీఈవో మైక్ హోలాండ్ సూచించారు. ఇక్కడ యువ జనాభా ఎక్కువ ఉండడం వల్ల వర్క్ ఫోర్స్‌ను పెంచుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆర్ఈ సస్టైనబిలిటీ లిమిటెడ్ వైస్ చైర్మన్ ఎం.గౌతంరెడ్డి మాట్లాడుతూ... కాలుష్య నియంత్రణ రంగంలోనూ పెట్టుబడులు రావాల్సి ఉందని అన్నారు. నీటి సంరక్షణ, సీవరేజ్ ట్రీట్‌మెంట్, రీసైక్లింగ్ రంగాల్లో పెట్టుబడులు రావాల్సి ఉందని తెలిపారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తేనే ఈ రంగాల్లో పెట్టుబడులు వస్తాయని చెప్పారు. రోహన్ లోబో మాట్లాడుతూ తెలంగాణ రూ.18 లక్షల కోట్ల జీఎస్‌డీపీ రాష్ట్రంగా అవతరించిందని, ఇందులో రూ.3 లక్షల కోట్లు ఐటీ రంగం నుంచే ఉన్నాయని తెలిపారు. తెలంగాణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి మాట్లాడుతూ...రాష్ట్రం ఫార్మా రంగంలో గ్లోబల్ హబ్‌గా అవతరించిందని చెప్పారు. తలసరి ఆదాయంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. ఫార్మా, ఐటీ, ఏరోస్పేస్, క్లీన్ మొబిలిటీ, సెమీ కండక్టర్స్, ఆహారశుద్ధిరంగాలు జీఎస్‌డీపీకి 60-70శాతం వాటా అందిస్తున్నాయని వివరించారు.

### జీసీసీల ఏర్పాటులో మూడో స్థానంలో తెలంగాణ

తెలంగాణలో ప్రస్తుతం 500 జీసీసీలు (గ్లోబల్ కాపబిలిటీ సెంటర్లు) ఉన్నాయని.. రానున్న పదేళ్లలో జీసీసీల ఏర్పాటుపరంగా దేశంలోనే తెలంగాణ మూడో స్థానంలో ఉండనుందని స్టెరిలైట్ టెక్ ఎండీ అంకిత్ అగర్వాల్ అన్నారు. భారతదేశం ఐటీతో పాటు ఉత్పాదక రంగంపైనా దృష్టి పెట్టి, ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 'తెలంగాణ రైజింగ్ -గ్లోబల్ సమ్మిట్'లో జీసీసీలపై మంగళవారం జరిగిన ప్యానల్ చర్చలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వినియోగదారుల పరంగా భారత్‌లో పెద్ద మార్కెట్ ఉండడంతో ప్రపంచ స్థాయి కంపెనీలు దేశంలో పెట్టుబడులకు ముందుకొస్తున్నాయన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే సుస్థిరమైన ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, ఇందులో ప్రధానంగా నీటి వనరులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని రాంకీ ఎన్విరో ఇంజనీర్స్ ఎండీ గౌతమ్‌రెడ్డి అన్నారు. ఒక్క హైదరాబాద్‌లో జరిగినంత మేర దేశంలో మరే నగరంలో సీవరేజీ ట్రీట్‌మెంట్ జరగడం లేదని స్పష్టం చేశారు. దేశంలో ఏ నగరంలో కూడా కుళాయి నుంచి వచ్చే నీటిని నేరుగా తాగే అవకాశాలు లేవని.. కానీ, రాష్ట్రంలో సురక్షిత తాగునీటిని కుళాయి ద్వారా అందిస్తున్నారని గుర్తు చేశారు. కాగా.. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు త్రీ పిల్లర్ రోడ్‌మ్యాప్‌ను అమలు చేస్తున్నామని పరిశ్రమల శాఖ సంచాలకుడు నిఖిల్ చక్రవర్తి తెలిపారు.

## 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమేనని ప్రపంచమంతా చెప్పింది

» రాష్ట్ర యువతను అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి

» ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



హైదరాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్-2047'లో నిర్దేశించుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధన సాధ్యమేనని ప్రపంచమంతా చెప్పిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు తెలిపారు. సీఎం, మంత్రుల సూచనల మేరకు తాము పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇది ఎలా సాధ్యమని చాలా మంది ప్రశ్నించారని, కానీ ఈ రోజు సదస్సు ద్వారా ప్రపంచమంతా అది సాధ్యమేనని చెప్పిందన్నారు. అందులో భాగంగానే సదస్సు మొదటి రోజు దాదాపు రూ.3 లక్షల కోట్లు, రెండో రోజు మంగళవారం రూ.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరాయని వివరించారు. నిజానికి చాలా తక్కువ సమయంలో ఇంత భారీ మొత్తంలో ఏ రాష్ట్రంలోనూ ఎంవోయూలు కుదరలేదని చెప్పారు. ఇది అంకెలు మాత్రమే కాదని, లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాయన్నారు. రాష్ట్ర యువత అవకాశాల కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదని, అవకాశాలు వారిని వెతుక్కుంటూ వస్తాయని తెలిపారు. తెలంగాణ దేశంలోని ఏ రాష్ట్రం, ఏ నగరంతో పోటీ పడాలనుకోవడం లేదని, ప్రపంచంతో పోటీ పడాలనుకుంటోందని చెప్పారు. ఇన్నోవేటివ్ ఫ్యాక్టరీగా మారాలనుకుంటోందన్నారు.

## గ్లోబల్ సమ్మిట్‌పై హరీశ్‌రావుది కడుపుమంట

ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మోడల్ రాష్ట్రంగా తెలంగాణ అభివృద్ధి చెందుతుంటే, మాజీ మంత్రిహరీశ్‌రావు చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో తొలిరోజునే సుమారు రూ.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని ఆయన వెల్లడించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరిగి ఈ ప్రపంచ స్థాయి సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి 3,000 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారని, దీంతో తెలంగాణ పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గత పదేళ్ల ప్రభుత్వ హయాంలో కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని ప్రైవేట్ లిమిటెడ్‌గా పరిపాలన చేసి దోచుకుందని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పారని ఆయన విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆదరణపై హరీశ్‌రావు కడుపు మంటతో మాట్లాడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ విమర్శించారు. సమ్మిట్‌ను 'గోబెల్స్ సమ్మిట్' అంటూ హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. పదేళ్ల పాలనలో లక్షల కోట్ల అప్పులు చేసి, కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ ప్రజలకు భ్రమలు చూపించారని దయాకర్ ఆరోపించారు. హరీశ్‌రావు పదేళ్ళ కమిషన్ల కక్కుర్తి మంత్రిగా పనిచేశారని, బావబామ్మర్దులు (కేటీఆర్, హరీశ్‌రావు) పోటీపడి రాష్ట్రాన్ని దోచుకున్నారు తప్ప, ఎటువంటి విజన్ లేకుండా పాలించారని విమర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.